
ఆంధ్రసచిత్రవార

పత్రిక

రైలు ప్రయాణాలు



17-11-61



ఏడుకొండలవాని రథోత్సవం

ఫొటో: భరణీకుమార్ (మద్రాసు)

1-12-'61

ఆంధ్ర సచిత్ర వారపత్రిక


నుంచి

ప్రారంభం

భూగర్భంలోనికి

సాహసయాత్ర

'80 రోజుల్లో భూప్రదక్షిణం' రచయిత జూల్స్ వెర్న్
రచించిన మరొక ప్రఖ్యాత నవల


1936 నుంచి
దక్షిణ భారతానికి
చేస్తున్న సేవ
25 సంవత్సరాల క్రిందట 1936 నవంబరు 23 వ తేదీన మెట్టూరు ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రారంభమైంది. ఇన్ని సంవత్సరాలుగా మా మిల్లు, లాంగ్‌క్లాత్‌లు మల్లెపువ్వులాగుండే మేలు వస్త్రాలని ప్రసిద్ధి తెచ్చుకొన్నాం. ఈనాడు అవి దక్షిణ భారతావని అంతటా సరసమైన ధరలకు లభించుతూ, మన్నికగల వస్త్రాలని అబాల గోపాలానికి తెలుసు.
భవిష్యత్తులో కూడా ఉత్తమ ప్రజాసేవ చేస్తుండాలని ఈ శుభ సమయంలో మేము కోరుకొంటున్నాం.
మెట్టూరు ఇండస్ట్రీస్ లిమిటెడ్
మెట్టూరు డామ్ ఆర్. ఎస్. సేలం జిల్లా
దక్షిణ భారత దేశానికి
25 సంవత్సరాల సేవ
మేనేజింగు ఏజంట్లు
డబ్ల్యు. ఏ. బియర్డ్‌సెల్ & కంపెనీ (ప్రైవేట్) లిమిటెడ్
మద్రాసు – 1.
FDS/MI I TE

ఉత్తరాలు

ఆదర్శాలు-అంతర్యాలు

ఆదర్శాలు—అంతర్యాలు సీరియల్ "అయిపోయింది" అని పత్రికలో చూడగానే—నాకు నచ్చిన వస్తువును ఏదో పోగొట్టుకున్న వాడి లాగా ఒక రోజు అంతా బాధ పడ్డాను రచన చాలా హృదయ రంజకంగా ఉంది.

జి అప్పలాచారి (శ్రీకాకుళం)

*   *   *

"ఆదర్శాలు—ఆంతర్యాలు" ముగింపు నేనను కొన్నట్లే అయింది ఆధునిక నవలల్లో అత్యుత్తమమైన కథాసంవిధానము చూపిన కీర్తి శ్రీ సింగరాజు గారికి దక్కుతుంది చక్కటి రచనా శైలితో మమ్ముల నానంద పరచిన రచయితకు నా అభినందనలు.

యస్ నాగిరాజరావు (కడప)

*   *   *

"ఆదర్శాలు—ఆంతర్యాలు" కథ ముగిసింది కాని మనస్సు లో ఆ కథ మరపురాని స్థాన మేర్పరుచు కుంది పాఠకులకు! ఆఖరి లో రాజారావు అలివేణిని వివాహం చేసుకున్నాడంటే! లలితకు అన్యాయం చేశాడేమో అనిపిస్తుంది!

యం మదన్ (హైదరాబాద్)

*   *   *

"ఆదర్శాలు—ఆంతర్యాలు" చలా చక్కని నవల కాని లలితను పెళ్ళి చేసు కొంటాడను కొన్న రాజారావుకు అలివేణితో పెళ్ళి జరిపించడం ఎక్కువ మంది పాఠకులకు నిరాశ కల్గించింది. అలివేణి చలమయ్యతో గడుపుతూవుండడం చూస్తూ వున్న రాజారావు ఆమెను పెళ్ళి చేసుకోవడం ఆమె అందాన్ని చూచే, ఆమెకోసం వెళ్ళి పోయాడని పిస్తుంది

యం యస్ శాస్త్రి (అమలాపురం)

*   *   *

"ఆదర్శాలు—ఆంతర్యాలు ముగిసినందుకు చింతిస్తున్నాను. రాజారావు అలివేణిని చేసుకొని ఉండుట మంచిగా ఉన్నది

బోయినిపల్లి భుజంగరావు (హైదరాబాదు)

*   *   *

రాజారావు హఠాత్తుగా అలివేణిని పెండ్లాడుతాడని కలలో కూడా ఊహించలేదు. ఆమె చేసిన సహాయమునకు, ఆమెకు బ్రతుకు తెరువు చూపించి వాడు కనుక వివాహ మాడుట వలన అతని ఆదర్శము దెబ్బ తినినదని నా వుద్దేశము అతని ఆదర్శము లోని ఆంతర్యమేమిటో అర్థం కావటం లేదు. ముగింపుగా లలితను ,రాజారావు వివాహం చేసుకోక పోయినప్పటికిన్ని, కథ అంతటితో వదలితేబాగుండేది.

యం నళినీదేవి (విజయవాడ)

*   *   *

స్త్రీల రచనలేనా?

దసరా సంచిక పై 'కంభం' సోదరులు రాసిన అభిప్రాయం స్త్రీ లకి ఎంతో కోపం తెప్పించేలా వుంది యావద్భారతీయుల్లో స్త్రీలు లేరూ? అసలు ఆమాట కొస్తే ఆ పత్రికలో అన్నీ స్త్రీల రచనలే ప్రచరించాల్సి వున్నది దసరా ఎండగ ఎలా వచ్చిందట? మహిషాసురినితో గొప్ప గొప్ప పురుషులందరూ యుద్ధంలో ఓడిపోగా ఆ రాక్షసుడిని చంపి దేవతలను రక్షించిన దెవరో తెలిసి ఉంటే పై అభిప్రాయం ఆ సోదరులు తెలిపే వారుకారేమో? కేవలం పేర్లు పత్రికలో పడటానికే అలా రాసిన ట్టున్నారు.

ఎ పార్వతిరావు (దుర్గాపూర్)

*   *   *

పెద్ద టపాకాయ

"పెద్ద టపాకాయి" అనే శీర్షిక క్రింద మీరు వ్రాసిన విషయంలో రెండవ పేరా చివరి వాక్యం నాకర్థం కాలేదు రష్యా అణుబాంబుగురించి వ్రాస్తూ—"బ్రిటిష్ ప్రభుత్వం ఏడాదికి లోపుగా చిన్న పిల్లలకు పాలపొడి సరఫరా కు ఏర్పాట్లు చేస్తున్నట్లు వార్త వెలువడింది" అని తెలియజేశారు

రష్యావారి 50 మెగా టన్నుల అటంబాంబుకి బ్రిటిష్‌వారి పాలపొడికి గల సంబంధం తెలియ చేస్తారా!

కె వి నరసింహారావు (కొత్తపేట)

ఈ బాంబు పరీక్షవల్ల తాజాగా తీసిన పాలలో రేడియో ధార్మికశక్తి ఉన్నదనే అనుమానమే ఈ సంబంధం.

*   *   *   *

ఆంధ్రుల చిత్రకళ

"ఆంధ్రుల చిత్రకళ" అన్న వ్యాసము చాలా బాగుంది ఇటువంటి వ్యాసాలు ఎప్పుడైనా కనీసం పొరపాటుగానైనా ప్రచురిస్తారేమోనని ఆశతో చూశాను ఈ నాటికి ఆ ఆశ ఫలించింది ఎంతసేపూ గాజులు, బేరసారాలు — ఇటువంటి వ్యాసాలేకాని ఎప్పుడైనా చిత్రకళను గురించిన వ్యాసాలు ప్రచరిస్తారేమోనని చూశాను ఆఖరికి కోపం కూడా వచ్చింది. కానీ 'తనకోపమే తన శత్రువ'ని మాట్లాడ కుండా ఊరు కున్నాను ఇంతలోనే అదృష్టవశాత్తూ ఈ వ్యాసం ప్రచురించారు అటువంటి వ్యాసాలు ఎవరూ వ్రాయకపోవటంవలన ప్రచురించటంలేదో లేక వ్రాసినా వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియుటం లేదు శ్రీ ఎస్. వి రామారావుగారు వ్రాసినట్లు ఇప్పుడు ఎందుకనో ఆంధ్రులలో అంత కళాభిరుచి కనిపించటం లేదు. వారు చెప్పినట్లు ఈ విషయంలో మన ప్రభుత్వం వారు, ప్రజలు కూడా తగిన శ్రద్ధ తీసుకొంటే బాగుంటుంది. చిత్రకళాభి వృద్ధిని గురించి వారు ఇచ్చిన సలహాలు పాటించ తగినవి ఇంత చక్కని వ్యాసం వ్రాసి నందుకు శ్రీ ఎస్ వి రామారావుగారికి నా కృతజ్ఞతా పూర్వకాభినందనలు.

విస్ వై (తెల్రపోలు)

కార్టూన్లు

అక్టోబరు 25 వ తారీఖున వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రికలో చుండూరు నుండి ఆర్. ఎస్. రెడ్డిగారు "ఎవరైనా డ్రింకులు తాగేటప్పుడు గ్లాసు ముందుపెట్టుకొని త్రాగుతారు. అందులో గడ్డము వెనుక పెట్టుకొని త్రాగినట్లు వేసినారు. సుందర్‌గారు వేసిన కార్టూన్ అసంబద్ధముగా నున్నదని" వ్రాశారు

కాని వారు దానిలోని హాస్యమును గ్రహించ లేదని నా అభిప్రాయము నేను, ఆ కార్టూన్‌ను యీ విధముగా సమర్థిస్తాను. డ్రింకు తాగుతున్న వ్యక్తి దొంగతనముగా గడ్డము వెనుక నుంచి త్రాగి వేస్తున్నాడు. సర్వరు "ఇక్కడ పెట్టిన డ్రింకు గ్లాసు ఏదా ?" అని ఆశ్చర్య పోతున్నాడు. దీనిలో అసందర్భ మేమి కలదు ?

ఎ శ్రీహరిరావు (ఏలూరు)

*   *   *

బి స్వర్ణమాలగారు వేసిన కార్టూను చాలా అసాధ్యమైన విషయం సైనికుడు గుర్రం తోక మీద ఎల్లా కూర్చో గలిగాడు కూర్చుంటే తోక వంగదా ?

వై వెంకటరామశాస్త్రి (పెద్దాపురం)

*   *   *

హమేషా తమాషా

హమేషా తమాషా చాలా బాగుంది ఇంకా కొన్నాళ్ళ పాటు వేస్తారని నమ్ముతున్నాను

పి సరోజ (పాల్వాడ)

మేమూ నమ్ముతున్నాము

*   *   *

ప్రాచీన ఆయుధాలు

మన ప్రాచీన ఆయుధాలు అను ప్రత్యేకవ్యాసము నన్ను ఎంతో మహదానంద పరచింది

యం శివసుబ్రహ్మణ్యం (గుడివాడ)

*   *   *

చదువుబ్రావు

బి వి సత్యమూర్తిగారి "చదువుబ్రావు" శీర్షిక చదువుతున్నాను. దానికి ఆ పేరు ఎందుకు పెట్టినారో తెలుప వలసిందిగా ప్రార్థిస్తున్నాను. అది నేటి యువకులకు గుణపాఠం

వి వి రమణారావు (విశాఖపట్నం)

మీరే ఆలోచించి చూడండి

*   *   *

'చదువుబ్రావు' శీర్షిక చాలా సహజంగావుంటోంది. నేటి చదువుబ్రావులు (స్టూడెంట్సు) ఇలాగే ఉంటారంటే అతిశయోక్తి కాదనుకుంటాను

గరికపాటి తంబి (కొత్తగూడెం)

సందేహం

బాపూగారు వచ్చిన తరువాత రేఖా గారి బొమ్మలు వేయుటం లేదేం ?

పి. రాజగోపాల్.

ఏమో !

శుక్రవారం · 17-11-61

ప్లవనామసం॥ కార్తిక శు॥దశమి

సంపుటము : 54 సంచిక : 11

స్థాపితము:

1908

*

ముఖ్యసంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*

విడి ప్రతి : 25 న. పై

సంవత్సర చందా : 13-0-0 రు.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము

7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

★

రచయితలకు విజ్ఞప్తి

రచయితలు తమ రచనలతోను, రేఖా చిత్రములతోను, తగినన్ని తపాలా బిళ్ళలు అంటించి, చిరునామా వ్రాసిన కవర్లు జతచేసి పంపగోరుతాము. అట్లా పంపితేనే నిరాకరించిన రచనలను మరి కొంత త్వరగా త్రిప్పి పంపటం సాధ్యమవుతుంది.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక


వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు


విషయానుక్రమణిక

ముఖచిత్రం· బి. సరోజాదేవి

శ్రీశైల ఆలయ ఉద్ధరణ నిధి


'ఆంధ్రపత్రిక' సేకరిస్తున్న శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివారి ఆలయ ఉద్ధరణ నిధికి నవంబరు 10 వ తేదీనాటికి రు. 72,222-66 వసూలు అయింది. యథాశక్తి విరాళాలు ఇచ్చి ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందని ప్రజలకు, ప్రజాసంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాము. విరాళాలు 'ఆంధ్రపత్రిక' కే గాని, ఆంధ్ర సచిత్ర వారపత్రికకు పంపరాదని మనవి చేస్తున్నాము.




ఈ మాత్రానికే ఏం కొంప మునిగిందని యింత దిగులు నీకు?!

న్యూఢిల్లీ లేఖ

కామన్వెల్తులో భారతదేశం స్థానం: ఎన్నికలముందు గోవా జాతీయోద్యమం



శ్రీ నెహ్రూ లండన్ వెళ్లేముందు పాలం విమానాశ్రయంవద్ద ఆయనకు వీడ్కోలు దృశ్యం — ఈ నెల 14 వ ఆయన జన్మదినం.

ఈమధ్య పత్రికలు అంతరంగిక వ్యవహారాలకు సంబంధించిన వార్తలే అధికంగా ప్రచురించాయి న్యూఢిల్లీలో గవర్నర్ల సమావేశం, విశ్వ విద్యాలయాల ఉపాధ్యక్షుల సమావేశం, కేంద్ర పారిశ్రామిక సలహా సంఘం ప్రభుత్వంపైనా, 'ప్లానింగ్ కమిషన్'పైనా చేసిన విమర్శలు, గోవా 'విముక్త దళాలు' సరిహద్దు ప్రాంతాలను ఆక్రమించి పోటీ ప్రభుత్వం నెలకొల్పటానికి నిశ్చయించినట్లు 'గోవా జాతీయోద్యమం' అధ్యక్షురాలు శ్రీమతి ఆనఫాలీ చేసిన ప్రకటన, మాస్టర్ తారాసింగ్ ఢిల్లీ ప్రయాణం, ఇటీవల ఢిల్లీలో సింహళ—భారతదేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒడంబడిక మొదలైనవి

ఇక విదేశ వార్తలు 'కెన్యా, ఆఫ్రికన్ నేషనల్ యూనియన్' (కెన్యాలో జాతీయ పక్షాలలో పెద్దది) నాయకత్వం వహించటానికి శ్రీ జోమో కెన్యాట్టా అంగీకారం, రష్యాను 50 మెగాటన్నుల అణ్వస్త్ర పరీక్ష ఆపవలసినదని కోరుతూ 'రాజకీయసంఘం' చేసిన తీర్మానానికి ఐక్యరాజ్యసమితి ఆమోదం, కాంబోడియాకు వ్యతిరేకమైన కార్యకలాపాలు సాగించవద్దని అమెరికాకు కంబోడం సిహనుక్ చేసిన 'తుది' హెచ్చరిక, బెర్లిన్ సరిహద్దులనుంచి అమెరికా, రష్యా టాంకుల ఉపసంహరణ, సోవియట్ కమ్యూనిస్టు పార్టీలో ఎక్కువ ప్రజాస్వామ్యంకోసం మాస్కో కమ్యూనిస్టుపార్టీ సమావేశంలో ప్రతిపాదించిన కొత్త నిబంధనలు, ఆల్జీరియాలో ప్రజల ఇష్టానుసారమే ప్రభుత్వ విధానాలు నడపగలవని ఫ్రెంచి ప్రభుత్వం ప్రకటన వగైరా

'ఉత్తర రైల్వే'లో జరిగిన ప్రమాదం, తాము ఈ 'పదవీకాలం' పూర్తి కాగానే 'రిటైర్' కాగలమని రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ గవర్నర్ల సమావేశంలో చేసిన ప్రకటన, అదే సమావేశంలో భారతదేశం అణ్వస్త్ర పరీక్షలపై న చేసిన తీర్మానం బలపరుస్తూ శ్రీ నెహ్రూ ప్రసంగం, భారత ముస్లింలీగ్‌లో అభిప్రాయ భేదాలు, అలీఘర్ విశ్వవిద్యాలయం ఒప్పర పైన కేంద్ర ప్రభుత్వ విచారణ జరుగదని శ్రీ నెహ్రూ చేసిన ప్రకటన, 'నాగాలాండ్'లో అవసరమైన సంస్కరణలు ఇవన్నీ కూడా ప్రాముఖ్యం వహించాయి

ఈ మధ్య బ్రిటిష్ ప్రభుత్వం కామన్వెల్తు ప్రజలు స్వేచ్ఛగా బ్రిటన్‌కు తరలి వెళ్ళిపోయి స్థిర పడిపోవటం అరికట్టాలని ప్రయత్నిస్తున్నది దీని విషయమై భారతదేశం బ్రిటన్‌కు ఒక 'అధికారపత్రం' అందజేసింది వార్తా పత్రికలలో దీనిని గురించి చాలా ఊహాగానం జరిగింది బ్రిటిష్‌రాణి అధికార పూర్వకంగా ప్రసంగించిన తర్వాత 'కామన్స్ సభలో' 'ఒక బిల్లు' ప్రతిపాదన జరిగే సూచనలు ఉన్నాయని ఆ 'వార్తలు' తెలుపుతున్నాయి ఈ 'బిల్లు' ప్రకారం, నేరాలుచేసి, శిక్ష పొందిన వారిని దేశంనుంచి బహిష్కరించే హక్కు స్వదేశీయ వ్యవహారాలమంత్రికి (హోమ్ సెక్రటరీ) ఉంటుంది

భారతదేశం కామన్వెల్తులో తనకు ప్రత్యేకమైన స్థానం కావాలంటున్నది 'సమష్టి విధాన'తో బ్రిటన్ ప్రవేశం పనికిరాదు అది భారత దేశానికి దెబ్బ బ్రిటన్‌లోకి తరలివచ్చేవారిని ఆపకూడదు అలా చేస్తే భారతదేశానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన ట్లవుతుంది భారతదేశం మాత్రం ఇక్కడకువచ్చి, స్థిరపడపోయేవారిని ఆపటంలేదంటున్నారు ఇంతేకాక, బ్రిటిష్ నౌకలు రవాణా 'రేట్లు' అధికంచేస్తే, భారతదేశం ఎగుమతులు దెబ్బతింటాయంటున్నారు

ఈ పరిస్థితిని ఒకదాని తర్వాత ఒక దానిని పరిశీలిస్తాము భారత—బ్రిటిష్ దేశాలమధ్య వర్తక సంబంధాలు ఒక వాణిజ్య ఒడంబడిక ప్రకారం నడుస్తున్నాయి ఈ ఒడంబడికలో 'ఒప్పారా ప్రిఫరెన్స్' (గిరాకీలకు సంబంధించినది) ఒక అంశం ఈ ఒడంబడికనే కాంగ్రెస్‌వారూ, 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్' (వాణిజ్య సంఘాల సమాఖ్య) వారూ కూడా ఖండించారు కేంద్ర

(62-వ పేజీ చూడండి)

దీపావళి టపాకాయలు పేలుస్తూ ఊమెన్ చెయ్యి కాల్చుకున్నారు ఈ వారం వారి కార్టూన్‌లు ప్రచురించలేకపోతున్నాము



"లేమ్మోయీ! కాఫీ తపస్వి దిశ లాలేఖ్యంబుగా మారె, పాత్రమ్మున్ నింపుము స్ట్రాంగగు కాఫీ రసంబునన్......" అని శర్మ శేషు నుద్దేశించి భూపాలరాగంలో ప్రత్యూష ప్రబోధం చేస్తున్నాడు.

"ఉండ్రా! పానకంలో పుడకలాగ మంచికలను పాడు జేస్తున్నావ్!" అని శేషు విసుకున్నాడు రెండోవేపు తిరిగి పడుకుంటూ.

ఒక లానాటిపుస్తకంలోంచి తలెత్తకుండానే వర్మ "ఒరే! వివాహం కాంట్రాక్టు అయితే విడాకులు టార్ట్సుల క్రిందికి జమ వస్తుందా?" అని ప్రజల నుద్దేశించి ఒహ ప్రశ్నా బాణాన్ని విసిరాడు.

శర్మ మొహం అద్దంలో చూసుకుంటూ, "నువ్వు ప్రశ్నించేది నన్నేనా?" అనడిగాడు.

వర్మ "నిన్నుగాక మరి కలలుగంటున్న ఆ శేషు నడిగాననుకుంటున్నావా? లేక గోడర్ని ప్రశ్నించా ననుకుంటున్నావా?" అని బోల్డు కోప్పడిపోయాడు స్నేహితుడిమీద.

"నీ ప్రశ్నకు ఏ సాల్మన్‌వంటి మహానుభావుడో జవాబు చెప్పాలోయ్! నేను చెప్పలేను. పైగా చదువుమీద నా కేమంత విశ్వాసంలేదు" అన్నాడు శర్మ

"ఔ నౌను. ఆ విషయం నాకు తెలీదు గనకనా!" వర్మ అతడితో ఏకీభవించాడు.

"అనుభవం ద్వారా మంచి విద్య అలవడుతుందని నా విశ్వాసం. ఇప్పుడు నువ్వు భట్టీయం వేసిన ఈ చదువంతా జీవితంలో ప్రవేశించాక దమ్మిడికి కొరగాదు ఎలాగూ బీయల్ పాసయాక బోర్డు తగిలించుకుంటాంకదా!! అప్పుడే "లా" పుస్తకాలన్నీ క్షుణ్ణంగా చదువుకోవచ్చు. ఇప్పటినుండే వృధాశ్రమ ఎందుకు?"

"నీ అభిప్రాయంప్రకారం నడచుకుంటే బోర్డు కాదుగదా, మెడలోచాట తగిలించుకోవాలి" అన్నాడు వర్మ పుస్తకాన్ని టక్కున మూసేస్తూ.

"పోనీయవోయ్! నా అభిప్రాయాలు నావి. నాబోటి వెర్రి పీనుగొకడు పరీక్ష ఫెయిలయితే దేశానికేం నష్టం?

"నిజమే! దేశానికేం నష్టం? నీకుగాని!"

"అంత సంకుచితంగా మాటాడుతావేమిటోయ్! పది హేడో శతాబ్దంలో వున్నట్టు!! నీవు సక్సెస్‌ఫుల్ లాయరు కాదలచుకున్నావా, ఈ మంత్రం విను. ఇది నా కొహాయన చెప్పాల్లే జాగ్రత్తగా వినుస్మీ. కోర్టులో వాదించేప్పుడు లాపాయింటు నీ పక్షానవుందనుకో. మోతెక్కిపోయేలా జడ్జీ చెవుల్లో ఆ పాయింటు మోగించు. లేదా మాంచి సాక్ష్యం నీ పరంగావుందనుకో. జూరీ హడలి పోయేలా వారి చెవుల్లో ఈ విషయాన్ని మోగించు! ఇంతే సూత్రం!"

"మరి లాపాయింటూ సాక్ష్యం రెండూ లేక పోతే?"

"అప్పుడు టేబిల్‌మీద గట్టిగా మోగించు. నీదే గెలుపు"

శేషు తక్షణంలోనే కళ్ళువిప్పి కోపంగా శర్మ కేసిచూస్తూ, "ఓరే! కాసేపైనా సుఖంగా పడుకో నీకుండా ఏం అరుస్తున్నావురా వెవలాయీ!" అన్నాడు.

"వెవలాయకాదురా! వాడు వె. వ. లాయరు" అన్నాడు వర్మ గుడ్లు మిటకరిస్తూ, అవ హేళనగా.

"దయచేసి వివరించ ప్రార్థన" అన్నాడు వర్మతో శర్మ.

"వె. వ. లాయరు అనగా "వెడవదరుబోతు లాయరు" అని అర్థం!" అని వర్మ విడ మర్చాడు. శర్మకు ఏమనాలో తెలీక కోపంగా వాడివేపు క్షణ కాలం చూశాడు. వర్మ ఆ చూపుకి గజగజ వణకలేదు. శేషు నిట్టూరుస్తూ, "ఇద్దరు కలిసి మాంచికలను పాడుజేశార్రా!" అని విచారించాడు.

"నాయనా, శేషూ!....."అని శర్మ తన లెక్చరు ధోరణి ఆరంభించబోయాడు.

"చాలించరా, గోల!" అడ్డొచ్చాడు శేషు.

"మాంచి కల అనడమేగాని మాతో చెప్పి ఏడుస్తేగా!" అన్నాడు వర్మ.

"గాయకుడు:- నా పాటకచ్చేరి వినుటకు చాలామంది గుమిగూడి నట్లుందే!

ఎదుటివ్యక్తి:- వచ్చిన వాళ్ళం దరూ గాడిదలను పోగొట్టుకొన్న చాకలివాళ్ళే గదా!!

జి. వి. శ్రీధర్. (మద్రాసు)

"పోనోయ్! నీతో చెబితే ఆర్చేవాడివా, తీర్చే వాడివా?" అన్నాడు శేషు చులకనగా.

శర్మ సంభాషణలో చోటు చేసుకుంటూ, "పోన్లే! వాడు తీర్చలేకపోతే నేను తీర్చగలనుగా!" అన్నాడు.

"ఆ! బోడి! మహాతీర్చావులెద్దూ!!" మరింత ఎత్తేశాడు శర్మని శేషు.

"ఒరేయ్! నాతోనుట్రా! అలా మాటాడేది! చిన్నా పెద్దా భేదం లేదూ? సాయంత్రం లోపలే నువ్వు నా దగ్గరకి పరుగెత్తుకురాకపోతే చూడు" అన్నాడు శర్మ తన కేదో ఇతరుల కష్టాలు తీర్చడమే పని అయినట్టు.

వర్మ "ఆర్చగలిగితేనే నీ కల వినాలన్నమాట. లేకపోతే వినకూడదా?" అనడిగాడు.

"ఎందుకు వినకూడదూ? నే జెబుతావిను వాడికల" అన్నాడు శర్మ వర్మ నుద్దేశించి.

"శభాష్! ఇది మరోపోజు! చెప్పు చూదాం చాత నయితే" ఛాలెంజి చేశాడు శేషు.

"చెబుతావిను. అరే వర్మా! పూర్వకాలమున నొకానొక నూరిలో వంకీలజుత్తుగలవాడును, ధరింపబడిన టిప్‌టాప్ దుస్తులు గలవాడును, ఫలానా పేట నగరంలో చదవబడుచున్న బియతో క్లాసువాడును అగు శేషు అను నొక కుర్రవాడుండెను."

"సరే! ఈ కథ ప్రజలందరికీ తెలుసు" అన్నాడు వర్మ.

"ఇహ తర్వాతది వినుము, సదరు—అనగా పై జెప్పబడినశేషు అనువాడు మనోహరరూపముగలదియును, నిత్యద్విజటాధారియును, సౌందర్యమకుట దివ్య కిరణ సందీప్తయును, సదరు శేషుకు పై జెప్పబడిన బియల్ క్లాసుతో మేటును అయిన ఉషాదేవిని ప్రేమించెను"

శేషు దిగ్గున లేచి కూర్చున్నాడు. "హోర్! ఎలా వూహించావురా?" అనడిగేశాడు ఆశ్చర్యం పట్టలేక.

"గాలినిచూసి పసికడతానోయ్ బ్రదర్! సామాన్యుడిననుకున్నావేమో!" అన్నాడు శర్మ మోర విరుచుకోబోయి ప్రమాదం జరుగవచ్చునని తప్రయత్నం విరమించుకున్నవాడై.

శేషు, "ఎలా తెలుసుకున్నావురా?" అని తిరిగి ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"మరోటి చెబుతా వినురా వర్మా! ఈ కథా నాయకుడు వో పుస్తకాలకట్టను నిన్న కాలేజినించి మోసుకొచ్చాడు. సదరు కట్టను యజమానురాలు ఉషాదేవిగార్కి సమర్పించబోతున్నాడు. ఆ కట్టను ఆమె నిన్న కాలేజిలో మర్చిపోయింది."

శేషగిరి గబగబా లేచాడు. "నిజమేబ్రదర్! ఈ రోజు ఎనిమిది గంటలకే ఉషాదేవి ఇంటికెళ్ళి పుస్తకాల కట్టయిచ్చివద్దామనుకున్నాను. కానీ కమ్మని కలలుకంటూనే కాలం గడిపేస్తున్నాను. నేనీరోజు పుస్తకాలకట్టను ఉషాదేవికిచ్చిరావడం నా ప్రణయ పథంలో ముఖ్యమైన మైలురాయిరా!" అన్నాడు.

శర్మ గంభీరంగా—ఒక సర్వజ్ఞుడు పసివాని అమాయకత్వాన్నిచూసి నవ్వినట్టు— నవ్వాడు. "అంత తేలికకాదురా బ్రదర్! నీ ప్రణయపథంలో 'ఇక హద్దుమీరి నడచువారు శిక్షింపబడుదురు' అనే బోర్డువుంది. తెలుసుకో!" అన్నాడు.

శేషు బ్రష్షుమీద టూతుపేస్టు వేసుకుంటూ, "తేలికకాక ఏమవుతుందిరా! వాళ్ళనాన్న వీధుల్లో చేతులమీద నడిచే రకమా?" అనడిగాడు.

"కాదు" అన్నాడు శర్మ.

"ఔను! నేనూ అతడెప్పుడూ చేతులమీద నడవడం చూల్లేదు" అని వర్మ ఒప్పుకున్నాడు.

"పోనీ వాళ్ళింట్లో క్రూరమైన కుక్కలున్నాయా?"

"లేవనే నా విశ్వాసం"

'లేదా వాళ్ళబామ్మ బీబీసీఅని రిపోర్ట్సులొచ్చాయా'

"బీబీసీ అంటే ఏవిటోయ్?" వర్మ ప్రశ్నించాడు

"ఓరి అమాయకుడా! బీబీసీ అనగా "అసత్య ప్రచారక సంఘం" అని అర్థం తెలిసిందా!" అని శర్మ, "ఆ బామ్మ విషయంలో నీవు నిశ్చింతగా వుండవోయ్ శేషూ!" అని భరోసా యిచ్చాడు.

"మరయితే చిక్కెక్కడ?" అనడిగాడు శేషు.

"చిక్కెక్కడంటావా? విను. నీ ప్రేమ రోజా

(55వ పేజీ చూడండి)

కథ కాని కథ

అమ్మొచ్చేదేవిటి?
(మొదటి బహుమతి రు. 10 లు)

ఆరోజు భాద్రపద బహుళ విదియ. తెల్లవారితే ఉండ్రాళ్ళ తదియ పండుగ. ప్రతి సంవత్సరము ఆ పండుగకు మా యింటిలో పిల్లలు అందరము గోరంటాకు పెట్టుకోవటము మామూలు. ఈ ఏడు కూడా ఆ సాయంత్రమే పిల్లలందరికి తలంట్లుపోసి ఆరోజు పగటివేళ మా ఇంటి నౌకరుచేత తెప్పించిన గోరంటాకు రుబ్బి మా కందరకు భోజనములు పెట్టినతరువాత మా అమ్మగారు మాకు గోరంటాకు పెట్టవలయునని దీపందగ్గర కూర్చున్నది. మేమందరము అనగా మా పెద్దక్కయ్య, చిన్నక్కయ్య, మా చెల్లి, నేను మా అమ్మగారికి చుట్టూ కూర్చున్నాము. ఆరోజు తెచ్చిన గోరంటాకు మా అందరికీ సరిపడునంత లేనందున ఒక్కొక్క చేతికి మాత్రమే పెట్టవలయునని మా అమ్మగారు ఉద్దేశించినది. కాని ఇది మా చెల్లికి ఇష్టము లేక నాకు రెండు చేతులకు పెట్టవలయునని ఏడ్వసాగినది. అప్పుడు నేను "ఊరుకో అమ్మా రేపు అమ్మొస్తే కొనుక్కుందాములే. మళ్ళీ పెట్టుకోవచ్చు" అని సముదాయించుట మొదలుపెట్టాను. ఇది యంతయు మాకు సమీపమున నే పండుకొనియున్న మా అన్నయ్యవిని "అమ్మొస్తే కొనుక్కుందాము అంటావేమిటే! అమ్మ ఇప్పుడు ఇక్కడనే ఉందిగా ఇంకా అమ్మ వచ్చేదేమిటే అని" చమత్కరించినాడు. అప్పుడు మేమందరము వాని సమయస్ఫూర్తికి ఎంతో సంతోషించాము.

మంగినపూడి విజయలక్ష్మి కృష్ణకుమారి
(పెదముక్కన)

* * * *

అందుకే నిన్ను పిల్చా
(రెండవ బహుమతి రు. 5 లు)

"హరికథ" చాలా ఉత్సాహంగా చెప్పుకుపోతున్నారు 'హరిదాసు' గారు. అప్పటికే చాలా ప్రొద్దుపోవుటచే మర్నాటికి వాయిదా వేశారు. టెంకాయలు కొట్టి, కర్పూరం వెలిగించి, మంగళహారతితో హరికథ ముగించారు. ఒకతను హారతిపళ్లెం పట్టుకొని కానుకలకోసము తిరుగుతున్నాడు. నా ప్రక్కన కూర్చొన్న ఓ ముసలాయన పెద్దగా కానుకలతన్ని రెండు మూడు పర్యాయాలు పిల్చాడు. అతను పళ్లెం తీసుకుని నాదగ్గరకు వచ్చాడు. పది నయాపైసల బిళ్ళ వేసి దణ్ణం పెట్టుకున్నా. నా ప్రక్కనున్నతను గబగబ జేబులోనుంచి బీడీ తీసి ముట్టించుకొని యిక పొమ్మన్నాడు. పాపం ఆ కానుకలాయన అట్లాగే చూస్తూ నిల్చొని "ఇందుకేనటయ్యా! ఇందాకటినుంచి పిల్చింది!" అన్నాడు. 'ఇక్కడ ఎవర్ని అడిగినా అగ్గిపెట్టె యివ్వలేదు. అందుకు నిన్ను పిల్చాను' అన్నాడు బీడీ పొగవదుల్తూ.

యం. వి. నారాయణరావు (కనిగిరి)

* * *

నాలుగు కుక్కలు బి. ఏ. ప్యాసయినవి.
(రెండవ బహుమతి రు. 5 లు)

మాఊళ్ళో ఒక రిటైర్డు ఆఫీసరుగారున్నారు. వారు ప్రతివిషయం చాలా అహంకారముగా మాట్లాడుతారు ఆయనకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు వారు కూడ తండ్రికితగ్గ పిల్లలే. మొగపిల్లలు ముగ్గురూ బియ్యేలు ప్యాసయ్యారు మొన్న వేసంగిలో కూతురు కూడా బి. ఏ. ప్యాసయింది. ఆ వార్త తెలిసి ఒకాయన అభినందించడానికని వాళ్లింటికెళ్లాడు. దానికి చాలా నిర్లక్ష్యంగా ఆయన 'ముష్టి బి. ఏ. కేముంది? మా ఇంట్లో కుక్కలు కూడా కడితే ప్యాసవుతాయి' అని అన్నాడు. వెళ్ళినాయన మొహం చిన్నబుచ్చుకున్నాడు ఈ వార్త ఎలాగైతేనేమి మా రామంగాడికి తెలిసింది మర్నాటికల్లా వాళ్ళ యింటి తలుపుమీద సుద్దతో 'ఈ ఇంటిలో నాలుగు కుక్కలు బి. ఏ. ప్యాసయినవి.' అని వ్రాసివుంది.

ఏ. ఆర్. శర్మ (విజయనగరం)

* *

పది మార్కులనోటు
(రెండవ బహుమతి రు. 5 లు)

జర్మనీలో ఒకసారి మా రూముకు దగ్గరలోవున్న హోటలులో కాఫీతాగి తిన్నగా రూముకు చేరాను కొద్దిసేపటి పిదప జేబులో పర్సుతీసి చూస్తే దానిలో వుండవలసిన 10 మార్కుల నోటు కన్పించలేదు. (జర్మనీలో నాణాన్ని "మార్కు" అంటారు. 1 మార్కు సుమారు 1 రు 18 న. పై. కు సమానం) ఇంతకు క్రితమే హోటల్ లో బిల్లు చెల్లించేటప్పుడు వున్నది. ఇంతలో ఏమయిపోయిందా అని ఆలోచించి ఒకవేళ హోటల్ లో గాని క్రింద పడిపోయిందేమోనని, తిరిగి హోటలుకు వెళ్ళి మేనేజరును "ఎవరికయినా 10 మార్కుల నోటు దొరికిందేమో కనుక్కోండి" అని అన్నాను. కొద్దిసేపటిలో ఒక సర్వరువచ్చి "మీరేనా, డబ్బు పారేసుకున్నది" అని అడిగాడు దొరికింది గాబోలు అనుకుని సంతోషంతో అవునని తలవూపాను. "ఇందాక నేలపైని తివాసిమీద దొరికింది" అంటూ 5 రెండుమార్కుల బిళ్లలు టేబిల్ పైన పెట్టాడు. అగ యిదేమిటా అనుకుని "ఇవ్వే అవి నావికావు, నేను పారేసుకున్నది 10 మార్కుల నోటు" అన్నాను దాని కతను నవ్వుతూ "అవును దొరికింది 10 మార్కుల నోటే. కాని చిల్లరగా మార్చాను. ఇదివరకో ఆసామికిలాగే దొరికిన నోటును నోటు పరావయిస్తే, ఆయనవద్ద చిల్లర లేక పోయింది" అన్నాడు వెంటనే అతని భావాన్ని అర్థంచేసికొని ఒక రెండు మార్కుల బిళ్ళ నతని చేతిలో వుంచి 8 మార్కులయినా దక్కాయి కదా అనే సంతోషంతో రూము వయిపు దారితీశాను.

కె. యం. రావు.

కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల ఎత్తుగడ: సిద్ధాంతాలకు తిలోదకాలు

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి ఈనెల 1 వ తేదీనుంచి 5 వ తేదీవరకూ గుంటూరులో సమావేశమై రాష్ట్ర శాసన సభలో పార్టీ పోటీ చేయదలచుకున్న 150 స్థానాలలోనూ, 115 స్థానాలకు అభ్యర్థుల్ని ఖరారుచేసి, అందులో 100 పేర్లు ప్రకటించింది. తతిమ్మా పదిహేను కొద్ది రోజుల్లో ప్రకటిస్తారట. మరో తగవుల మూలంగానో, మరే కారణంవల్లనో మిగతా 35 స్థానాలకు అభ్యర్థుల్ని నిర్ణయించే బాధ్యత కార్యదర్శి వర్గానికి అప్పగించారు. ఈ సారి పార్టీ నాయకులలో ప్రముఖులు శ్రీయుతులు చండ్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య, టి. రాజశేఖరరెడ్డిగారలు లోక్‌సభకుగాని, శాసన సభకుగాని పోటీచేయడం లేదు. బహుశ వీరిని రాజ్యసభకు ఎన్నుకుని, అక్కడ ఆంధ్ర కమ్యూనిస్టు వర్గాన్ని బలపరుస్తారేమో చెప్పలేం. ప్రస్తుతం శాసన సభలోఉన్న తెలంగాణా నాయకుడు రావి నారాయణరెడ్డిని జి. ఎల్లమందారెడ్డిని లోక్‌సభకు నిలబెట్టడం, పార్లమెంటరీ అనుభవం గడించిన నాగిరెడ్డి, గోపాలరావు ప్రభృతులను శాసన సభకు పోటీ పెట్టడం గమనార్హం.

ప్రకటించిన ఈ 100 పేర్లు చూస్తే, ఇవన్నీ ఆంధ్ర వోటర్లకు చిరపరిచితాలు. క్రితం రెండు ఎన్నికలలో గెలిచినవారు, ఓడినవారు ఈ జాబితాలో ఉన్నారు. ప్రస్తుత శాసన సభ్యులలో 12 మంది మినహా తతిమ్మా అందరికీ అభ్యర్థిత్వం లభించింది. ఇక ప్రాంతాలవారీగా చూస్తే, పార్టీ బలపరుస్తున్న ముగ్గురు స్వతంత్రులు సహా— ఆంధ్ర ప్రాంతంవారు 57 మంది (నెల్లూరు కూడా కలుపుకొని) రాయలసీమవారు 13 మంది, తెలంగాణావారు 49 మంది ఉన్నారు ఇందులో కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలు కొంత బలమైన కేంద్రాలు గనుక, సహజంగా ఆ జిల్లాలలోనే ఎక్కువ సీట్లు పోటీ చేస్తున్నారు. అభ్యర్థుల సంఖ్యాబలంలో అగ్రస్థానం గుంటూరు జిల్లాది (13), ఆఖరిస్థానం నిజామాబాద్‌జిల్లాది (ఒకే ఒకరు).


పార్టీ నాయకత్వంలో పలుకుబడి ప్రాబల్యంగల రాయలసీమలో చాలా తక్కువ మందిని పెట్టారు. కారణం కార్యకర్తలు కరవు పనుల్లో నిమగ్నమై ఉండటమని చెప్పుకుంటున్నారుకాని అసలు కారణం అక్కడ ప్రజాభిమానం కరవైపోవడమే. ఆఖరికి హేమాహేమీలైన నాగిరెడ్డి, రాజశేఖరరెడ్డి గారల జిల్లాయైన అనంతపురం జిల్లాలో కూడా ముగ్గురుకన్నా ఎక్కువ పెట్టలేకపోయారంటే పార్టీ బలం ఏ స్థాయిలో ఉన్నదీ వూహించుకోవచ్చు.

జాబితా పత్రికలకు విడుదల చేస్తూ, 55 ఎన్నికలప్పటికన్నా, ఈసారి చాలా తక్కువ మందిని అభ్యర్థులుగా నిర్ణయిస్తున్నామని, బలం గల జిల్లాలలో కేంద్రీకరించి మొత్తం 150 స్థానాలుగెలుచుకోగలమని కార్యదర్శి శ్రీ రాజశేఖరరెడ్డి వెల్లడించారు. నిజానికి 55 లో సంభవించిన ఘోర పరాజయాన్నిబట్టి చూచినా ప్రజలలో నేడు దిగజారిపోయిన పార్టీ బలాన్నిబట్టి చూచినా శాసన సభలోని 300 స్థానాలలో సగం స్థానాలకు పోటీ చేయదలచడం సాహసమని, అందులోనూ మొత్తం 150 స్థానాలు గెలుచుకోగలమనుకోడం దురాశాపూరితమైన అంచనాఅని ఎవరికైనా అనిపిస్తుంది. 1955 ఎన్నికలలో 196 మంది సభ్యత్వంగల ఆంధ్ర శాసన సభకు 169 మంది అభ్యర్థుల్ని నిలబెట్టి, 15 మందిని మాత్రమే గెలిపించుకోగలిగారు. అంటే, తమకు స్వతః ఉన్న బలాన్ని పదిరెట్లు అధికంగా వేసుకొని పొరపాటు పడ్డారన్న మాట. ఇప్పుడు కూడా 'అదే పొరపాటు చేస్తున్నారు. బలంగల జిల్లాలలో కేంద్రీకరిస్తున్నామంటున్నారు. కాని, ఆనాడు వోడిపోయినది బలంలేని జిల్లాలలోనే కాదు, బలం ఉన్న జిల్లాల్లో కూడా అదే గతి పట్టింది. నాటికీ నేటికీ కమ్యూనిస్టు పార్టీ బలం పెరిగిందా అంటే లేదు. పైగా అంతఃకలహాలతో రష్యా, చైనా వర్గాలంటూ ఎలా సతమతమవుతున్నదో, చైనా దురాక్రమణ బలపరుస్తూ దేశంలో, దేశద్రోహ పార్టీగా ఎలా అప్రతిష్ఠ పాలైనదో ఎల్లరూ ఎరిగినదే. కాగా శాసన సభలో సగం స్థానాలు గెలుచుకోగల తాహతు వీరికెక్కడిదో భగవంతుడికి తెలియాలి.

అయితే, ఎందుకు ఇంతమందిని అభ్యర్థులుగా పెట్టారు? తమ బలం దిగజారిపోయిందన్న సంగతి

(54-వ పేజీ చూడండి)

ఎప్పుడూ ఇంతే—108   శంకర్




భౌతిక పాశవిక వాతావరణాలు క

రష్యా హఠాత్తుగా అణ్వాస్త్ర పరీక్షలు తిరిగి ప్రారంభించటానికి సరియైన కారణం ఇంతవరకూ ఎవరూ చెప్పలేకపోయారు.




ఆంధ్రపత్రిక



వయ్యిబాంబులు పేలని

హిందుస్థాన్ టైమ్స్

పార్టీలో తీవ్రవాదుల వత్తిడి; చైనాకు ప్రపంచాభిప్రాయం తెలిపే పద్ధతి; అమెరికా రహస్య బాంబు పరీక్షలకు ప్రతిక్రియ; సంగా చేసిన 'న్యూట్రాన్' అమెరికా పరీక్షలకు అవకాశం లేకుండా వాతావరణం కల్మషం చేసివేయటం; ఇటువంటి 'ఊహాగానా'లు చాలా జరిగాయి.



... ఇండియా

రష్యా అణ్వాస్త్ర పరీక్షలను దాదాపు అన్ని దేశాలూ ఖండించాయి. అందులో 50 మెగా టన్నుల బాంబు పేల్చడం ప్రపంచమంతటా భయభ్రాంతులు కలిగించింది.

ఇటువంటి 'మహాస్త్రం' యుద్ధంలో ఏ మాత్రం అవసరం ఉండదని 'నిపుణులు' అన్నారు. చిన్న చిన్న బాంబులతో నే నగరాలు, దేశాలు నాశనం చెయ్యవచ్చుని అంటున్నారు. అంతేకాక ఈ పరీక్షలవల్ల ఏర్పడే 'ఫాల్ అవుట్' (రేడియో ధార్మిక

లుప్తంచేసే రాక్షసి బాంబులు

శక్తిగల ధూళి) ఎక్కువగా రష్యా మీదనే పడుతుందని కొందరు చెప్తున్నారు. [జపాన్‌లో కూడా వాతావరణంలో రేడియో ధార్మికశక్తి ఎక్కువగా ఉందని తెలుస్తున్నది.]

రాక్షసబాంబుల 'ఫాల్ అవుట్' వల్ల కనీసం 40 000 మరణాలు సంభవిస్తాయని ప్రసిద్ధ శాస్త్రజ్ఞులు శ్రీ లైనస్ పాలింగ్ చెప్పారు.

కాని మన పనసమితి చెప్పినట్లు ధాతు వాతావరణమే కాక మన మనస్సులు కూడా కల్మష పూరితాలవుతున్నాయి.




"ఏమైతేనేం! మన పంతం నెగ్గింది!"

న్యూ స్టేట్స్‌మన్

తప్పెవరిదైనా సహనంతో అమెరికా రష్యాలు కృషిచేస్తేనే అణ్వాస్త్రాల ప్రమాదం తగ్గే అవకాశం ఉంది. ప్రపంచాభిప్రాయం ప్రభావం అంత శక్తివంత మయినదిగా కనిపించదు. కాని ప్రయత్నం లోపించకూడదనిపిస్తుంది. పంతాల వల్ల, పరాజితులూ, విజేతలూ కూడా మిగలని యుద్ధం జరగవచ్చు.



ఆంధ్రపత్రిక



జఠరాశయము: దాని ధర్మములు

జఠరాశయంలో ఆహారం తరంగచలనంతో బాగా మథింపబడుతుంది ఆ మథనంలో ఆహారం ద్రవరూపంపొంది, పైలోరస్ భాగంలో స్రవించే జఠరరసంతో మిళితమై అనేక రసాయనిక వికృతులు పొందుతుంది. జఠర రసంలో వుండే వస్తువులను గురించి, వివిధములయిన ఆహారపదార్థముల రసాయనిక స్వరూపములను గురించి, అవి పొందే వికృతులనుగురించి తరవాత చర్చిస్తాను

ఆహారం పూర్తిగా ద్రవరూపం పొందినతరువాత జఠరాశయంలో పైలోరస్ భాగములో ఏర్పడిన బలమైన తరంగచలనముల వల్ల ఆహారం పైలోరస్ లో వుండే ద్వారంగుండా క్రిందవున్న డుయోడినంలోకి పోతుంది. పైలోరస్ ద్వారంలో ఉంగరంవంటి కండరములవల్ల ఏర్పడిన ఒక స్ఫింక్టరు వున్నదని యిదివరకే తెలుసుకున్నాము. ఏ సందర్భంలో యీ స్ఫింక్టరు ఎంతవరకు తెరుచుకుంటుంది అన్న విషయము చాలా ముఖ్యమైంది జఠరరసం ఆమ్ల (Acid) గుణం కలది. డుయోడినంలోరసములు క్షార గుణం (Alakaline) కలవి ఆమ్ల గుణం కల జఠరాశయాహారము డుయోడినంలో ప్రవేశించగానే అక్కడ నరములు ఉద్రిక్తములై, పైలోరస్ ద్వారం తెరుచుకుంటుంది ఆహారంలో కొవ్వుపదార్థములు అధికమయిన కొద్దీ జఠరాశయంలో జీర్ణ కాలము అధికమౌతూవుంటుంది చిన్నపేగులో తయారయే కొన్ని రసాయనికద్రవ్యములు కూడా యీ పైలోరస్ ద్వారమును తెరుచుకుంటానికి సహాకరిస్తవి జఠరాశయంలో పుండు యేర్పడ్డప్పుడు జఠరాశయంనుండి, చిన్నపేగులోకి ఆహారం పోవడానికి చాలా కాలం పడుతుంది అక్కడ ఆమ్లగుణం అధికమైతే పైలోరస్ బిగుసుకుపోయి ఆహారం డుయోడినంలో ప్రవేశించ నివ్వక పోవచ్చును గూడా. అంత కంతకు నొప్పి అధికమై పళ్లని వాంతి వెళ్ళి పోయి రోగికి బాధ ఉపశమిస్తుంది పైలోరస్ ద్వారము ఎప్పుడూ మూసుకునే ఉండదు. నీరు, సారాయిమువంటి ద్రవపదార్థములు త్రాగినవెంటనే, పైలోరసద్వారా పేగులలోకి వెళ్ళిపోతవి ఆ ద్రవపదార్థములను మాత్రమే పైలోరస్ పోనిస్తుంది కాని ఘన పదార్థములను పోనివ్వదు ఈకారణంచేతనే, జఠరాశయం పరిమాణం పరిమితమైనా మూడు నాలుగుబీరు సీసాలు ఏకధాటిగా కొందరు తాగగలుగుతున్నారు కాని జఠరాశయంలో ఆమ్లగుణం మరీ అధికమయి నప్పుడు ఇదీ సాధ్యంకాదు ఆరోగ్యస్థితిలో 3½ గంటలకాలంలో జఠరాశయంలో జీర్ణ కార్యము పూర్తి అయి అక్కడఉన్న ఆహారపదార్థం ద్రవరూపంలో డుయోడినంలోకి వెళ్ళిపోతుంది. అందుకనే ప్రతి నాలుగుగంటలకు మనకు ఆకలి వేస్తుంది

జఠరాశయంలో గ్రంథులు స్యందించే రసం, జఠరాశయంలో అన్నీ ప్రాంతాలలోనూ ఒకేమాదిరిగా వుండదు. కొన్నిచోట్ల కేవలం మ్యూకస్ (జిగురు పదార్థం) మాత్రమే స్యదింపబడుతుంది. మిగతా ప్రదేశములలో జఠర రసం స్యదింప బడుతుంది.

జఠరరసంలో ముఖ్యంగా నాలుగు పదార్థములు ఉంటవి. 1 హైడ్రోక్లోరిక్ ఏసిడ్ 2 పెప్సిన్ 3 రెనిన్ 4. లైపేజ్ (Lypase)

మనం తీసుకునే ఆహారంలో రసాయనికంగా మూడు ముఖ్యములయిన రకములుగా ఉంటవి 1. ప్రోటీనులు ఇందులో ముఖ్యంగా నైట్రొజను, హైడ్రోజను ఉంటవి

2 శర్కరా ద్రవ్యములు, లేక పిండి పదార్థములు ఇందులో కార్బను, ఆక్సిజన్, హైడ్రోజను వుంటవి అయితే వీటిలో హైడ్రోజను, ఆక్సిజను నీటిలో ఉన్న నిష్పత్తిలో ఉంటవి అంటే ప్రతి రెండు హైడ్రోజను అణువులకు ఒక ఆక్సిజన్ అణువు వుంటుంది.

3 తైలద్రవ్యములు. ఇందులోనూ కార్బను, ఆక్సిజను హైడ్రోజను ఉంటవి కాని ఇందులో హైడ్రోజను అణువులు కొద్దిగా ఎక్కువ అంటే రసాయనికంగా శర్కరాద్రవ్య స్వరూపానికి తైల ద్రవ్య స్వరూపానికి భేదం అతిస్వల్పం ధాతువులలో శర్కరా ద్రవ్యములు అర్ధదగ్ధములయినప్పుడు తైలద్రవ్యములుగా మారిపోవచ్చును. ఈకారణం చేతనే స్థూల శరీరులు ఆహారం ఎంత తగ్గించుకున్నా ఒళ్లు పెరుగుతూనే ఉంటం జరుగుతున్నది. ఈ పై పదార్థములలో జఠరాశయంలో ప్రధానంగా ప్రోటీనులు రసాయనికవికృతి పొందుతవి. అందుకు పెప్సిన్ అనే ఎంజయము కారణము. అయితే ఈ పెప్సిన్ పెప్సిన్‌గానే ఉత్పత్తి కాదు. పెప్సిన్ కు మూల వస్తువుగా తయారయిన దని మీద హైడ్రోక్లోరిక్ ఏసిడ్ ప్రభావంవల్ల పెప్సిన్ తయారవు తుంది ఈ పెప్సిన్ వల్ల ప్రోటీను కణములు చిన్నవై, పెప్టోనులు అనే ప్రోటీన్ విశేషములుగా మారిపోతవి హైడ్రోక్లోరిక్ ఏసిడ్ లేకపోతే ప్రోటీనులు జీర్ణంకావడానికి అత్యవసరమయిన పెప్సిన్ ఉత్పత్తి కాదు. కాని ఆ ద్రావకమే అధికం అయినప్పుడు అజీర్ణము, జఠరాశయంలో అల్సర్లు (పుండ్లు) ఏర్పడవచ్చును. ఆవిషయం తరువాత చర్చిస్తాను

3. రెనిన్ అన్న పదార్థం, పాలను మజ్జిగవిరిచినట్లుగా విరిచేస్తుంది ఈ రెనిన్ ఉత్పత్తి పాలుత్రాగే పిల్లలలో అధికంగా ఉంటుంది వయస్కులలో చాలా తక్కువగా ఉంటుంది. కొవ్వుపదార్థములు జీర్ణంకావడానికి చాలాకాలం పడుతుందని యిదివరకే తెలుసుకున్నాము పైలోరస్ గుండా ద్రవపదార్థములు పోయినంత సులువుగా జీర్ణంకాని కొవ్వులూ, ప్రోటీనులూ పోవు. పెప్టోనులు అయితేనేగాని ప్రోటీనులు కరగవు. పాలు యీ రెనిన్ ప్రభావం వల్ల విరిగి పెరుగైపోతుంది పాలు విరిగినప్పుడు ఏర్పడే తెల్లని ముక్కలలో కేసీన్ (Casein) అనే పదార్థం ఉంది. ఇది అతి పుష్టికరమయిన ప్రోటీన్ అయినా చాలా కష్టం మీద జీర్ణమయ్యే పదార్థం అందువల్ల, పాలు పూర్తిగా జీర్ణం కాకుండా డుయోడినంలోకి పోకుండా గడ్డకట్టించి అది జీర్ణమయ్యేదాకా జఠరాశయంలో ఉంచడానికి యీ రెనిన్ సహకరిస్తుంది.

లైపాయిడ్సు అంటే కొవ్వు పదార్థములు. లైపాయిడ్సును జీర్ణంచేసే ఎంజయిమును లైపేజ్ అంటారు ఇది జఠరరసంలో చాలా కొద్దిగానే వుంటుంది జఠరాశయంలో తైల ద్రవ్యముల జీర్ణం ఎక్కువగా జరగదు కాని తైల ద్రవ్యములు చితికి బుడగలై తరంగచలనంవల్ల తేలికగాజీర్ణమయ్యే నవనీతంగా (Emulsion) మారి పోతవి ఆముదం, పాలు, నీరు, నూనె కలవవు. కాని వాటిని బాగా రంగరించినప్పుడు కలిసిపోయి నట్టుగా కనపడే తెల్లని పదార్థం ఏర్పడు తుంది. ఇంటులో నీటిలో పంచదార కలిపినట్లుగా ఒక పదార్థం ఇంకొక పదార్థంలో కలిసి పోదు. బలవత్తరమైన మథనం వల్ల వస్తువు ప్రతి అతి సూక్ష్మములయిన కణములై ఆ కణముల కలయికవల్ల యీ నవనీతం ఏర్పడుతుంది అంటే యీ వికృతి ద్రావణీయత వల్ల (Solubility) ఏర్పడ్డది కాదు ప్రమాణంలో లాగే ఇది ఒక భౌతిక మయిన వికృతి రసాయనిక వికృతి కాదు ★

హరి వంశము

హారిత శివశర్మ

సాందీపనిపర్వం - 36

కాశిరాజు భవనములను మహానందునితోడి రథము చేరబోవుచుండగా మేడలమీదనుండి పౌండ్రకుడు చూచినాడు వలె నున్నది, ఆ రథము కోట బహిర్ద్వారమును చేరువేళకు అత డచ్చట నుండెను. అతడే స్వయముగా మహానందునకు చేయూతనిచ్చి రథముమీదనుండి దింపెను "వాచాల! ఆచార్య మహానందుని సుఖముగా కొనివచ్చినావుగదా!" అనెను

"సుఖముగా కొనిరాక దారిలో రథమును, ఆయనను నేను మ్రింగుదుననుకొన్నావా" అని నాడు వాచాలుడు

పౌండ్రకుడు గలగల నవ్వినాడు. వాని నవ్వులో గూడ వాని ఆత్మ లక్షణము ప్రస్ఫుటమగుచున్నది

"నీవు స్వయముగానైనచో నంతపనియు చేయగలవాడవు సారథి యున్నాడు గనుక సరిపోయినది" అన్నాడు పౌండ్రకుడు. అని మహానందునితో ఇట్లు లనినాడు "ఆచార్య! మేమును ఇచ్చట నొక ఆశ్రమమును నిర్మించితిమి విద్యామందిరము అచ్చము ఆచార్య సాందీపని విద్యా మందిరమువలె నిర్మింపచేసితిమి చూతుమా?

పౌండ్రకుడు ముందు నడువగా, మహానందుడును, వాచాలుడును అతని ననుసరించిరి రాజభవనముల కొక్కవైపున క్రీడోద్యానమున్నది. పౌండ్ర కుడటు దిక్కు నడచుచుండెను మహానందుడును, వాచాలుడును అతని ననుసరించి నడచుచుండిరి ఉద్యానవనములో బహువిధ వృక్షము లున్నవి లత లున్నవి గుల్మము లున్నవి. వీరుంధము లున్నవి కృతకముగా నిర్మించబడిన జొంపము లున్నవి కృతకాద్రులు, క్రీడా సరోవరములు, కేళకుళులు నున్నవి పౌండ్రకుడు వీనిని మహానందునకు చూపించుచు ముందునకు నడచుచుండెను. మహానందుడును, వాచాలుడును వాని ననుసరించి నడచుచుండిరి. అంతలో ఆశ్రమమును పోలిన ఉటజములు కొన్ని ఒకచో నిర్మించబడి వారికి దృగ్గోచరమైనవి వాని నడుమ సాందీపని ఆశ్రమములోని విద్యామందరమును పోలిన మందిర మగుపించినది మహానందుడు సాశ్చర్యదృక్కై ఆ మందిరమును తిలకించుచు నిలబడిపోయినాడు పౌండ్రకుడు ఆయనను చూచుచు వాచాలునితో "వాచాలా! ఒక్క దినములో ఈ ఆశ్రమమును నిర్మింపజేసితిమి! అట్లులని ఆచార్య మహానందునితో చెప్పుము" అనినాడు

మహానందుడు మాటాడలేదు. అచ్చటి ఆ మందిరమును, ఆ మందిరమును నిర్మింపచేసిన పౌండ్రకుని చూచుచు నిలచుండెను. సాందీపని పౌండ్రకుని కుశాగ్రబుద్ధియనినాడు నిజముగా నితడు కుశాగ్రబుద్ధియే కానిచో నిట్లు ఈ మందిరమును ఎట్లు నిర్మింపజేయును సాందీపని ఆశ్రమమును ఇతడు చూచినది ఒక్కసారి. ఆ ఒక్కసారి చూచుటలో నా యాశ్రమము అచ్చటి మందిరములు నా తని మనస్సులో నిల్చిపోయినవి ఇచ్చట నీ ఉటజములు, మందిరము నన్నియు సాందీపని యాశ్రమములోవలె నున్నవి మహానందు డాశ్చర్యపడెను ఇంతటి కుశాగ్రబుద్ధికి అహంకారమే లేనిచో! అతడు పైకి ఏమియు ననలేదు.

పౌండ్రకుడనినాడు.

"ఆచార్య"

"వాసుదేవ!"

"మా మాతులుడు, కాశీ మహారాజు మిమ్ము చూడగోరెను"

"అట్లులనే!"

మరలనందరును రాజమందిరముల వైపునకు నడచిరి దారిలో మహానందు డాలోచించెను మహారాజు తన యీగురుత్వము నంగీకరించునా! తానేమో ప్రసిద్ధుడుకాదు సాందీపనియో ప్రసిద్ధుడు అతనిని రాజు మేనయల్లుడు కాదనెను తన్ను ఎవ్వరినో అనామకుని గురువునుగా వరించెను ఇది ఈ మహారాజునకు నచ్చునా! కాదో తన మేనయల్లుని ఇష్టము ప్రకారమే నడచుకొనునా! పౌండ్రకుడేమో, ఒకరిమాట వినువానివలె కన్పించుటలేదు వాని మాటయే వానిదివలె నున్నాడు. తన గురుత్వము, అతని యీ శిష్యత్వము ఎట్లు పరిణమించునో మహానందునకు పాలుపోలేదు

మహారాజు భవనము లింద్ర భవనములవలె నున్నవి తాము సింహ ద్వారము చేరినది మొదలు హెగ్గళ్ళ హెచ్చరికలు, దౌవారికుల గుస గుసలు, అంతర్వంశికుల మందహాసములు విననైనవి కనవైనవి వారిలో కొందరు మహానందుని వేషమును చూచి కాబోలు మందముగా నవ్వుటయు గోచరించినది మహానందు డనుకొనినాడు. వీరు నా యీ వేషముచూచి నవ్వుకొనుచున్నారువలె నున్నది బడుగను నేను ఈవేషము కట్టుట యేమిటి? ఒకరు నవ్వక పోవుట యేమిటి? అయినను ఇది రాజ మర్యాదలకు తగిన వేషము. సాందీపనియు తన యీ వేషమునుచూచి హర్షించెను "నీకు నిజమురా! బడుగా" అని దీవించెను. ఇంత జరుగగా, ఇప్పుడు వీరు నవ్వినచో నాకేమి! ఈ వేసిన వేషము నాకు అతుకక పోయిననేమి! జక్షన్ క్రీడన్ రమమాణ స్త్రీభిర్వా యానైర్వా జ్ఞాతిభిర్వా వయస్యైర్వా నోపజనం స్మరన్నిదం శరీరం జ్ఞాని భక్షించుచున్నను, స్వేచ్ఛచేత విహరించు చున్నను, స్త్రీ బాలాదులతో చరించు చున్నను,జనుల సమీపమందు వర్తించుచున్నను ఈ శరీరమును స్మరింపడు అనునది వీరికి తెలియదో! అంతలో నతని కనిపించినది. నాలోనను నహంకారమున్నది. కావుననే భగవంతుడు నా కీ శిక్ష విధించెను కాశికలో ఎక్కడనో హాయిగా తిరగవలసిన నాకీ బంధమేమి! ఈ గురుత్వమేమి! అందుకు ఈ వేషము వేయవలయునో! శ్రీ కృష్ణుడు కొంటెవాడు. తన్ను ఏడ్పించుట కిట్లు చేసినాడు. అట్లు కానిచో నాతడే స్వయముగా నా కీ వేషము నేల వేయవలయును ఆచార్యాణి నవ్వుచు నన్నమాటలు జ్ఞాపకము వచ్చుచున్నవి. శ్రీకృష్ణ! నీవు వినిచేత నీ వేషము వేయించుచున్నావు. వాడు ఇక మనమాట వినునా! అని ఆమె అన్నది శ్రీ కృష్ణుడు పగలబడి నవ్వినాడు 'తల్లీ! మహానందులు వేషము వేయనిచో గురువు లెట్లగుదురు. అయిన వాసుదేవుని శిక్షింప బోవుచున్నారు మరి ఆ వాసుదేవుడు నా వంటివాడా, ఆచార్య సాందీపనివద్ద చదువుకొనుటకు. ఆచార్య సాందీపని యేమో వేషములు వేయరు పౌండ్రకుడు వేయును. మరి అతని గురువు ఆచార్య మహానందులును వేయవలెను" అన్నాడు మరి ఇచ్చట పౌండ్రకుడు మామూలుగనే యున్నాడు. వేషము వేయలేదు ఏమో అనుకొనినాడు మహానందుడు

కాశిరాజు అతిథి మందిరమున కీవలగా నొక ప్రత్యేక మందిరమున్నది. పౌండ్రకుడు నడచుచున్నవాడు నడచుచున్న ట్లచ్చట నాగెను. ఆగి మహానందునివంక చూచెను.


"ఆచార్య!"

"వాసుదేవ!"

"నేను ఆచార్య సాందీపని ఆశ్రమ మృగమును తెలియక గాయపరచితిని దానికి వైద్యము చేయించుచున్నాను. చూచెదరా!"

"వాసుదేవ! నీవు చూడమనుటయు, నేను కాదనుటయునా!"

పౌండ్రకుడు మరల నవ్వెను. అతని ఆత్మ లక్షణము మరియు నందులో ప్రస్ఫుటమై తోచెను



(53 వ పేజీ చూడండి)



['వాడు నా కొడుకే కాడు!' అన్నాడు తండ్రి. అతనికీ అభిమానం ఉన్నది. కాని సమయం వచ్చినప్పుడు.........]

ఆరోజు రాంబాబు ముఖంలో అలసట ప్రస్ఫుటమవుతోంది. అతను విరాగ్గా ఇంటికొచ్చాడు. రాధ గదిలోకి వెళ్ళాడు. ఆమెను చూస్తుంటే, మరచిపోవా లనుకుంటూన్న బాధ మళ్ళీ గుర్తుకొస్తూంది. ఆమె మంచందగ్గరగా వెళ్ళాడు.

"ఒంట్లో ఎలాఉంది రాధా ?"

"మీ దురదృష్టంకొద్దీ ఇంకా నాలుగు రోజులు బ్రతుకుతాను."

"రాధా!"

"మిమ్మల్ని ఇన్నాళ్ళూ బాధపెట్టాను. నన్ను పెళ్ళిచేసుకుని మీరు సుఖపడిందేమీ లేదు."

అతను మాట్లాడలేదు.

"ప్రేమించారు. పెంచి పెద్దచేసిన కన్నతండ్రిని కాదని నన్ను పెళ్ళిచేసుకున్నారు. దేవుడికి దయలేదు. రోగిష్టిగా తయారయ్యాను. వచ్చే జీతమంతా నా జబ్బే తినేస్తూంది. మనమధ్య సుఖం దూరమై రెండు సంవత్సరాలైపోయింది కదండీ!"

"ఎందుకు రాధా ఇప్పు డివన్నీ !"

"మనవి భలే గమ్మత్తయిన జీవితాలు. మీకూ, నాకూ మధ్యనున్న స్నేహం ప్రేమగా మారడమే ప్రమాదమయింది రాం ! అయిపోయింది. ఇంక ఆట్టే రోజులు బ్రతకను. బ్రతికున్నన్నాళ్ళూ మిమ్మల్ని బాధపెట్టాను. కొందరి జీవితాలు విచిత్రంగా ఉంటాయి. వాళ్ళు సుఖపడలేరు సరికదా ఎదుటివాళ్ళనీ సుఖపడనివ్వరు. నన్నెందుకిలా సృష్టించాడు దేవుడు ?" ఆమె ఆయాసపడుతూనే చెప్పింది.

"అధికంగా మాట్లాడకు రాధా .... డాక్టరు చెప్పారు నీకేం ఫర్వాలేదని."

ఆమె పేలవంగా నవ్వింది.

"అది వాళ్ళ వృత్తి ధర్మం ! అలా చెప్పకపోతే రాబడికి నోచుకోలేరు. క్షయంటే మాటలతో తగ్గే రోగం కాదు. దానికితోడు గుండె బలహీనత. ఏ క్షణం ఎలాంటిదో ఆ డాక్టర్ల కేం తెలుసు ? .... త్వరగా చచ్చిపోవాలనే వుంది నాకు."

"రాధా ! నన్నెందుకిలా ఏడిపిస్తావ్ ?"

"అలవాటైపోయింది. మన కేక్షణాన్న పెళ్ళయిందో కాని ఇద్దరమూ ఏడుస్తూనే ఉన్నాం."

"నువ్వు ధైర్యంగా ఉంటే నాకే దిగులూ ఉండదు రాధా ! అన్నీ జయించినవాడిలా తిరుగతాను. నిజం."

"మిమ్మల్ని మీరే వంచించుకుంటా రెందుకూ ? నాగురించే కదా కలసివున్న మీ కుటుంబంలో కలతలు రేగాయి. నా గురించేకదా దేవుడిలాటి మీ నాన్న మిమ్మల్ని కసిరికొట్టింది. నా గురించే—"

"రాధా ! నా మనస్సు పాడుచెయ్యకు. నా కెవ్వరూ లేరు. ఎవ్వరూ అక్కర్లేదు. నువ్వు— నువ్వు చాలు నాకు."

"తొలి రోజుల్లో సరిగ్గా ఇలాగే అన్నారు. ఈనాడూ అంటున్నారు. అయితే ఈ మాట కేవలం నన్ను మభ్యపెట్టడానికే. తెలుసు. నిజం చెప్పండి. మీకు నామీద కోపంలేదూ ?"

"ఛ .... ఛ .... అదేం మాటలు రాధా !"

"దాచకండి రాం ! నేను మనసులు చదవగలను."

"నీకిది భావ్యంకాదు రాధా ! నాకు శాంతి లేకుండా చేస్తున్నావ్."

"పాపిష్టిదాన్ని....అందుకే అనుకుంటాను చావు త్వరగా వస్తే బావుండని."

"రాధా !"

కొంత బిగ్గరగా అరిచాడు. అతనికి కోపం వచ్చింది. విసురుగా గది వదలి పోబోయాడు. కాని—

రాధ విపరీతంగా దగ్గుతుంది. ముఖం ఎర్రబడింది. ఊపిరాడటంలేదు. ఆయాసం అధికమయ్యింది.

రాంబాబు భయపడ్డాడు. గ్లాసుతో నీళ్ళుపోసి ఆమెకు పట్టించాడు. కొంత దగ్గు తగ్గింతర్వాత మందు కలిపి ఇచ్చాడు.

"ముందు ఈ మందు పుచ్చుకో రాధా !"

ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఛా .... ఏడుస్తా వెందుకు రాధా ! విసుక్కున్నానా ?" జాలిగా అడిగాడు.

"క్షణక్షణానికి మారిపోతుంటాను. ఎందుకో చెప్పలేను. మీరు చేస్తూన్న సేవకి మరో జన్మలో కూడా ఋణపడి ఉంటాను! నేను అదృష్టవంతురాలనని మురిసిపోతూంటాను. క్షయరోగి దగ్గరెవరూ ఉండకూడదు. రేపో మాపో అన్న ప్రాణిని ఎవ్వరూ ఆదరించరాదు. ఇది జరుగుతున్న సత్యం. నా గురించి అన్నీ మరచిపోతున్నారు మీరు."

"వయస్సువచ్చినా నువ్వింకా పసిపిల్లవే రాధా! నాకోసం నువ్వు చేసిన త్యాగం మరచి నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నావ్. నువ్వూ నీవాళ్ళ నందర్నీ వదులుకుని నన్ను చేసుకున్నావ్. ఆడపిల్లవు ఇంత ధైర్యం కేవలం నాగురించి చేశావంటే నీకన్నా గొప్పవాళ్ళెవరు ?" అన్నా డతను.

అంత బాధలోనూ ఆమె నవ్వేసింది.

"ఒకళ్ళనొకళ్ళం పొగుడుకుంటూనే ఉన్నాం ఇన్నాళ్ళ .... అన్నట్టు అడగడం మరిచాను. మీ వెళ్ళిన పనేమయింది ?"

"మామూలే."

"అంటే."

"నెలాఖర్రోజుల్లో ఎవ రప్పిస్తారు రాధా ?"

"పోనిండి. అదీ ఒకందుకు మంచిదే. ఎక్కడలేని డబ్బూ నా రోగానికే పెట్టేస్తున్నారు."

"అదిగో మళ్ళీ అదేమాట అంటున్నావ్. నీ మందులకి నువ్వనుకున్నంత డబ్బు కావడంలేదు."

"అన్ని వ్యాధుల్నీ తలతన్నిన వ్యాధి ! అలాంటిది తప్పింటైనా మింగేస్తుందని నాకు తెలియదనుకుంటే ఇంతకంటె పొరబాటు ఉండదు రాం!"

"రోజురోజుకీ నీలో ఆయాసం పెరిగిపోతోంది ప్రతిదీ నీ కంటికి పేదంగా కనిపిస్తుంది. ఎందుకింత దిగజారిపోతావ్ ?"

ఆమె మౌనంగా ఉండిపోయింది.

"నువ్వు ధైర్యంగా ఉంటే చాలు నాకు. చెప్పకూడదు కాని రాధా—నువ్విలా మాటాడుతూంటే నాకేదో భయంగా ఉంటుంది. చిన్నప్పట్నుంచీ నేను దేనికీ జంకేవాణ్ణి కాను. అలాంటిది విన్నా, నీ మాటల్ని చూస్తూంటే—" అతని గొంతుక జీరపోయింది.

"నువ్వు బ్రతకాలి రాధా ! నాకోసం నువ్వు బ్రతుకుతావ్" అని అతను ఆ గదినుంచి బయటకొచ్చాడు.

రాధకళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఆమెకు తెలుసు తన పరిస్థితి .... ఇంకా ఎన్నాళ్ళో వెలగదు ఈ జ్యోతి !

—రాంబాబు బజారువైపు నడుస్తున్నాడు. ప్రస్తుతం అతని కావలసింది రాధ టానిక్కుల నిమిత్తం డబ్బు. వారంరోజుల్నుంచీ సెలవులో ఉన్నాడు. కనుపించిన ప్రతివాడినీ నోరువిప్పి అప్పడిగాడు. అందరిదగ్గరా లేదనేపదం వాడుకైపోయింది. ఉన్న కొద్దిపాటి స్నేహితులు చాలీచాలని జీతాలమధ్య జీవితాలు గడుపుతున్నారాయె... వాళ్ళేం యిస్తారు ?

దూరాన రైల్వేస్టేషన్లో ఏదో రైలు గట్టిగా కూతపెట్టింది.

ఒక్కోసారి రాంబాబు గమ్మత్తుగా తర్కించుకుంటాడు. తనేదో పొరపాటు చేశానని అనుకుంటాడు. కాదని వెంటనే సమర్థించుకుంటాడు.

ఒక చిన్న మలుపు అతని జీవితాన్ని మార్చివేసింది. రాధని పెళ్ళి చేసుకోడం ఎవ్వరికీ ఇష్టం లేదు.

నాన్న పాతకాలపు మనిషి. తల్లిలేని లోపాన్ని తన పెంపకంతో దాదాపు దూరంచేశాడు. ప్రతి తండ్రికీ ఉన్నట్టే ఆయనకూ రాంబాబుపైన కొన్ని ఆశలు ఉన్నాయి. అటు రాంబాబుకి కూడా వ్యక్తిగా కొంత స్వాతంత్ర్య ముంటుంది. ఈ రెంటికీ పొత్తు కుదరలేదు.

రాధనే చేసుకుంటా నన్నాడు ఎప్పుడూ తండ్రి మాట కెదురాడని రాంబాబు !

ఆ అమ్మాయే వద్దన్నాడు నాన్న !

మావయ్య కూతురు పార్వతి అంటే నాన్నకి విపరీతమైన అభిమానం. ప్రాణసమానం. నాన్నా, మావయ్య మధ్య రాంబాబు వివాహ విషయం ఎప్పుడో చర్చింపబడింది. పార్వతి రాంబాబుకి తగిన వధువని వాళ్ళ నిశ్చయం.

ప్రేమలేని పెళ్ళి పెళ్ళి కాదనే కోవకి చెందుతాడు రాంబాబు. పెళ్ళికి ప్రేమేవిటి పిండాకూడు. పెద్దవాళ్ళ మాటని తలమీద పెట్టుకు పూజించాలంటాడు తండ్రి.

ఇక్కడే తండ్రీ, కొడుకుల మధ్య కలతలు రేగాయి. తెగించి రాధనే పెళ్ళి చేసుకున్నాడు రాంబాబు. దాంతో తండ్రీ కొడుకుల అనుబంధం బీటలువారింది.

శేషగిరి అన్నయ్య, సావిత్రక్కయ్య, చెల్లాయి—

(45-వ పేజీ చూడండి)



వనితా వాణి

సరసాలు–విరసాలు

మా వూరికి క్రొత్తగా వచ్చిన ఒకావిడుంది. వాళ్ళయింటిలో ఎంతమందివున్నా, వాళ్ళందరి ఎదుటా కూడా వాళ్ళ ప్రేమకలాపాలు మానరు. ఇక విరసాల మాటంటారా? ఒకసారి మా దూరపు బంధువు యింటికి పెళ్ళికి వెళ్ళాను. అక్కడు ఒక భార్యాభర్తలు, పెళ్ళి ఇల్లుకదా అందరూ వుంటా అని విచక్షణ లేకుండా, వాళ్ళ దెబ్బలాటలూ, వాళ్ళ తిట్లాటలూను. ఇలాంటివారిని చూస్తే నాకెంతో అసహ్యం.

కుమారి రాణి శకుంతల (బలిజిపేట)

*   *   *

నలుగురిలోను అసహ్యంగా ప్రవర్తించే దంపతులకు, ఇది బాగా బుద్ధి చెప్పేటువంటి చక్కని వ్యాసం.

పి. సత్యవతి రాధాకృష్ణ (అనంతపురం)

*   *   *

మా చుట్టాలొకరు ఉన్నారు. ఆయన అస్తమానం భార్య వెనకాతలే పిచ్చివేషాలు వేస్తూ వుంటాడు, ఒక్క ఆఫీసు వేళలలో తప్ప. ఇంకొకరు నవ్వుతారు అని కూడా లేదు. ఇంకొకాయన ఉన్నారు. ఆయన పదిమందిలోఅయినా భార్య తొడమీద చక్కగా తలయనిస్తాడు.

బి. మణిబాల (అనంతపురం)

*   *   *   *

తలయుద్రి ఈ కాలంలో జరిగే సత్యాన్ని బాగా విశదీకరించారు.

పి. రత్నమాల (కాకినాడ)

*   *   *

ఎంత నూతన దంపతులైనాసరే ఎలాటి వాళ్ళైనాగాని, ఈ విధములైన వ్యాసములు చదివి కనువిప్పు కలిగివుంటారని ఆశిస్తున్నాను.

సిహెచ్. సరస్వతి (కావలి)

*   *   *

వ్యాసం చదువుతుంటె మొన్న ట్రయినులో జరిగిన సంఘటన జ్ఞాపకము వస్తోంది. సినిమాలా గుంది. ఈ వ్యాసం చదివిన అట్లాంటి వాళ్ళకు బాగా ఉపయోగిస్తుంది.

తోట నాగమణి (గుంటుపల్లి)

*   *   *   *

వ్యాసం వాస్తవిక జీవితంలో జరుగుతున్న పొరబాటు లను చక్కగా తెలియబరచారు. ఇప్పటికైనా ఆదర్శ దంపతులమని కృత్రిమంగా నటించేవాళ్ళు బుద్ధి తెచ్చుకుంటారని తలుస్తాను.

పి. అనసూయ (మచిలీపట్నం)

*   *   *

ఈమధ్య మరీ విపరీతంగా బస్సుల్లో, రైళ్ళలో ఎక్కడ చూచినా ఈ దృశ్యాలే ఎక్కువగా కనుపిస్తున్నవి. బస్సుల్లో భార్యాభర్తలు ఒక్కచోట కూర్చోవచ్చును. కాని వారితో యింకా అనేక మంది ప్రయాణీకులు కలిసి ప్రయాణం చేస్తున్నారనే సంగతి మరచి ప్రవర్తించడం చాల అసభ్యంగా ఉంటుంది. భార్యాభర్తల అనుబంధం పవిత్రమైనదే. కాని దాని నిట్లా నలుగురిలో ప్రదర్శించి వారిని వారు అవహాస్యపరుచుకోవటం బావుండదనుకుంటాను. ఈ వ్యాసం చూచైనా అట్లా ప్రవర్తించేవారు ఇకమీదట తమ ప్రవర్తనను మాను కొని కొంచెం సంఘాన్ని దృష్టిలో పెట్టుకొని మెలుగగలరని ఆశిస్తున్నాను.

ఉమ (పెనుమలూరు)

నగల మోజు

మాకు తెలిసిన అమ్మాయి ఒకరు ఉన్నది. తనకు కొత్తరకం దుద్దులు చేయించలేదని రెండు రోజులు తిండి మాని పేచీ పెట్టింది. ఆ ఇంటివారికి ఆ అమ్మాయి అంటే గారాబం అవడంచేత వెంటనే మూడవరోజున కంసాలిని పిలిచి బంగారం యిచ్చిన తరువాత అమ్మాయి మొఖము పౌర్ణమిచంద్రుడంత అయిపోయినది. అసలు లేకుండా లేదు. పాతవి వద్దు, కొత్తవి కావలెనని పేచీ. ఇలాంటి అమ్మాయిలు ఈ వ్యాసం చదివి నగలపై మోజు తగ్గించుకుంటారని ఆశించవచ్చు.

ఇమ్మానేని ప్రతికుమారి (కటక్)

*   *   *

'నగలమోజు' వ్యాసంలో నగలలో రావలసిన మార్పులు గురించి రాయనేలేదు ! మన నగలు ఇంచుమించు కొన్ని శతాబ్దాలుగా మారకుండా ఉంటున్నాయి. పాశ్చాత్యదేశాలలో వచ్చే మార్పులను పరీక్షించి మన నగలలో రావలసిన మార్పులను గురించి సోదరీమణులెవరైనా రాస్తారని ఆశిస్తున్నాను.

తి. ఎం. ముత్యాలు (కడప)

*   *   *

మోజు గలవారికి మరింత మోజుగా ఉండును. కాని కృష్ణకుమారిగారి వ్యాసం ఆఖరున కొంతవరకు హెచ్చరించినా, చాలామంది స్త్రీల కిది "తీరని మోజు." క. నాగభూషణమణి (బరంపురం)

*   *   *

ఆసియాలో, అందులో భారత్‌లో బంగారం నిలువకు అంతులేదు. ఉన్న నగలన్నీ ప్రభుత్వ వశం అయితే మన 'విదేశీ ద్రవ్య సమస్య' చాలా వరకూ తీరుతుంది.

కె. నారాయణి (కరీంనగర్)

*   *   *

నగలమోజుపైన వ్యాసం ప్రచురించారు. నగల మోజు తక్కిన 'మోజుల' కన్నా ఏవిధంగా లేదో తెలియటంలేదు. కారు మోజు, మేడ మోజు, డబ్బు మోజు వగైరాల వంటి మోజేకదా ! అందులో స్త్రీలకివి ఆభరణాలు మాత్రమే కాక అవసరం వచ్చినప్పుడు 'పోషణాధారాలు' కూడా నని అందరూ ఒప్పుకోక తప్పదు. కేవలం ఈ రకమయిన వస్తువులు వ్యాసాలకు వస్తువులుగా పెట్టుకుని వ్రాస్తే మీరు ప్రచురించడం నాకేమీ బాగాలేదు.

ఎ. వెంకటలక్ష్మి (గుంటూరు)

*   *   *

స్త్రీలకు నగలమీద మమకారం పుట్టుకతోనే వస్తుందంటే అతిశయోక్తి కాదేమో ! కానీ ఈ మోజు మోతాదు మించితే వేలం వెర్రి అనిపించుకుంటుంది. కొందరు స్త్రీలు వంటనిండా నగలు దిగేసుకుని చూడటానికి అందవికారంగా ఉంటారు. ఆ నగలు వారికి అందాన్ని తెచ్చిపెట్టకపోగా, సహ

జంగా ఉన్న అందాన్ని కూడా కప్పిపుచ్చుతాయి. మరొక రకం మగువ లున్నారు. వీరికి ఏనగలూ అక్కర లేదు. నగలు పెట్టుకోటం మొరటుతనమని వీరి అభిప్రాయం. ఆఖరికి చెవులకూ ముక్కులకూ కూడా ఆభరణాలు అనవసరంగానే కనిపిస్తాయి వీరికి. ఇది మరొక విపరీతధోరణి.

బి. వి. రామలక్ష్మి (గుంటూరు)

చదువులూ—పనిపాటలూ

ఈ రోజులలో జరుగుచున్నవి, ఉన్నది ఉన్నట్లుగా వ్రాశారు. మా వూరిలో ఒకామె ఉన్నారు. ఆవిడకు ఒక్కగా నొక్క కొడుకు ఉన్నాడు. ఇతనికేమో కనీసము బి. ఎస్‌సి. చదువుకున్న అమ్మాయిని చేసుకుందామని ఉంది. (ఇంజనీరు అనుకోండి.) కాని అతని తల్లిగారు ఇందుకు సుతరాము ఒప్పుకోవటములేదు. అంత చదువు చదువుకున్న అమ్మాయి ఎందుకురా కనీసము ఏ ఫోర్తు ఫారం చదువుకున్న దానినో చేసుకుంటే నీకు, నాకు సుఖం అంటుంది. ఇటువంటి మూఢనమ్మకాలవారిని ఏమిచెయ్యాలో తెలియదు

ఎం. సుభద్రాబలరామదుర్గరాజా (చెరుకుమిల్లి)

* * *

చదువంటే నవలలూ, పత్రికలూ చదవటమనేనా రచయిత్రిగారి అభిప్రాయం ? నిజంగా పనిచేసుకునేవారికి చదివేందుకు తీరిక ఏముంటుంది ?

ఎస్. స్వరాజ్యం (కావలి)

* * *

చదువుకున్నంతమాత్రాన పని చెయ్యొద్దంటారని నేనిదే వినటం. కొందరు వనితలు చదువుకున్నా అన్ని పనులూ చేస్తారు. కొందరు మహిళలు అసలు చదువు లేకపోయినా పూర్కే కూర్చుంటారు. ఈ విషయంపైన సూత్రీకరించటం కష్టమని నే ననుకుంటాను. ఇది నా విషయంలో నిజం. చదువుకున్నా నన్ను పనిచెయ్యక్కరలే దనేవారు లేరు!

ఎస్. వి. రత్నం (నైజామాబాదు)

* * *


శ్రీమతి రత్నామహీధర్‌గారు రాసిన 'చదువులూ—పనిపాటలూ' అన్న వ్యాసం చాలా బాగుంది. ఈనాడు సమాజంలో చదువుకున్న అమ్మాయిలు ఎదుర్కొంటున్న పరిస్థితులను చక్కగా వివరించారు. చదువుకున్న అమ్మాయిలంటే పనిపాటలు తెలియనివారనే దురభిప్రాయం కనిపిస్తోంది. ఎక్కడో ఒకరిద్దరు చదువుకున్న స్త్రీలు పనిపాటలు చేయరని అందరినీ దుయ్యబట్టటం ఏమంత సబబు చెప్పండి ? రత్నా మహీధర్‌గారు ఈ విషయాలన్నీ చక్కగా చర్చించారు. వారికి నా ధన్యవాదాలు.

డి. సత్యవతి (విజయవాడ)

విదేశీ ఆహారాలు

దసరా సంచికలో "విదేశీ ఆహారాలు" చాలా బాగున్నాయి. కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం కల్గినందుకు సంతోషం.

లలితా శివరావ్ (దుర్గ్) ★



చదువుల్రావు


ఏంగురూ! పరీక్షల ఫీస్ కట్టడానికి 4 గంటల నించి క్యూలో నుంచుని ఉన్నాం ఎంతసేపటికీ క్యూ తరగటం లేదేమిటి?
ఈ వేళకి తరగదు బాయ్. గది వెనుక తలుపు నించి అమ్మాయిలు వచ్చి ఫీస్ కట్టేస్తున్నారుట ఇంక ఈ వేళ మనం కట్టినట్లే
ఈవేళ ఫీస్ కట్టడానికి ఆఖరి రోజు. క్యూలో నుంచుంటే ఈ వేళ జీతం కట్టడం అవదు ఇప్పుడు ఏం చెయ్యడం?
మా తమ్ముడు చదువుల్రావుకి పరీక్షలకి జీతం కట్టాలండి ....
ఓహో.. తప్పకుండా.. 48 రూ॥లు ఇవ్వండి...
ఇదుగోనండి జీతం రసీదు ఇంక మీరు వెళ్ళొచ్చు
థేంక్యూ వెరీ మచ్..... ఇలా ఓసారి చూడండి సార్
వ్వాటీస్ దిస్ నాన్సెన్స్!!!
ఏం చెయ్యమంటారు.. ఈవేళ ఆఖరి రోజుగా ఫీస్ కట్టడానికి
సత్యమూర్తి

ఎం. ప్రభావతి

రైలు ప్రయాణాలు

బెజవాడనుండి బెంగుళూరు వెళ్తున్నాము. నేను, మా శ్రీవారు, ఇద్దరు పిల్లలతో. మెయిలు ప్రయాణమంటేనే నాకు తలనొప్పి. అటువంటిది దూరప్రయాణానికి మేలైతేనే విసుగుండదని, ఆ రోజు మేలుకే బయలుదేరాము. అసలు ఉన్నదే ఒక్క స్త్రీల కంపార్టుమెంటు. దానిలోనే యాభై మందివరకు ఇరకాలంటే ఎట్లా వుంటుంది. పైగా బండెడు బండెడు సామానుతో మరీ ప్రయాణంచేస్తుంటారు కొందరు సోదరీమణులు. సామానంతా పై బెర్తులమీదా క్రింద బెర్తుల క్రింద, అక్కడా చోటులేకపోతే నడిచే దారులలోనూ పరిచేసి అటు మనిషి ఇటు, ఇటు మనిషి అటు వెళ్ళటానికి వీలులేకుండా చేస్తూ, పైగా వాళ్ళ సామాను, మీద ఎవరి చెయ్యీ పడనియ్యకుండా చేయటం, తప్పిజారి ఎవరి చెయ్యన్నా పడిందో పెద్ద పోట్లాట లేవదీయటం, ఇది ఎప్పుడూ జరిగేసంగతే!

మేము బయలుదేరిన రోజున స్త్రీలకంపార్టుమెంటు అట్టే రష్‌లేదుగాని, ఉన్నవారిలోనే బెర్తు కిద్దరు చొప్పున ఆక్రమించిన మహిళలు, వాళ్ళ స్వంతయింట్లో పడుకున్నట్లే కాళ్ళు చాచుకొని హాయిగా పడుకున్నారు. నిద్రపోతున్నారు అనే కంటే (వాళ్ళ ప్లేసులు ఇతరులు ఆక్రమించకుండా) కళ్ళుమూసుకొని నిద్రనటిస్తున్నారు అంటే బాగుంటుందేమో. 'కాస్త లేచి కూర్చోండమ్మా?' అంటే 'ఇప్పటివరకు మేమూ నిల్చునే వున్నాము ఇప్పుడే కాస్త నడుం వాల్చేటప్పటికి..' అంటూ కొందరు, 'మాకు వంట్లో బాగోలేదు' అని మరికొందరు, 'అసలు నిద్రపోతున్న మమ్మల్ని లేవమంటానికి మీకేం అధికారం వుందా?' అని మంటొకరు. ఇట్లా జవాబులిచ్చేవాళ్ళతో వాదించినా లాభముండదు. సాటిస్త్రీకూడ తమలాగే డబ్బు పెట్టి టికట్ తీసుకుందని, తమలాగే ఇవతల వాళ్ళకూ, కూర్చునే హక్కు ఉందన్నమాట, ఆ కాస్సేపు వాళ్ళ వూహకే అందదు. మళ్ళీ ఆ కంపార్టుమెంటులో కూర్చున్న సోదరీరమణులు చాలావరకు చదువు, సంస్కారం గలవాళ్ళేను. వాళ్ళకేగాని అవకాశం కలిగి, స్త్రీస్వాతంత్రం గురించి, సమానత్వంగూర్చి ఉపన్యసించమంటె రెండుగంటల వరకూ 'స్త్రీ స్వాతంత్రం గురించి సంఘంలో స్త్రీ స్థానం మీద,' మన స్త్రీలందరు ఒకేజాతికి చెందినవారం, మనలో భిన్నత్వం ఉండ కూడదు, అందరం సమానమే, అని ఏకధాటిగా స్పీచ్ ఇవ్వగలరు. మళ్ళీ ఆ సమానత్వం ఎంత సేపో వుండదు. మళ్ళీ కాస్సేపటికే "మీరెవరో? మే మెవరమో" అన్న స్వార్థంతో నిండిపోతారు. "మేము ముందు వచ్చాముగనుక ఈ ప్లేసు మాది. కూర్చోవటానికి, పడుకోవటానికి మాకు హక్కు ఉంది మీరు తర్వాత వచ్చారు మీఖర్మం, మీరు నిల్చోవలిసిందే 'అన్నట్లు ఉంటుంది వీళ్ళ ధోరణి.

స్త్రీలందరూ ఇదే మనస్తత్వంతో ఉండరనుకోండి. కొందరు కొందరితో ప్రయాణంచేస్తుంటే ఎంతో హాయిగా ఉంటుంది. ఆ కాస్సేపటిలోనే వాళ్ళు మన కెంతో ఆత్మీయులైపోతారు. అటువంటి సహృదయులను, విడిచిపెట్టటానికి మన మనసెంతో విలపిస్తుంది.

ఒకసారి అక్కయ్య, నేను విజయవాడనుండి విశాఖపట్నం మామయ్యగారింటి కెళ్తున్నాము. మే మెక్కింది సెకండ్‌క్లాసు కంపార్టుమెంటే అయినా చాలా రద్దీగావుంది. మాకు కూర్చోవటానికే చోటు దొరికిందికాదు. మమ్మల్నిచూసి ఒకామె ఎంతో పరిచయమున్నట్లు, నవ్వుతూ ఆహ్వానించి తనచోటులోనే మమ్మల్ని కూర్చోపెట్టింది. 'ఏలూరు' వచ్చేవరకూ ఆమెగారితో సరదాగా కబుర్లతో గడిపేశాము. ఏలూరులో ఆమె దిగిపోతుంటె "అయ్యో, అప్పుడే వెళ్ళిపోతున్నారే" అని బాధపడ్డాము.

అసలు స్త్రీలకంటె పురుషులలోనే దయార్ద్ర హృదయాలు కలవారు ఎక్కువ. వాళ్ళు లేచైనా స్త్రీకి చోటిచ్చే మగవారిని చాలమందిని చూశాను. అదే స్త్రీ అయితే, తన పక్కన చోటుఉన్నా, ఆ చోటుని కూడ ఆక్రమించుకొని, 'ఇక్కడ చోటులేదు' అని నిర్భయంగా మరీ చెప్తుంది.

లక్ష్మీపుత్రికి చదువులేకపోయినా, చూపులకు ఆడంబరంగా కనిపించేవారికి త్వరగానే చోటు దొరుకుతుంది. ఎటొచ్చి చూపులకు సామాన్యంగా ఉండేవారికే చోటుదొరకటం కష్టమేమో అని నా భావం.

జీవితమే ఒక ప్రయాణం వంటిది. ఈ ప్రయాణం ఎప్పుడు, ఎట్లా అంతమౌతుందో తెలియని ఈ మనుష్యులు కొన్ని గంటలు కూర్చుని, దిగిపోయేదానికోసం "ఈస్థలంనాది, ముందు నేను కూర్చున్నాను. నన్ను కదిలించటానికి మీ రెవరు?" అంటూ ఆ కాస్త చోటుకోసం, శిఖపట్టుగోత్రం వరకూ వెళ్ళిపోతుంటారు. ★

బోయిన కనకదుర్గ

పుట్టింటి మమకారం


వివాహమయి, గంపెడు పిల్లల్నికని, దాంపత్య జీవితంలో సుదూరం సాగిపోయింతర్వాత కూడా స్త్రీలకు పుట్టింటినిగూర్చిన తలపు మహోదాత్తమైన అనుభూతిగా మిగిలిపోతుంది. అది స్త్రీ సహజమయిన లక్షణం కూడా. అందుకనే మన పెద్దలు అంటుంటారు, "ఆడపిల్లె పుట్టింతర్వాత ఏ అచ్చటా ముచ్చటా తీరినా, పెళ్ళయ్యేంతవరకే" నని. వైవాహిక దశలో అడుగు పెట్టగానే ఆవల అనుబంధాలు నూతన పుంతలలో సాగిపోవాల్సివుంటవి. అంతవరకు ఇంకొకరి అండలో పెరిగినా, ఆ క్షణం నుంచి "నా సంసారం, నా భర్త" అనే కొత్త బాధ్యతలు కొన్ని ఏర్పడుతవి. కాని ఎంత పెద్ద బరువు బాధ్యతలున్నా, కన్నయింటివారిని గురించిన మమత బాంధవ్యాలలో మహదానందాన్ననుభవిస్తుంటారు మగువలు. కాని ఎంతోమంది పురుషులు, తమ భార్యలు పుట్టింటి గురించి, మాట్లాడినప్పుడల్లా అకారణంగానైనాసరే అపహాస్యం చేస్తుండటం పరిపాటి. కాని అలా పరిహసించి, భార్య తరఫున వారిని నిందించే స్వభావంగలవారు ఆ విషయంలో తమ సహచారిణులు పైకి కనపడకుండా, ఎంత బాధ ననుభవిస్తారో ఊహించలేరు.


మాకు తెలిసిన ఒకావిడ తల్లికి జబ్బుచేసి, చాలా సీరియస్‌గావుందని, ఆమధ్య టెలిగ్రాం వచ్చింది. అది చూడగానే ఆమె ఎంతో కంగారుపడిపోయి పెట్టె బేడా సర్దుకుని, కాలేజీనుంచి భర్త వచ్చే వరకు ఎదురుతెన్నులు చూస్తూ కూర్చుని, ఆయన వచ్చింతర్వాత టెలిగ్రాం చూపించి కంగారుగా "నన్ను ఈ ట్రెయిన్‌కు పంపండి" అని ఎంతో ప్రాధేయంగా అడిగింది. ఆయనగారుమాత్రం చీమ కుట్టినట్లయినా, లెక్కచెయ్యకుండా, ఈజీ చైరులో పడుకుని, సిగరెట్టు అంటించుకుంటూ, "ఇప్పుడు నువ్వెళ్ళకపోతే ఏం?" అని తాపీగా ప్రశ్నించేటప్పటికి, ఆమె నీరుకారిపొయ్యింది. అసలే ఒకపక్క చావుబ్రతుకుల మీదున్నతల్లి ఎలావుందోనని, ఆమె ఆవేదన. ఇంకొకపక్క భర్త అనుమతి లభించనిదే ఎలా వెళ్ళటమన్న ఆదుర్దా. ఆమె ఎంత కాళ్ళా వేళ్ళాపడ్డా, ఆయన కర్కశంగా, "నువ్వెళ్ళినంత మాత్రాన మీ అమ్మకు ఒక్కసారిగా ఆరోగ్యం చక్కబడిపోదులే. ఈ ప్రపంచంలో మందిచ్చి బాగుచేసేందుకు చాలామంది డాక్టర్లున్నారు" అని ప్రయాణానికి సిద్ధంచేసిన ఆమె పెట్టె బేడా లోపల పెట్టించారు. ఆ తర్వాత రెండు రోజులకే ఆమెతల్లి కూతురిని ఒక్కసారి చూడాలని ఎన్నో మార్లు కలవరించి, కలవరించి కన్నుమూసిందని విని, ఆమె మొదలుతెగిన అరటిచెట్టులా పడిపోయింది. పోనీ, ఆమె భర్త ఏం తెలియనివారా అంటే కాలేజీలో సైకాలజీ లెక్చరరుగా పనిచేస్తున్నారు. కాని ప్రతినిత్యం ఆయన కాలేజీలో కుర్రాళ్ళకు మనస్తత్వశాస్త్రాన్ని గురించిన పాఠాలు చెప్పటమేగాని, తమ స్వంత విషయంలో, తనను నమ్మి జీవితభాగస్వామినిగా వచ్చి కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్న భార్య విషయంలో, తన అమానుష ప్రవర్తనపట్ల ఆమె మానసికంగా ఎంత క్రుంగిపోతుందో వూహించలేకపొయ్యారు.


సామాన్యంగా మన సాంఘిక వ్యవస్థలో, వివా

(44-వ పేజీ చూడండి)

దగ్గు మరియు రొంపనుండి
నిజమైన స్వస్థత పొందుటకు







సిరోలిన్ వాడండి



దగ్గు లేక రొంపను అశ్రద్ధచేయకండి. సిరోలిన్ వాడి నిరపాయముగా, శీఘ్రముగా నిజమైన స్వస్థత పొందండి. సిరోలిన్ దగ్గును ఆపుటయేకాదు. అది మీ దగ్గుకు మూలకారణమైన హానికరమగు సూక్ష్మ క్రిములను నశింపచేయును; కఫమును నుసను పోగొట్టును. సిరోలిన్ ఎంత కష్టమైన దగ్గునైనను శీఘ్రముగా పోగొట్టి స్వస్థత చేకూర్చును. దాని పనితనమును బట్టియు రుచిని బట్టియు సిరోలిన్ కుటుంబములోని వారి అందరి అభిమాన పాత్రమై యున్నది. పిల్లలకు సిరోలిన్ అంటే ఎంతో ప్రీతి.

మీ యింట్లో సిరోలిన్ తప్పక ఉంచండి

'రోష్' తయారు   సోల్ డిస్ట్రిబ్యూటర్సు: వాల్టాస్ లిమిటెడ్

JWT-VT 2397

కవి సార్వభౌముడు

నోరి నరసింహ శాస్త్రి

జరిగిన కథ

సర్వజ్ఞ చక్రవర్తి బిరుదాంచితుడగు కొండవీటి ప్రభువు పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథభట్టును కవిసార్వభౌమ బిరుదు పట్టముతో అలంకరించి, సర్వవిద్యానిలయమైన శ్రీ విద్యానగరమునకు విద్యావిజయ ప్రస్థానము చేయవలసిందని అర్థిస్తాడు. కార్యసిద్ధికై దైవజ్ఞులునూచించిన పౌష్టిక క్రియలు ఆచరించి శ్రీనాథుడు యాత్రకు సంసిద్ధుడవుతాడు. సింగన ప్రధానితోను, వామనభట్ట బాణునితోను ముచ్చటించి, డిండిముని శాస్త్ర పాటవము, లోపాలు తెలుసుకుంటాడు. వేమభూపాలుడు ఆయనకు ఉచితమైన వీడ్కోలు ఇచ్చి పంపుతాడు. శ్రీనాథుడు దారిలో వినుకొండ వల్లభరాయని ఆతిథ్యాన్ని స్వీకరించి కొన్నాళ్ళకు విద్యానగరం చేరుకుంటాడు.

ఆనాటి శ్రీ విద్యానగరము మహావైభవముతో నుండెను. ఆ మహానగరము తుంగభద్రా నదికి దక్షిణతీరమున గలదు. ఒక ప్రక్క మతంగగిరియు, వేరొకప్రక్క మాల్యవంతమును హేమకూటమును కలవు. ఆ పర్వతములనుచుట్టియు దాటియు దక్షిణ దిక్కుగా పెరుగుచు, పూర్వ మరణ్య ప్రదేశముగా నుండిన భాగము లాక్రమించుకొని, పశ్చిమమున వంపాపురము, కృష్ణాపురము, వడిరావుపురము నాగలాపురములను, ఆగ్నేయమున కమలాపురమును, ఈశాన్యమున నింబపురమును ఇంకను నెన్నియో పల్లెలను తనలో కలుపుకున్నది. దానికి ఏడు ప్రాకారములు కలవు. అన్నిటిలో వెలుపలి ప్రాకారమునకు రాజ్యములో నలుదిక్కులనుండి నాలుగు మహారాజమార్గములు ప్రవేశించు నున్నత గోపురద్వారములుకలవు. వానిలో పశ్చిమ ద్వారమునుండి ఉత్తర ద్వారమునకును, ఉత్తర ద్వారమునుండి దక్షిణ ద్వారము వరకును రెండు రెండు యోజనముల దూరము కలదు.

వానిలో నుత్తరద్వారము శ్రీ విరూపాక్షేశ్వరాలయమున కొక్కించుక తూర్పుగా కలదు. ఉత్తరమున వానెగొంది వైపునుండి వచ్చువారు తుంగభద్రానది పై వంతెనదాటి యాద్వారమున వత్తురు. నది కుత్తరమున ఋష్యమూకము అంజనాద్రియున్నవి.

ఆ మహారాజ్యమునకు పశ్చిమ సముద్ర తీరమున నెన్నియో రేవులు కలవు. అటునుండివచ్చు విదేశ వర్తకులును, యాత్రికులును నాగలాపురము (ప్రస్తుతము హొసపేట) ద్వారమునుండి వత్తురు. దక్షిణమున చోళ, పాండ్య దేశములనుండియు, అక్కడి రేవుల నుండియు వచ్చువారలు కమలాపురవు సింహ ద్వారమున వచ్చుచుందురు.

ఆంధ్రదేశమునుండియు, అచ్చటి రేవుల నుండియు వచ్చువారు మాల్యవంత సమీపమునగల తూర్పు ద్వారమున వచ్చుచుండిరి. శ్రీనాథభట్టు తన పరివారముతో ఆ ద్వారము నెదుటికే చేరికొనెను.

గోపురము దూరమున నుండగనే వారికి అపూర్వదృశ్యము కనబడినది. ఆ ప్రాకారము బారున బయట విశాలమగు వాహ్యాళిప్రదేశము

(43-వ పేజీ చూడండి)



స్వప్నవర్తకుడు

శింగీతం లక్ష్మీకళ్యాణి



చాలా శతాబ్దాలకు పూర్వం దండకారణ్య సమీపంలో ఒక రాజ్యాన్ని ఒక వృద్ధ రాజదంపతులు పాలిస్తూ వుండేవారు. వారికి ఎంతకాలానికీ సంతతి కలుగకుండడంవల్ల దానాలు, ధర్మాలు, వ్రతాలు మున్నగునవి ఎన్నో చేశారు. కాని వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యేసరికి విరక్తి చెంది విరాగులై తుదకు వా రిరువురు తమ శేషజీవితాన్ని పరమేశ్వరుని ధ్యానిస్తూ గడుపజొచ్చారు. మహేశ్వరుడు ఆ వృద్ధదంపతులయెడ కరుణించి ఒకేరాత్రి వారిరువురికి స్వప్నంలో కనుపించి, కావలసింది కోరుకోమన్నాడు. రాజు క్లుప్తంగా ఒక పుత్రుణ్ణి కోరాడు. కాని, రాణి రేవెల్గు వెలుగుతో ధగధగ మెరుస్తున్న చంద్రశేఖరుని జటాజూటాన్నిచూచి, భక్తిపారవశ్యంతో, "ఓ వరదాతా! నా పుత్రునిలోని ఏ ఒక్క అణువైనను లేక ఆ అణువులో ఒక్క సహస్రాంశమైననూ సరే నిన్నుపోలియున్నచో ధన్యురాలను. కనుక నన్నొకసారి నీ కేశములతోతాకి భగవదంశను నాకు ప్రసాదించవలసినది" అని కోరింది. అప్పు డీశ్వరుడు తనలో, "ఎంత సూక్ష్మమైనదైనను నాలోని భాగము అత్యంత శక్తియుతమైనది. అది మానవ మాత్రునికి అతీతమై, అతని స్థైర్యాన్ని చెదిరిస్తుంది. కాని నే నీమెకు ముందే వరమిచ్చివున్నాను గనుక ఈమె కోరిక చెల్లించితీరాలి. ఈమె పుత్రుడు తన పూర్వజన్మకృత ఫలితాన్ని అనుభవించక తప్పదుకదా!" అని అనుకుంటూ తన తల వెంట్రుక నొకదానిని త్రుంచి, రాణి చేతిలోపెట్టి అంతర్థానమయ్యాడు.

ఉదయమున మేల్కొని రాజు, రాణి తమ స్వప్నములను అతి ఉత్సాహంతో పోల్చుకుంటూంటే—ఆశ్చర్యము!—రాణి చేతిలో అగ్ని జ్వాలలతో మెరిసే తీగలాంటి కేశము కనబడింది. ఆనందభరితులై వా రిరువురు ఆ కేశాన్ని ఒక సువర్ణ మంటపంలో వుంచి, దాని చుట్టూ ఒక ఆలయాన్ని కట్టించి పూజించారు. కొంతకాలానికి రాణి ఒక పుత్రుణ్ణి ప్రసవించింది. తగిన పేరు పెట్టాలనే సంకల్పంతో తల్లిదండ్రు లతనికి రుద్రాలకుడని నామకరణం చేశారు. పేరుకుతగ్గట్లు అతను చిన్నప్పుడు ఆటలాడుకునే సమయంలో ఎర్రనైన అతని తల వెంట్రుకలు గాలికి ఎగురుతుంటే అవతరించిన వాయుసఖునిలా ప్రకాశించేవాడు.

అతను పెరిగి పెద్దవాడయ్యేసరికి ఇనుమడించిన బలంతో, ఉబికివచ్చే ఉత్సాహంతో ప్రజ్వరిల్లుతూ, ఎవ్వరికీ లొంగని మదపుటేనుగులాగ, ఎవ్వరినీ లక్ష్యం చేయని రాతికొండలాగ రూపొందాడు. ఇది చూచి అతని తండ్రి రాణితో, "నీవు పరమేశ్వరుని వర ప్రసాదంవల్ల పుత్రుణ్ణి కన్నావుగాని, చూడబోతే వీడికి ఈశ్వరుని గుణగణాలకు బదులు అతనిబంటైన నందిచేష్టలు అబ్బుతున్నాయి" అంటూ చింతించాడు.

రుద్రాలకుణ్ణి మగసిరి అలంకరించేటప్పటికి అతనిలో ఉత్సాహం పొంగి, వరదల్లోవున్న నదీ ప్రవాహంలాగ గట్లు తెంపుకొని ప్రవహించింది. శక్తి బలసంపన్నులైన పురుషుల నందరిని బల ప్రదర్శనాలలో గెలిచి మేటి అనిపించుకున్నాడు. అంతటితో ఆగక, మత్తెక్కిన తేనెటీగలాగ వేడెక్కిన అలరుబోడుల అందాన్ని క్రోలి మధువును, శీలాన్ని

(40-వ పేజీ చూడండి)

కొఖ్యానులు.14

చేపెట్టే కథల్లా పుష్టిగాం
చూపెట్టే చిత్రాల్లా తుష్టిగాం
జో కొట్టే పాటల్లా లాలనలాం
తైపెట్టే వేళల్లా హెళ్ళనలాం

కోపానికి కార్టూనలా
కోపంలాం ఝూకేగాం
కబుర్లలో టూంకీగాం

వేడుక వాడుక భాషమీద
అధారిటీగా ఉండువారు
డబ్బూ పేరూ తెచ్చే
ఓల్డు-గోల్డు స్కూలుమాష్టర్
పి. పుల్లయ్యగారు
పనేమిటో తెలీకుండా ఎన్నడూ
పేంవారం వెళ్ళినవారుకారు
గాని, ఒక్క 'కన్యాశుల్కా'నికి
మటుకాయన
చేసిందొత్తి షికారు





బీర్బల్ స్వర్గలోకయాత్ర

'శాంతిశ్రీ'

"బీర్బల్" తెలివితేటలు రోజురోజూకు అక్బరును ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. అతనిపై అభిమానం గూడా అక్బర్‌కు ఎక్కువ అవుతోంది. ఇది చూసి ఆ ఆస్థాన ఉద్యోగులు కొందరు కన్నుకుట్టుకున్నారు. వారిలో బీర్బల్ పై అసూయాభావం జనించింది. తుదకాతనిని కడతేర్చవలెనని ఒక ఉద్యోగి నిశ్చయించుకొని మిగిలినవారందరకూ ఆ విషయం చెప్పాడు. వారంతా సంతోషంగా ఆపనిచేయటానికి ఒప్పుకొన్నారు.

"బీర్బల్"ను ఏవిధంగా చంపటమా అని వారు ఆలోచింపసాగారు. ఆపని చేయుటకు అక్బరు వద్ద పనిచేసే మంగలి సమర్థుడని వారనుకున్నారు. ఆ మంగలి అక్బరుకు అత్యంత ప్రియుడు. అతడు రోజూ నగరంలో జరిగే వింతలూ, విశేషాలు అన్నీ మహారాజునకు తెలుపుతుండేవాడు. అప్పుడప్పుడు రాచకార్యములలోగూడా అక్బరునకు సలహాల నిచ్చేవాడు.

ఆ రాజోద్యోగుల్లు మంగలివానిని పిలచి రహస్యంగా తమ నిశ్చయం అతనికి చెప్పారు. మొదట ఆ మంగలివాడు ఆపని చేయటానికి అంగీకరించలేదు. కాని వారు కొంత డబ్బు లంచమివ్వగా అతడాపని చేయటానికి ఇష్టపడ్డాడు.

మరుచటిదినము ఆ మంగలి అక్బరుకు గడ్డంగీయుచు ఇలా అన్నాడు:

"అయ్యా! నేను తరచుగా మీ తండ్రిగారియొద్దకు వెళ్తూ ఉంటాను. ఆయనది ఎంత అందమైనజుట్టు. మెత్తగా పట్టులాగుంటుంది.

"ఆఁ ...నిజంగానా?" అక్బర్ చాలా ఆశ్చర్యంగా అడిగాడు.

"నిజమే ప్రభూ!" అని ఆ మంగలి అక్బరుతో, "తమర్ని నేనొక ప్రశ్న అడగవచ్చునా?" అన్నాడు సందేహంగా.

"ఏమిటది? అడుగు!" అన్నాడు అక్బర్.

"మీరు ఈ భూలోకంలో సకల భోగభాగ్యాలతో తులతూగుతున్నారుగదా! మరి మీ పూర్వ

(౩౮-వ పేజీ చూడండి)

సప్త గ్రహ కూటమి

దైవజ్ఞ పోతూరి శ్రీరామమూర్తి

1962 వ సంవత్సరం ఫిబ్రవరి 4, 5 తేదులలో జరుగబోయే గ్రహకూటంవల్ల అనేక విధములైన విషమ పరిణామాలు రాగలవని అనటమే కాకుండా ఈ మధ్య బీహారు, ఒరిస్సా మొదలయిన ప్రదేశాలలో ఏర్పడ్డ వరదలుకూడా రాబోతూ ఉన్న ఆ గ్రహకూటం తాలూకు ఫలితమేనని కూడా అంటూ ఉన్నారు. ఈ సందర్భంలో అందరూ గ్రహించవలసిన ముఖ్యాంశం ఒకటి ఉన్నది. ఈ గ్రహ గోళాలు కూడా నాలుగు భూతాలయొక్క సంఘటితాలేను అనేది ప్రధానం. ఒక గోళంలో తేజోంశం అధికంగా ఉండవచ్చు. మరొకదానిలో జలాంశం అధికంగా ఉండవచ్చు కాని, ప్రతిగోళానికి దాని ఉనికికి కావలసిన మిగతా తత్వాలున్నూ, తగు పరిమాణాలల్లో అమరిఉన్నవి ఇది ప్రకృతిసహజంగా ఏర్పడ్డది. రసాయనిక శాస్త్రప్రకారంగా, కొన్ని రసాయనిక ద్రవ్యాలు కొంత పరిమితదూరంలో చేరినతరువాతగాని, వాటినుంచి కొన్ని పరిణామాలు కలుగవు. అదేవిధంగా జ్యోతిషశాస్త్రంలో ఒక రాశిలో కొన్నిగ్రహాలు చేరినప్పుడు ఒక గ్రహానికి మరొక గ్రహానికీ "ఇన్నిభాగల దూరంలో ఉన్నప్పుడు ఈ ఫలితం ఈ విధంగా అన్వయించవలసినది" అని ఒక నిర్ణయం చేసిఉన్నారు. ఉత్తర కాలామృతంలో స్థూలంగా పన్నెండు భాగలదూరం ఫలకాంకం అంటూ ఉదాహరించి ఉన్నది తాజిక గ్రంథాలలో సూర్యునకు పదిహేనుభాగలు, చంద్రునకు పన్నెండు భాగలు, అంగారకునకు ఎనిమిది భాగలు, బుధునకు ఏడు భాగలు, గురువుకు తొమ్మిది భాగలు, శుక్రునకు ఏడు భాగలు, శనికి తొమ్మిది భాగలు దీప్త భాగలుగా చెప్పి ఉన్నారు. అనగా రెండు గ్రహాలు ఈ దీప్తభాగల పరిమితిలోకి చేరినప్పుడు ఒక గ్రహంమీద మరొక గ్రహంయొక్క ప్రభావం ప్రసరిస్తుంది అని అన్వయించిఉన్నారు అటువంటప్పుడు కనీసం ఇప్పటికి మూడు మాసాలకు పైబడిన కాలంలో కలుగబోయే గ్రహ సంయోగపు పరిణామాలు ఇప్పటికే ప్రారబ్ధములు అయినవి అనటం నిజంగా ప్రారబ్ధమే అనాలి.

ఈ కూటాన్ని అష్టగ్రహకూటం అనటం జ్యోతిషశాస్త్రరీత్యా ఎంతమాత్రమున్ను సమంజసంగా తోచటంలేదు. రాహు, కేతువులు, సూర్యసంచార మార్గంమీద చంద్రసంచార మార్గపు సంపాతస్థానాలు. మిగతా గ్రహాలకుమాదిరిగా ఒక గోళం ఏమీలేదు. వరాహమిహిరులు వ్రాసిన బృహత్సంహితలోని రాహు చారాధ్యాయం ఈ సందర్భంలో ముఖ్యంగా చూడతగినది. అందువల్ల ఇది సప్తగ్రహకూటమేకాని, అష్టగ్రహకూటంకాదు. తరచూ నాలుగుగ్రహాలు, అయిదు గ్రహాలు చేరుతూ ఉండటం సంభవిస్తూనే ఉన్నది. కాని ఆ గ్రహకూట సందర్భాలలో ఎక్కువవాటిలో సూర్యచంద్రుల సంబంధం ఏర్పడుతూ ఉన్నది. అట్లా సూర్యచంద్రుల సంబంధం లేకుండా మిగతా గ్రహాలలో కొన్ని చేరినప్పుడు మండల విస్తృతిగల గ్రహాలు ప్రాధాన్యం వహిస్తూ ఉంటవి. కుజాది పంచతారాగ్రహాలలో గురు శుక్రులు కాంతి ప్రాబల్యంకల గ్రహాలు. జ్యోతిషశాస్త్రంలో ఈ రెండు గ్రహాలే విశేష శుభ గ్రహాలు కావటంవల్ల మిగతా గ్రహాలవల్ల ఏమాత్రమైనా దోషం ఏర్పడకుండా కాపాడుతూ ఉండటం జరుగుతున్నది. సూర్యునితో ఏ గ్రహం చేరినా అస్తమించిపోతుంది. అంటే సూర్యుని ప్రభావం ముందర మిగతా గ్రహాలశక్తి సంపూర్ణంగా లోపించిపోతుందన్నమాట. చంద్రుడు సహితం సూర్యునకు నూటఎనభై భాగల దూరంలోకి వచ్చినప్పుడుగాని సమగ్రప్రకాశంతో భూమిమీదికి తన ప్రభావాన్ని సంపూర్ణంగా వెదజల్లలేకపోతున్నాడు. భూమికి అతి దగ్గరగాఉన్న చంద్రుని స్థితే ఈ విధంగా ఉన్నప్పుడు మిగతా గ్రహాలమాట చెప్పవలసిన అవసరమేలేదు. అసలు సూర్యుడు ఏ నాడు ఏవిధంగా రూపొందిందీ దురూహ్యంకదా! కాని, కుజాదు మొదలయిన గ్రహాలన్నీ భూమీ కూడా సౌర కుటుంబానివని అన్నారు. ఇవి సూర్యునిచుట్టూ నియతమైన గతితో తిరుగుతూ ఉన్నవి. దీనినిబట్టి ఈ గ్రహాలన్నీ సూర్యునిలోనుంచిగాని, సూర్యునితో బాటుగాని ఉద్భవించి ఉండాలి.

సూర్యుడు అగ్నియొక్క కేంద్రం అన్న సంగతి ప్రపంచంలోని ప్రతి వేత్త తెలుసుకున్న విషయం. సూర్యునిలో ఏ అగ్ని ప్రధానంగా ఉన్నదో మిగతా వాటిల్లోనూ అదే అగ్ని తగు పరిమాణంలో అమరి ఉన్నది. సూర్యునిపేర్లలో "సవిత, మార్తాండుడు" అనే శబ్దాల అర్థాన్ని గ్రహించవలసి ఉన్నది.

"షూఙ్ ప్రాణి ప్రసవే గర్భమోచనేచ" అనే ధాతువుయొక్క అర్థం సవితృశబ్దానికి మూలాధారం. ప్రాణాలను బయటకు తెచ్చువాడు అని అర్థం. "మృతం అండం జీవ యతీతి మార్తాండః" చైతన్యరహితమైపోయిన విశ్వాన్ని తిరిగి ఉజ్జీవింప చేయువాడు, ప్రాణదాత అని అర్థం.

మన గ్రహాలకు చెప్పే మంత్రాలలో ఎక్కువ భాగం అగ్ని ప్రధానుడైన సూర్యుని స్తుతించేవే కాని, వేరుకాదు. అందువల్ల గ్రహమండలంమీద సూర్యునకు ఎంత ప్రాభవం ఉన్నదీ వివరంగా తెలుస్తుంది. సమస్తమూ బ్రహ్మ అంశమే అయినట్లు గ్రహ గోళాలన్నీ సూర్యునిలో సమన్వయం కావలసినవే. గ్రహాలన్నీ సూర్య సంచార మార్గానికి ఉత్తర దక్షిణాలలో నిర్ణీతదూరంలోనే సూర్యుని అదుపులో సంచరిస్తున్నవి.

ఇక మన ఉపాసనాకాండచూస్తే సూర్యమండలాన్ని లక్ష్యంగా పెట్టుకుని సాగించినట్లుగా స్పష్టంగా తెలుస్తున్నది.

"మండలాంతరగతం హిరణ్మయం" "హార హిరణ్మయ వపుః" "ఆదిత్యో వై తేజఓజోబలం" మొదలయిన వాఙ్మయమంతా సూర్యునకే ప్రాధాన్యం ఇస్తున్నవి. రేపు జరుగబోయే ఏడు గ్రహాల కూటంలో సూర్యుడు ప్రధానం అవుతున్నాడు. సూర్యుణ్ణి మినహాయిస్తే, ఇది సప్త గ్రహకూటం కూడా కానే కాదు సూర్యుని ప్రభావంలో మిగతా గ్రహాల తేజస్సు హీనమైపోయి, ఆ మిగతా గ్రహాలకు ప్రత్యేకమైన వ్యక్తిత్వం అనేది లేకుండా పోతూఉండగా, సూర్యుడు విశ్వ రక్షకుడుగాఉంటూ ఉండగా, ఈ గ్రహకూటంలో శుభ గ్రహాలుగా ప్రశంసలనందుకొనే గురు శుక్రులుచేరి ఉండగా, ఈ కూటంవల్ల ప్రకృతి విప్లవాలు, భూకంపాలు ఉప్పెనలు, పర్వతాలు బద్దలుకావటం వంటివి సంభవించే అవకాశంలేదు.

ఈ గ్రహ సమావేశం భూమధ్యరేఖకు చాలా దక్షిణ ప్రాంతంలో జరుగుతూ ఉన్నది. తారా గ్రహాలు సూర్యునితో ఏ దిక్కున చేరుతూఉన్నవో ఆ దిక్కునఉన్న దేశాలలో యుద్ధ భయము, కరవులు, అరాజకము మొదలయినవి వచ్చే అవకాశాలున్నట్లు సంహితా గ్రంథాలవల్ల తెలుస్తున్నది. కాబట్టి భూమధ్యరేఖకు ఉత్తరాన ఉన్నటువంటి భారతదేశం మొదలయిన ప్రాంతాలలో ఈ చెప్పిన ఉపద్రవాల వంటివి కూడా సంభవించే అవకాశం లేదని శాస్త్ర రీత్యా కనబడుతున్నది. మిగతా గ్రహాలు అన్ని బలహీనులు కావటంవల్ల వాటి కూడికవల్ల ప్రస్తుతం ప్రజలు కలవరపడుతూ ఉన్నటువంటి భూత విప్లవాలు కలిగే అవకాశం ఎంతమాత్రం కనబడటంలేదు. మనం ఇప్పటికన్నా ఎక్కువ క్షేమంగా ఉండటంకోసం భగవంతుణ్ణి అవకాశంకొద్దీ ఉపాసించటం మంచిదే.

సర్వే జనాస్సుఖినోభవంతు.

ఈ గ్రహసమాగమాన్ని గురించీ, దాని ఫలితాన్ని గురించీ వరాహమిహిరులు వ్రాసిన పంచసిద్ధాంతిక, బృహత్సంహితలనూ, సూర్య సిద్ధాంతంలోని గ్రహ యుత్యధికారమునకు రంగనాధుని వ్యాఖ్య సావకాశంగా పరిశీలిస్తే చక్కగా బోధపడుతుంది. ★



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

17-11-1961 శుక్రవారము మొదలు
23-11-1961 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ప్రస్తుతం మీ శక్తిసామర్థ్యాలను చక్కగా వినియోగించుకోగలుగుతారు. క్రొత్త మనుషులతో వ్యవహారాలు సాగించవలసి వస్తుంది. ఇతరులను నమ్మి ఆరంభించిన పనులు సక్రమంగా జరుగుతవి. అయితే ఖర్చు మాత్రం అధికంగా కనుపిస్తుంది. పిల్లల ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండండి. స్నేహితుల వద్దనుంచి వచ్చే వార్తలు ముందు ముందు అనుకూలిస్తవి. శుభ పుణ్య కార్యాలలో పాల్గొనవలసి వస్తుంది. వారం రెండవ భాగంలో తలవని తలంపుగా బంధు మిత్రులతో కలహాలు వస్తవి. ఇతరులకు సహాయం చేదామనే అభిప్రాయాన్ని మార్చుకోవలసి వస్తుంది. అపవాదులు రాకుండా చూచుకొనటం అవసరం. పైత్య సంబంధమైన అనారోగ్యం చేయువచ్చు 17, 18 తేదులలో పరుల నిమిత్తం శ్రమ, శుభ వార్తలు, ఇష్టవస్తు లాభం.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఒకప్రక్క మానసికంగా ఆందోళన ఉంటున్నా, ధైర్యంతో మీ బాధ్యతలను నిర్వహించుకొని పెద్ద వారి ఆదరాభిమానాలను పొందగలుగుతారు. పేరు ప్రతిష్ఠలు పెరగగల సమయం. కోర్టు కచేరీలలో మీ ఆలోచనలు ఫలించకపోవటంవల్ల క్రొత్త మార్గాలను అనుసరించవలసి వస్తుంది. ఆదాయం కొంత వరకు తగ్గే అవకాశా లున్నవి. బంధువులవల్ల అనుకూలత ఉంటుంది. డబ్బుకు సంబంధించిన లావాదేవీలలో తగాదాలు రాగల సమయం. ప్రయాణాలు సులభంగా జరుగుతవి. కాని, అందువల్ల ఉపయోగం మాత్రం తక్కువ. అవకాశం మించిపోయిన తరు

> ### గ్రహస్థితి
> కర్కాటకంలో రాహువు, తులలో బుధ, శుక్రులు, వృశ్చికంలో, సూర్య, అంగారకులు, మకరంలో గురు, శని, కేతువులు, కుంభ, మీన, మేష, వృషభాలలో చంద్రుడు.

వాత ఆలోచన తోస్తూ ఉంటుంది. వృత్తిలో మీరు అనుకున్నంత చిక్కు ఏమీ ఉండదు 22, 23 తేదులలో గౌరవయోగం. విలువగల వస్తువులు కొంటారు.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ఈ వారం మీ గ్రహస్థితి చాలా బాగున్నది పదిమంది మిమ్ములను అనుసరిస్తారు. ఒకప్పుడు భయంకరంగా తోచిన పనులు ఈ సమయంలో సులభంగా చేయగలుగుతారు. అప్పులు చేయవలసిన అవసరం కలుగకుండా చూచుకొనండి వృత్తి వ్యాపారాలలో ఇతరుల పోటీని ఎదుర్కొని కార్యం సాధించగలుగుతారు కుటుంబంలో ఖర్చులు క్రమంగా పెరగవచ్చు యంత్రాలు, ఆయుధాలు మొదలయినవి ఉపయోగించటంలో జాగ్రత్తగా ఉండండి. నీచులు అని తెలిసి కూడా సమయానుకూలంగా మంచితనంతో ప్రవర్తించవలసివస్తుంది. సాధ్యమైనంత గుట్టుగా ఉండటం మంచిది. దేహసౌఖ్యం బాగుంటుంది శుభ పుణ్యకార్యాలు అనుకూలించకపోవచ్చు. 19, 20 తేదులలో అకస్మాద్ధనలాభం, అధికారుల స్నేహం

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

ఏ సమయంలో ఎక్కడ పొరపాటు జరుగుతుందో తెలియదు ప్రతి పనీ మరిచిపోతూ ఉంటారు. నరముల బలహీనతవల్ల విసుగుదల అధికం అవుతుంది ఆదాయం బాగానే ఉంటుంది కొంతవరకు ఆలోచన చెప్పి, మిమ్ములను ముందుకు నడిపేవారు లభిస్తారు. బంధువులవల్ల ధన సహాయం లభిస్తుంది వృత్తిలో తలవని తలంపుగా అభివృద్ధి కనిపిస్తుంది. వారం రెండవ భాగంలో వ్యవహారాలలో అనుకూలత లభిస్తుంది రావలసిన ధనం సులభంగా చేతికి వస్తుంది. కుటుంబంలో సుఖ సంతోషాలు లభిస్తవి నౌకరులు మొదలయినవారివల్ల తగినంత ఉపయోగం ఉంటుంది. ఆడంబరంతో కూడిన ఖర్చులు అధికం. 20, 21 తేదులలో సంఘంలో గౌరవం, అలంకార వస్తు వాహనాది లాభం. వృత్తిలో అభివృద్ధి.

* *

సింహం .

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

సుఖము, ధనాదాయము అన్నీ బాగానే ఉంటవి. కాని, ఇతరుల ప్రచారంవల్ల పేరుకు భంగం వస్తుందేమోననే ఆందోళన పట్టుకుంటుంది. దైవానుగ్రహంవల్ల ఏ విధంగాను ఇబ్బంది ఉండదు. స్వశక్తితో ఫలితం పొందగలుగుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం కలిగించుకోకుండా ఉండటం అవసరం. ఆడంబరంతోపాటు నిరుపయోగమైన ఖర్చులు పెరగగల అవకాశాలున్నవి. మిమ్ములను గౌరవిస్తున్నట్లు మాట్లాడుతూ, ఆక్షేపించేవారు ఉంటారు ప్రస్తుతం శివ కవచ స్తోత్ర పారాయణంవల్ల మనశ్శాంతి, ధైర్యము లభిస్తవి. వ్యాపార వ్యవహారాలలో జయము, అధికారులవల్ల గౌరవము పొందగలుగుతారు 21, 22 తేదులలో బంధు దర్శనం, దైవకార్యాలు, ఆస్తి వృద్ధి ప్రయత్నాలలో అనుకూలత.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

చేసిన పనినే చేయవలసి వస్తుంది దైవబలం బాగున్న సమయం అప్రయత్నంగా ధనాదాయం

లభిస్తుంది. వ్యవహార పరిష్కారాలు కుదిరి, మనశ్శాంతి లభిస్తుంది క్రొత్త మనుష్యులతో కలిసి చేయుపనులు సంతృప్తికరంగా ఫలిస్తవి. వృత్తిలో పైవారి ఆదరాభిమానాలు లభిస్తవి. పైన పెట్టుకున్న బాధ్యతలు పూర్తిగా నెరవేరి అనుకున్న దానికంటె అధికంగా ఆదాయం పొందగలుగుతారు. సంఘంలో మీ మాటకు ఎదురు చెప్పే వారు ఉండరు. ఇతరులను ముందుకు నడిపి శక్తి వంచన లేకుండా సహాయం చేయగలుగుతారు. కుటుంబంలో ఆనందం లభిస్తుంది. ప్రశాంతమైన సమయం. 18, 19 తేదులలో బంధుమిత్రుల ఆదరణ, విలువగల వస్తువులు కొంటారు. ప్రయాణాలు.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

మనోబలం బాగుండటంవల్ల ఎటువంటి సమస్య వచ్చినా సులభంగా పరిష్కరించి మీ పనికి ఆటంకం లేకుండా చేసుకోగలుగుతారు. అవతలివారి మాట ప్రకారం మీ బుద్ధిని ఉపయోగించి కార్యం సాధించవలసిన సమయం. ఆరోగ్యం బాగుంటుంది. ప్రశాంతంగా ఉండి ఎదుటివారి మనస్సుకు నొప్పి లేకుండా వృత్తిలో ఫలితం పొందవలసిన సమయం. ప్రయాణాలు చేస్తారు. క్రొత్త బాధ్యతలు పైన వేసుకొనటానికి ఉత్సాహం కనుపించదు. ఆదాయం మామూలుగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటవి. స్నేహితుల మాటలలోని ఆంతర్యం గ్రహించి మసలుకోవలసి ఉంటుంది. 20, 21 తేదులలో సభాగౌరవం, ధర్మకార్యాలు

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

పట్టుదలలు పెరిగే సూచనలున్నవి. కుటుంబంలో ఏదో ఒక విధమైన అశాంతి కనుపిస్తూ ఉంటుంది ఒకసారి ప్రయత్నించి, నిలచిపోయిన లావాదేవీలు ఈ సమయంలో కలిసి వస్తవి. క్షణక్షణానికి మాట మార్చే మనుష్యులతో జాగ్రత్తగా ఉండవలసి వస్తుంది. ఏ విషయంలోనైనా రహస్యము, నిదానము అవసరం. కుటుంబంలోనివారి ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండండి. ప్రయాణాలు కలసి రావచ్చు. మీ మనోభావాన్ని గుర్తెరిగి సలహా చెప్పేవారు లభిస్తారు. తొందరపడి ముందుగా ఎవ్వరికీ వాగ్దానాలు ఈయతగిన సమయంకాదు. ముఖ్యమైన పనులను స్వయంగా నిర్వహించుకొనటం మంచిది. 18, 19 తేదులలో చికాకు, ఇష్టంలేని పనులలో ప్రవేశించవలసి వస్తుంది.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఆడంబరం బాగుంటుంది. ఎప్పుడు ఏదో ఒక పని చేస్తూ ఉంటారు. మీ మాటను గౌరవిస్తున్నట్లు మాట్లాడుతూ, మీ విరోధులతో చేరే రకం మనుష్యులు ఉంటారు. జాగ్రత్తగా ఉండండి. వృత్తి ఉద్యోగాలలో అన్ని విధాలా బాగానేఉన్నా, పోటీ వారి మాటలు మీ మనస్సుకు అశాంతిని కలిగిస్తవి. ఎవరితో ఏ విధంగా ప్రవర్తించవలయుననే విషయం అనుభవంలో తెలుసుకోగలుగుతారు. పిల్లల ఆరోగ్యం సరిగా ఉండదు. ఇతరుల నిమిత్తం శ్రమ పడతారు. కాని, తగినంత విలువ కనుపించదు. ఉత్తర దిక్కు నుంచి అకస్మాత్తుగా ధనలాభం ఉంటుంది. ప్రయాణాలు నిలుపుకొనవలసి వస్తుంది. 22, 23 తేదులలో కలహాలు, స్వల్ప ధనలాభం.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

కంటిముందు కనిపిస్తూ ఉంటుంది. అందుకొనే సమయంలో మాయం అవుతుంది. ఎవరు ఎంత గౌరవించి మాట్లాడినా, ఫలితం మాత్రం ఉండదు. పటాటోపంమాత్రం తగ్గదు. దూరమందున్న మిత్రులు కొంతవరకు సహాయం చేస్తారు వ్యవహారాలలో మీ మాట చలామణీ అవుతుంది. ఆదాయం ముందుకన్నా మేలుగా ఉంటుంది. సంచారంతో కూడిన పనులు అధికం. అనవసరంగా మాట వస్తుందేమోననే ఆందోళన మిమ్ములను బాధిస్తూ ఉంటుంది. దైవానుగ్రహంవల్ల స్వబుద్ధితో ముందుకు పోగలుగుతారు. బంధువుల రాక పోకలు అధికం. ఉద్రేకాన్ని తగ్గించుకొనవలసిన సమయం. 17, 18 తేదులలో లాభ వార్తలు, వ్యవహార జయం.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

మనోధైర్యంతో మీ ధర్మాన్ని నిర్వర్తించుకొనగలుగుతారు. చేసిన ప్రయత్నం కలసి వస్తుంది. ఏ విషయంలోనూ మాట మిగలటం మంచిదికాదు. ఆదాయం ప్రోత్సాహకరంగా కనుపించకపోయినా, వృత్తి, ఉద్యోగాలలో గౌరవము, అధికారుల ఆదరము లభిస్తవి. ముందు కఠినంగా మాట్లాడినవారే మీకు అన్ని విధాలా సహాయం చేస్తారు. పై వేషం చూచి మంచి వారేనని మోసపోవద్దు. దుబారా ఖర్చులు చేయవలసి వస్తుంది. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించేటట్లు కనుపిస్తూ, ఆలస్యం అవుతూ ఉంటవి. బంధువులకు నిష్కారణంగా మీ మీద ఆగ్రహం కలుగవచ్చు.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

ఏమి జరిగినా ఈ సమయంలో మీ మనస్సు చలించదు. కష్ట సుఖాలను సహనంతో భరించగల ధైర్యం లభిస్తుంది. అపవాదులు వస్తవి. కాని, వెంటనే మీకు అనుకూలం కనుపిస్తుంది. శక్తికి మించి ఖర్చులు చేస్తారు. ఇతరులమీద విడచి పూరుకొన్న వ్యవహారాలు ఒక సమస్యగా తయారు కావచ్చు. ఒకరిపక్షం మాట్లాడితే మరొకరితో విరోధం తెచ్చుకొనవలసిన సమయం. కుటుంబ విషయాలలో మీ వాక్చాతుర్యాన్ని ఉపయోగించి కార్యం సాధించుకో గలుగుతారు. సంచారంతో కూడిన పనులు ఎక్కువ. 20, 21 తేదులలో వస్తు నష్టము, శుభవార్తలు. స్వల్ప ధనలాభం.


ఈ వారము ధరలు

బంగారు ధర ఈ వారం అంతా సామాన్యంగా ఉన్నా, 22 నుంచి పెరగగల అవకాశా లున్నవి. వెండి ధర తేజీలో నిలుస్తుంది. నూలు ధర కొద్దిగా తగ్గుతుంది. చింతపండు ధర పెరిగి వారాంతంలో మందీ వస్తుంది. నూవుల ధర మందిలో నిలకడగా ఉంటుంది. వేరుశనగపప్పు ధర వారం రెండవ భాగంలో తేజీ వచ్చి, అకస్మాత్తుగా తగ్గవచ్చు. పాదరసం కర్పూరం ధరలు పెరుగుతవి.



చిత్రకారుడు : ఎస్. జయదేవబాబు (మద్రాసు)


తరువాతి ఆ అమ్మాయి కూడా ఇలాగే ఉంటుందే లాగుంది వినా నేను ఎలాగా ప్రొద్దున్న చూసిన అమ్మాయిని ప్రేమించాను. ఇప్పుడు వేరే అమ్మాయిని చూడ దలుచుకోలేదు
ఇదిగో నోయ్ ఇదే మా చిన్నమ్మాయి లక్ష్మి. ఇతనేనమ్మా నువ్వు చూసి వలచిన అబ్బాయి.
నేను ప్రొద్దున్న నన్ను రక్షించిన అబ్బాయిని ప్రేమించాను నేను ఇంక ఏ ఒక్కర్నీ చూడ దలుచుకోలేదు
అరె ఇలా బుర్ర త్రిప్పుకుంటుందే యిదా?!!!
అదేమిట్రా అలా బుర్రలు వంచుకుని కూర్చుంటారు. మరీ అంత సిగ్గయితే ఎలా మొహాలు చూసుకోండి.
అబ్బబ్బ జలగలా పీకేస్తున్నాడు చూడమని సరే మెల్లకన్ను పెట్టి చూస్తా వదులుండి
నాన్నగారు నాకిష్టం లేదే ఆ అబ్బాయిని చూడమని అలా అంటూరేమిటి. పోనీ మెల్లకన్ను పెట్టి చూస్తా, దెబ్బతో పారిపోతాడు
వీళ్ళకేమైనా గాని దెయ్యాలు పట్టలేదు కదా?



కలికాలం

చంద్రుడు గదిలో బబ్బున్నాడు.
గణపతిని ఎలుక కరిచింది
శాంతమ్మ ధుమధుమ లాడుతుంది
ఆంజనేయులు అరుగుమీద కూర్చుని
లంకా దహనం చేస్తున్నాడు
కోటేశ్వరానికి అప్పు పుట్టదు
సత్యవతి అబద్ధాల పుట్ట
ఆనందం అఘోరిస్తున్నాడు
అన్నపూర్ణ అడుక్కు తింటోంది
భీమయ్యకు అజీర్తివ్యాధి
శ్రీనివాసులు చేతిలో దమ్మిడీ లేదు
హనుమయ్య బల్లకట్టుకోసం
కాలవ దగ్గర కాచుకున్నాడు
రాజ్యలక్ష్మి వంటలక్క పనికి కుదిరింది
నరసింహం కోర్టులో బంట్రోతు
ఆరోగ్యస్వామిని ఆస్పత్రికి చేర్చారు
లక్ష్మి బట్టలుతుక్కుంటోంది
గురునాధానికి వోనమాలు రావు
సరస్వతిని బళ్లో వేశారు
దామోదరాన్ని దొంగలు దోచారు
కుటుంబయ్యకు పిల్లలు లేరు
బాలాంబ ముసిలి దయింది
రామయ్య ఆస్తికోసం తండ్రిమీద
దావా వేశాడు
విశ్వనాథానికి యిల్లు దొరకలేదు
రాజును అరెస్టు చేశారు!
స్వామిగారు వారి నౌకరు
మృత్యుంజయుడు చచ్చిపోయాడు
జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి (మద్రాసు)

* * *

ఓట్ల కైత

బాపట్ల ఓట్ల కైతకు
నా పాట్లకు, దోచినంత నభి
నందింతుగా.
నేపాట్లు, పోట్లు, లేకను
నా పాట్లకు సీట్లురాను, సన్న్యా
సులమే?

వి. వేంకటనారాయణ, (సికింద్రాబాదు)

* * *

రాజకీయ వాతావరణం

ఎం. ఎల్. ఏ. క్వార్టర్సులోని రాజకీయ అబ్జర్వేటరీనుండి మాకందిన సమాచారాన్నిబట్టి, రాష్ట్రం నలుమూలల్లో ఎన్నికల దుమారం సన్న సన్నగా సాగుతోందనిన్నీ, గతనెలలో గాంధి భవనంలోవద్ద వాయుగుండం ఉత్తర దిశగా ప్రయాణం చేస్తోందనిన్నీ, అది ఢిల్లీచేరి, తిరిగి దక్షిణ దిశగా ప్రయాణంచేసి ఆంధ్రదేశమంతటా రాజకీయ కశ్మలాన్ని భారీగా వర్షించవచ్చుననీ తెలుస్తోంది.

రాష్ట్రం నలుమూలలావున్న రాజకీయ అబ్జర్వేటరీలనుండి మా కందిన వివరాలనుబట్టిచూస్తే, కోస్తా ఆంధ్ర జిల్లాలలో భారీగానూ, రాయలసీమ, తెలంగాణాలలో ఒక మాదిరి మొదలు భారీగానూ కాంగ్రెసుకు జయాపజయాలు తప్పవనిన్నీ తెలుస్తున్నది.

వ్యవసాయదారులకు సూచన:

పునాసపంట పనులన్నీ త్వర త్వరగా ముగించుకొని రాబోయే ఎన్నికల ప్రచారానికి సిద్ధపడండి.

కె. ప్రసాదు (హైదరాబాద్)


* * *

కందికొక్కు

గాదిలోన కందిపప్పు
గాదికింద పందికొక్కు
పదిమారులు పలికిచూడు
ఏది నీకు వినపడునో!
పంది పప్పు తినగమిగులు
కందికొక్కు పరుగు లిడును!

ఎం. ఆర్. ఆమంచి, పి. ఆర్. మంగా
(రాజమండ్రి)

* * *





రంగధామ్

ఆరువేలు ఇవ్వవలసిందేనని నిర్మొహమాటంగా తేల్చేసిన నరసింహంగారు మళ్ళీ సీతారామయ్యగారికి ఆ ఉత్తరం ఎందుకు రాసినట్టు?

"వర వీణా మృదుపాణీ
వనరుహలోచను రాణీ"

అని గొంతెత్తి మోహన రాగంలో పాడుతున్న అందాల రాణిని చూస్తూ ఈ ప్రపంచాన్నే మర్చిపోయాడు భాస్కర్.

తనవైపు చూసీ చూడకుండా చూస్తున్న విశాలమైన కళ్ళూ, పాడుతూంటే కదుల్తున్న చిన్నని పెదవులూ, విశాలమైన నుదురూ, నును పైన బుగ్గలూ, మనసులో మాధుర్యాన్నొలికించే చిరునవ్వుల ఛాయలూ, సిల్కుపరికిణీ కట్టుకొని, జరీవోణీ వేసుకుని, జడనిండా పువ్వులు పెట్టుకుని, హార్మొనీ వాయిస్తూ, కొద్ది నెలలబట్టీ పెళ్ళి సంగీతం నేర్చుకున్న రాగిణి స్వరూపాన్ని, ఆమె పాటలోని 'వనరుహ లోచను రాణి'ని తలపింపజేశాయి భాస్కర్‌కి.

రాగిణి సంగీత విద్వాంసురాలు కాదు. అయినా పెళ్ళిచూపుల్లో, 'అమ్మాయిచేత పాట పాడించండి' అని అడుగుతూంటారు కాబట్టి స్కూల్ ఫైనల్ పాసయిన రాగిణికి నాలుగు నెలలబట్టీ హార్మొనీ చెప్పిస్తున్నారు సీతారామయ్యగారు.

ఆయన అనుకున్నట్టే పిల్లని చూడాలనివచ్చిన పెళ్ళివారితో భాస్కర్ మేనత్త, రాగిణిచేత చిన్న పాటైనా పాడించమని పట్టుబట్టింది. అంత వరకూ సిగ్గుతో ఒక వంక బాధపడుతూ, మరో వంక పెళ్ళికొడుకు ఎలాగుంటాడో ఏకైనంత పరీక్షగా చూడాలనే ఆరాటంతో వేగిపోతూ, వేరొక ప్రక్క పెళ్ళివారడిగే ప్రశ్నలతో సహనం నశిస్తూ, ఎప్పుడొదుదుల్తుందా ఈబాధ!" అనిపిస్తూ, పాట ప్రారంభించింది రాగిణి. ఎదురుగుండా కుర్చీలో కూచొని ఠీవిగా మాట్లాడుతూ, ముచ్చటైన చిరునవ్వుతో తన తండ్రి అడిగే ప్రశ్నలకు జవాబు చెప్తూ, తనవైపు అప్పుడప్పుడు దొంగ చూపులు చూస్తున్న భాస్కర్ ఆమె మనసంతా ఆక్రమించుకున్నాడు. 'ఈ సంబంధం నిశ్చయమైతే ఎంత బాగుండును! అబ్బ! ఏమవుతుందో!' అని రాగిణి మనస్సు వుయ్యాలలా వూగుతూన్నా, పాట ఎలాగో పాడేసింది.

రాగిణికన్నా ఎక్కువగా బాధపడుతున్నాడు భాస్కర్. "ఎలాగైనా ఈ అమ్మాయినే చేసుకోవాలి. ఎంత అందంగావుంది!" అని అతను తనలో తను మథనపడుతున్నాడు. పరిస్థితి మనోభావాల్ని

చూచాయగా గ్రహించిన సీతారా
ఆయన భార్య 'ఈ పిల్లల కోర్కెలు నె
రెప్పుడొస్తారోనా కదా! ఈయూ ఫ్రొడు
బావుంది. అయితే ఏంలాభం? పెద్ద
కోవాలి: కట్న కానుకలు నచ్చాలి' అని
పడుతున్నారు.

ఎటొచ్చీ నిబ్బరంగా కుట్టుకాల
కూచున్నది భాస్కర్ తండ్రి నరసిం
ఆయన దృష్టిలో ఈ పెళ్ళి చూపుల తత
కుర్ర తంతుగ. అసలు విషయం—అం
విషయం—ముందర తేల్చేస్తే, తక్కిన
పాటంతట అవే తేలిపోతాయి. పిల్ల బా
అయితేనేం పిల్లతండ్రి ఏమంత ఆస్తి
వాడిలా లేడు. తనడగబోయే ఆరువేలూ ఇ
అన్నది ప్రశ్న.

పెళ్ళికూతురు లోపలికి వెళ్ళిపోతూ
సారిగా భాస్కర్‌వేపు ఒక చూపు—వైర
చూసి వెళ్ళిపోయింది. భాస్కర్‌కి ఆ
ప్రేమ సందేశంలా తోచింది. ఆ సందేశం
సుతో ఒక తియ్యని బాధ కలిగించింది.
వెళ్ళిపోగానే భాస్కర్‌కి వెలిగే 'సూర్య
బల్బు' ఆరిపోయిన గదిలాగ కనిపించి
గదంతాను.

తనూ, తనవాళ్ళూ మెల్లిగా బయల్దేరా
మన్నూ



"సాయంకాలం బండికే వెళ్ళిపోతారా బావగారూ" అంటూ సీతారామయ్యగారు కూడా వారితో, వారిని వీడ్కొలపడానికి బయల్దేరారు.

"లక్ష్మీపురం నుండీ మేమంతా వెళ్ళిపోతాం అబ్బాయి మాత్రం ఈఊళ్లో స్నేహితుడొకడున్నాడట. అతనితో గడిపి, రేపు పొద్దున్న వస్తాడు" అని నరసింహంగారు తమ కార్యక్రమాన్ని తెలియజేశారు.

స్టేషనుదాకా ఏవో కబుర్లాడుతూ వెళ్లారు. ట్రైను రావడానికి ఇంకొక గంట ఆలస్యంవుంది. ఆడవాళ్ళు వెయిటింగ్ రూములో కూర్చున్నారు. సీతారామయ్యగారూ, నరసింహంగారూ, భాస్కర్ ప్లాటుఫారంమీద తచ్చాడుతూ మాట్లాడుతున్నారు. ఇంతలో భాస్కర్ స్నేహితుడు శివరాం వచ్చి, అతన్ని తీసుకెళ్ళిపోయాడు

"బావగారి అభిప్రాయం తెలియగానే ముహూర్తం పెట్టించేస్తాను. ఎందుకంటే ఈపిల్లే పెద్దపిల్ల కావటంవల్ల ఇంట్లో ఆడవాళ్లు చాలా తొందర పడుతున్నారు" అని మెల్లిగా సీతారామయ్యగారు అసలు విషయాన్ని కదిపారు.

"నా అభిప్రాయానికేముంది. కట్నం మీరెంత ఇవ్వగలరో చెప్తే వెంటనే మనం విషయం తేల్చెయ్యొచ్చు" అన్నారు నరసింహంగారు.

"ఏదో మధ్యతరగతి కుటుంబీకులం. కట్నాలు పెద్దగా ఇచ్చుకునే తాహతులేదు. ఎలాగో అవస్థపడి మూడువేలు ఇచ్చుగుంటాను."

"ఎందుకులెండి ఆవస్థ. మరో సంబంధం చూసుకోండి" అన్నాడు కటువుగా నరసింహంగారు.

సీతారామయ్యగారు తెల్లబోయారు. ఇంత నిర్మొహమాటంగా నరసింహంగారు మాట్లాడుతారని ఆయన వూహించలేదు. అప్పటికీ తడబడుతూ, "మీ అభిప్రాయమెంతో. . . ." అని ఆయన అనబోతుంటే,

"ఏమిటయ్యా, అభిప్రాయం? ముష్టి మూడువేల కట్నం ఇస్తానంటావా, ఎం. ఏ. పాసయి రెండువందల ఏభై తెచ్చుకుంటున్న మా అబ్బాయికి? పైగా పదెకరాల పొలమూ, ఇల్లూ వాడికి నా తదనంతరం చెందుతుంది. ఎనిమిది వేలిస్తాం, పదివేలిస్తాం అని అనేకమంది మా చుట్టూ తిరుగుతూంటే, మీ అమ్మాయి చదువుకున్నపిల్లకదా అని పెళ్ళిచూపులకు వచ్చాం. వచ్చినందుకు బాగానే జరిగింది" అన్నారు నరసింహంగారు.

సీతారామయ్యగారికి నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది. తను మూడువేలకన్నా ఎక్కువ ఇవ్వలేడు. అసలా సొమ్మే అప్పుచేశాడు. అటువంటిది అంతకన్నా ఎక్కువ ఎక్కడనుంచి తేగలడు? తను చాలా ఆశగా వున్నాడు— రాగిణి అందమైనదీ, చదువుకొన్నదీ కాబట్టి మంచి సంబంధం వస్తుందని కాని తమ దృష్టిలో మంచి సంబంధమైనవన్నీ తమ అందుబాటులో లేకుండా పోతున్నాయి. అప్పుడే రెండు మూడు సంబంధాలు చూశాడు. అన్నిటిలోకీ అందమైనదీ ఎరిగోయిన సంబంధం భాస్కర్‌దే అది చివరి కిలాగయింది.

ఎంత బేరమాడినా ఆరువేలకి దిగరని నరసింహంగారి మాటలవల్ల తెలుసుకొని ఇకచేసేదేమిలేక దిగాలుగా ఆయన దగ్గర సెలవు తీసుకొని సీతారామయ్యగారు ఇంటివైపు దారి తీశారు.

ఆయన వెళ్ళిపోతూంటే భాస్కర్, అతని స్నేహితుడు శివరాం, ఇద్దరూ ఎదురయ్యారు. చిరునవ్వుతో కూడిన భాస్కర్ మొహం చూస్తుంటే తన కూతురు రాగిణి జ్ఞాపకమొచ్చి మనస్సులో దిగులువేసింది అతనికి పిల్ల నచ్చినట్లు అతని చూపుల్లోనూ, మాటల్లోనూ తెలుస్తోంది. అతనే తెగించి తండ్రితో 'ఈపిల్లనే చేసుకొంటాను. కట్నం విషయం మీరేమీ పట్టించుకోవద్దు' అని

భార్య:-ఏమండీ! మీరెప్పుడూ పత్రిక చదువుతూ కూర్చుంటే ఏం లాభం?

భర్త:-ఎందుకని పిచ్చిదానవు. పత్రికలో ప్రపంచ వార్తలుంటాయి.

భార్య:-నిజంగానా? అయితే మా అమ్మ ఏలాగుందో చూడండి.

దాస్యం నరసింహస్వామి (నిర్మల్)

చెప్తే—అంతకన్నా కావలసిందేముంది? కాని నరసింహంగారు అటువంటి స్వతంత్రతకు తావిచ్చేట్టు లేరు భాస్కర్ కూడా పితృభక్తిపరాయణుడిలాగే కన్పిస్తున్నాడు. సీతారామయ్యగారొక దీర్ఘమైన నిట్టూర్పు విడచారు.

ఇంటికి తిరిగివచ్చిన తండ్రి మొహం చూస్తూనే రాగిణి, వ్యవహారం సవ్యంగా పరిష్కారం కాలేదని ఊహించింది.

"లక్ష్మీకాంతం మామయ్య వచ్చాడు నాన్నగారూ" అంది రాగిణి.

ఇంతట్లో లోపల్నించి ఒక ముప్ఫైయ్యేళ్ళ యువకుడు పాంటూ, షర్టూ, కళ్ళజోడూ, జోడూ మంచి టిప్‌టాప్‌గా వున్నతను వచ్చి, "హల్లో! బావా! ఏమిటి విశేషాలు? ఏమైంది పెళ్లి సంగతి. పెళ్లి సందడి వుందా, లేదా? రాగిణి పెళ్ళికి 'బ్యూటిఫుల్ డ్రామా' ఒకటి వేద్దామని చూస్తున్నాను. ట్రూపు సిద్ధంగావుంది ఆడియన్సు సిద్ధంగా వున్నారు. మరి నువ్వే ఆ శుభముహూర్తం పెట్టి జరిపేస్తున్నావు. ఇప్పుడైనా తేలిందా లేదా. చెప్పు!" అని గబగబా అడిగేసి సీతారామయ్యగారిపక్కన కూర్చున్నాడు.

"ఏం చెప్పమంటావ్ బావా! ఆరువేలకి ఏమాత్రం తక్కువ పుచ్చుకునేట్టులేరు. అంతడబ్బు ఎక్కడి నుంచి తేవడం చెప్పు" అన్నారు సీతారామయ్యగారు నిరుత్సాహంగా.

"వ్వాట్! ఆరువేలా! వెంటనే పోలీసు రిపోర్టు చెయ్యలేకపోయావా? గవర్నమెంటువారు వరకట్న నిషేధచట్టం పాసు చేశారని తెలియదా?"

"బాగుంది బావా! అలా అయితే మన పిల్లకి పెళ్ళిఅయినట్లే. పరువుగా ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసుకునే వాళ్ళెవరయినా ప్రభుత్వానికి రిపోర్టు చెయ్యగలరా? మన పిల్లల భవిష్యత్తు చూసుకుంటావా పంతాలకు పోతామా?"

"అదీ ఒక పాయింటే! అయితే యింతకూ పెళ్ళికొడుకేమంటాడు? అసలు పిల్ల నచ్చిందా?"

"పిల్ల నచ్చినట్లే వుందయ్యా! కాని ఎం. ఏ. పాసయినా, తండ్రిమాట జవదాటే వ్యక్తిలా లేడు. చదువుకున్నవాడుకదా, ఆ మాత్రం తెగించి తండ్రితో చెప్పకూడదూ? కట్నం పుచ్చుకోవద్దని."

"నీకు అసలు విషయం తెలియదు. చదువుకున్నాడు కాబట్టే అంత చాతకానితనం అబ్బింది. ఇప్పటి చదువులు నేర్పేదేమిటి? ఎంతసేపూ ఆన్సర్లు బట్టీ పట్టి పాసవడమేకాని, వ్యక్తిత్వాన్ని, స్వతంత్రభావాల్ని పెంపొందించటానికి ఏమీ తోడ్పడ్డం లేదు. డిగ్రీలు పుచ్చుకోడానికి డ్రెస్సులు సీటుగా వేసుకువస్తారుగాని, తమ జీవిత సమభాగినిని నిర్ణయించుకొని తలితండ్రులకు సరియైన జవాబు చెప్పగల దమ్ములేవి?—ఈ యువకులకు. చదువు లేకపోతేనే కొంత మేలు."

సీతారామయ్యగారు నవ్వారు. "మీలాంటి వాడెవడైనా కాస్త ఆ కుర్రాడికి ఈ విషయంలో స్వతంత్రంగా ప్రవర్తించమని చెప్తే బాగుణ్ణు."

"చెప్తాను బావా, చెప్తాను! చెవులు గింగురెత్తేట్లు చెబుతాను! గూబ గుయ్యిమనేట్లు చెప్తాను! చెంప ఛెళ్ళుమనేట్లు చెబుతాను! హృదయం హోరెత్తేట్టు చెబుతాను! మన సంగతి నీకు తెలుసుగా! ఎం. ఎల్. కాంత్, ది గ్రేట్ మోనోయాక్టరు ప్రియాతిప్రియమైన మేనకోడలు రాగిణి కిష్టమైన వాడెవడైనా వున్నాడంటే, వాడి నాన్న ఆరువేలు కట్నం కోరనీ, వాడి అమ్మ మూడువేలు లాంఛనాలు కోరనీ, అవన్నీ కాదని తోసేసి వచ్చి, వాడు పిల్ల మెడలో పుస్తె కట్టాలిసిందే. చూస్తావుగా! అన్నట్టు రాగిణికి అబ్బాయి నచ్చాడా? ఏమే?" అని లక్ష్మీకాంత్ మేనకోడలువైపు తిరిగి అడిగాడు.

"ఫో, మామా!" అని రాగిణి లోపలికి పరిగెత్తింది. సీతారామయ్యగారూ, లక్ష్మీకాంత్ నవ్వుకున్నారు.

"రైట్. బావా! ఇప్పుడు చెప్పు. ఆ అబ్బాయి ప్రస్తుతం ఎక్కడున్నాడో, ఎలా కలుసుకోవాలో, చెప్పు?" అని అడిగాడు లక్ష్మీకాంత్

"ఆ అబ్బాయి ప్రస్తుతం మన ఊళ్ళోనే మన ప్లీడరు రాజారాంగారి అబ్బాయి శివరాంతో ఇవాళ వుంటాడు రేపు పొద్దున్న బండికి వాళ్ళ ఊరెళ్ళి పోతాడు."

లక్ష్మీకాంత్ కొంచెం ఆలోచించి, "సరే. రాజారాంగారి ఇంటివైపువెళ్తే అతను ఎలా వుంటాడో తెలుస్తుంది" అన్నాడు.

"ఇప్పుడే వెళ్ళి మాట్లాడతావా ఏమిటి?"

"అబ్బే! అలా లాభం లేదు మనం డైరెక్టుగా మాట్లాడితే 'నా స్వంత విషయాల్లో మీ జోక్యం అనవసరం'మంటాడు. నేను ఎలాగో వీలు చూసుకొని మాట్లాడుతాను" అన్నాడు లక్ష్మీకాంత్.

మర్నాడు ప్రొద్దున్న తన స్నేహితుడు శివరాం దగ్గిర సెలవు తీస్కొని బండి ఎక్కిన భాస్కర్ మనస్సులో ఒక వైపు నిరుత్సాహం, మరొకవైపు రాగిణి స్వరూపం ఆక్రమించుకొన్నాయి. రాగిణిని చూసినప్పుడే అతని మనస్సులో రాగోదయం అయింది. హృదయానికి ఎవరో చక్కిలిగింత పెట్టి, "ఆమే వోయ్ నీ రాణి" అని చెప్పినట్లయింది కాని తన తండ్రి కట్నదాహం వాళ్ళు తీర్చలేరు. వాళ్ళు మూడు వేలిస్తామన్నారనీ, తనతండ్రి ఆరువేలు అడిగారనీ తండ్రి ద్వారా తెలుసుకున్నాడు తాను. వెధవ కట్నం. ఎక్కువైతేనేం తక్కువైతేనేం మనస్సుకు నచ్చిన పిల్ల దొరికినప్పుడు ఇటువంటి విషయాలు పట్టించుకోకూడదు. కాని ఆ విషయం తను తండ్రికి గట్టిగా చెప్పలేడు ఎందుకంటే, తానేమైనాఅంటే, ఇన్నాళ్ళూ పెంచి పెద్దవాణ్ణి చేశాం ఇప్పుడు మా మాట కెదురుతిరిగి మమ్మల్నవమానిస్తావా?" అని అంటారు తను వాళ్ళమాట వినలేదనే నెపం చూపిస్తారేగాని, తన భవిష్యత్తూ, తన సుఖం గురించి తను కలగజేసుకోవలసిన అవసరం వుందంటే వినరు పెద్దవాళ్ళతో ఏమన్నా చిక్కే!

భాస్కర్ ఆలోచిస్తూ, ఎదురుగుండావున్న సీటులో కూర్చున్న పెద్ద మనిషివైపు చూశాడు. కాషాయవస్త్రాలూ, కళ్ళజోడూ, మాసినగడ్డం, కొద్దిగా నెరసిన తలతో ఆ వ్యక్తి రైలు కిటికీలోంచి చూస్తూ, దిగాలుగా వున్నాడు. భాస్కర్ అతనివైపు చూడగానే, అతను తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, "ఏ వూరు వెళ్తున్నారు?" అని అడిగాడు ఇంగ్లీషులో.

"బెజవాడ వెళ్తున్నాను మీ రెక్కడికి వెళ్తున్నారు?" అని భాస్కర్ అడిగాడు.

"ఎక్కడికి వెళ్తున్నానో నాకే తెలియదు!" అన్నాడా వ్యక్తి విరక్తిగా, దిగాలుగా, భాస్కర్‌కి జాలి వేసేట్టు

"అదేమిటండీ. ఏదైనా విచారంతో వున్నారా? ఆపదలో వున్నారా?" అని అడిగాడు భాస్కర్ ఆ వింత వ్యక్తిని చూసి.

"అటువంటిదేమీ లేదండీ. మనశ్శాంతిలేక కొన్నాళ్ళు అలా తిరిగివద్దామని వుంది. ఎక్కడైనా అది లభిస్తే తిరిగి రావాలని కూడా లేదు" అన్నాడాయన.

భాస్కర్‌కి ఆ వింత వ్యక్తి గురించి తెలుసుకోవాలనిపించింది వయస్సేమంత ఎక్కువున్నట్లు లేదు అతనికి అయినా అతని మొహంలో ఏదో చిరాకు కన్పిస్తోంది బహుశా ముప్పైఅయిదేళ్ళుండచ్చు. తనే అతని విషయం కదుపుదామని ప్రారంభించాడు. "ఈ కాషాయబట్టలు చూసి మీరు ఏదైనా మతానికి చెందినవారేమో నను కున్నా."

"ఇంచుమించు నా పరిస్థితి అలాగేవుంది ఈ బట్టలు వేసుకోవడం సాధుత్వాన్ని స్వీకరించడం కోసమే సంసారాన్ని పూర్తిగా త్యజించి సన్యాసి నవ్వాలనేవుంది. కాని నా భార్య అందుకు వప్పుకోదు అందుకని మన్పసన్యాసమేగాని, అసలు సన్యాసిని కాలేకపోతున్నాను."

ఉరిశిక్ష పడిన గజ దొంగతో

అధికారి:-ఒరే! ప్రాణాలు తప్ప ఏమైనా కోరుకో నెరవేరుస్తాం.

గజదొంగ:-సార్! 12 సినిమాలు సంవత్సరాని కొకటి చూడాలని ఉందండి.

ఆనం శేషారెడ్డి, (కోవూరు)

"మీ భార్యవుండగా మీకు సన్యాసమెందుకు?"

"ఏం చెప్పమంటారు? సంసారం సాగరం దుఃఖమ్" అన్నారు. నేను అనునిత్యం, ప్రతిక్షణమూ అది పరమసత్యం అని అనుకొంటూ వుంటాను. భార్యా భర్తల అనుకూలతలేని సంసారం కన్నా నరకం మేలు"

"అంటే, పాపం, మీ భార్య . . ."

"ఆమే నా ఈ వైరాగ్యస్థితికి కారణం. నాదొక విషాదగాథ. అసలు నా భార్యను పెళ్లిచేసుకొనేముందే జీవితమంటే సగం విరక్తి పుట్టింది. పెళ్ళయిన దగ్గర్నుంచీ ఆ సగంకూడా పూర్తయింది. నాకు డబ్బుకు లోటులేదు. ఇళ్ళూ, వాకిళ్ళూ, నౌకర్లూ, కారూ అన్నీ వున్నాయి. కాని డబ్బువల్ల మనిషికేమాత్రం సుఖం లేదు."

"ఎందువేతనంటారూ?"

"మనిషికి అనుకున్నది లభించకపోయిన తరువాత, లభించిన దానివల్ల సౌఖ్యంలేకపోయినప్పుడూ, డబ్బేంచేస్తుంది చెప్పండి?"

భాస్కర్‌కి ఆ వ్యక్తి భగ్నప్రేమికుడై వుండవచ్చునని తోచింది. తన పరిస్థితి కూడా భగ్నప్రేమ అయ్యేటట్లుంది. రాగిణియందు తనకు కలిగిన మోహం, ప్రేమా మరెవరియందూ కలగదు. తనకు రాగిణి దక్కుతుందనే నమ్మకంలేదు అయినా ఎదుటి వ్యక్తికథేమిటో తెలుసుకోవాలని "అసలు మీ కటువంటిపరిస్థితి ఎలా వచ్చింది?" అని అడిగాడు


ఆ వ్యక్తి భాస్కర్‌వేపు చూసి, ఒక నిముషం ఆలోచించాడు. మనస్సులోవున్న విషయం చెప్దామా వద్దా అని తటపటాయిస్తున్నట్లూ, చివరికి చెప్పడానికి నిశ్చయించినట్లూ కనిపించాడు.

"నేనూ, రాధా చిన్నప్పటినుంచి కలిసి మెలిసి పెరగలేదు ఒకరికోసం ఒకరం చాలాకాలం బాధ పడలేదు అసలు పెళ్ళిచూపులకై వెళ్ళేవరకూ రాధ అనే అమ్మాయి ఈ ప్రపంచంలో వుందనే తెలియదు. చంద్రుడూ, వెన్నెలా, అందమైన పువ్వులూ, చక్కని సాహిత్యం, ఇవి వున్నట్లే, అందమైన స్త్రీలూ వుండొచ్చు సృష్టిలో అనుకొనే వాణ్ణి. కాని అందమైన వాటన్నిటికి మల్లేనే అవి అందరికీ అందుబాటులో వుండననుకునేవాణ్ణి. రాధని చూడగానే నా జీవితాకాశంలో చంద్రుడుదయించాడనీ, అమృతహస్తాలతో వెన్నెలలు కురిపిస్తాడనీ అనుకున్నాను కొద్ది క్షణాలలో నా మనస్సును పూర్తిగా ఆక్రమించింది రాధ. ఆమెది ఉత్త సౌందర్యంకాదు ఆ అందానికి వెనకాల ఒక మంచితనం, గాంభీర్యం, చూపులో నెమ్మదీ ఇలాంటి వెన్నో వున్నాయి."

"కొద్ది క్షణాల అవలోకనతో ఇన్ని విషయాలు ఎలా కనిపెట్టగలరంటారేమో? అసలు జీవితం అంటే ఏమిటి? అందులో మనకి నిజాన్ని తెల్పి జీవింపచేసేవి కొద్దిక్షణాలు కావూ? తక్కిందంతా ఆరాటమే! ఆ కొద్ది అమరక్షణాలకోసం ఆశతో, ఆరాటంతో, ఆవేదనతో జీవిస్తుంటామే! మనిషి భవిష్యత్తు నిర్ణయించేవి కొద్దిక్షణాలే!"

"రాధను పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించాను. ఆ తరువాత నాకు తెలిసింది ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించిందట. నేను నా తలితండ్రులతో చెప్పేశాను—ఆ అమ్మాయినితప్ప మరెవరినీ చేసుకోనని. నా అంగీకారం తెలియబర్చి, నేను మద్రాసు నా బి యల్. చదువుకు వెళ్ళిపోయాను. వెళ్ళినా రాధే నా మనస్సులో మెదుల్తుండేది ఇక కొద్ది రోజులలో ఆమె నా అర్ధాంగి కాబోతోందికదా, ఆమెతో స్వర్గ సౌఖ్యాలనుభవించాలని కలలుకంటూ వుండేవాణ్ణి. ఇంతలో నెలరోజుల తరువాత మా నాన్నగారు, తను అడిగిన కట్నం రాధ తండ్రి ఇవ్వలేడని అందుకని వేరొక సంబంధం నిశ్చయం చేస్తున్నామనీ, నన్ను పిల్లని చూసుకోడానికి రమ్మనీ వ్రాశారు. నా ఆశలన్నీ నిరాశలయ్యాయి."

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రకటనలు
మీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతాయి



కట్నబాధితులు

"నేను చాలా విచారించాను. నా దురదృష్టానికి నన్ను నేనే నిందించుకున్నాను మా నాన్నగారినీ, అమ్మనూ బ్రతిమాలుకున్నైనా ఒప్పిద్దామని మా వూరు వెళ్ళాను. మెల్లిగా వాళ్ళకి చెప్పిచూశాను. మా నాన్నగారు కట్నం విషయంలో గట్టి పట్టు పట్టారు. చివరకి నాకు కోపంవచ్చి, నేను పెళ్ళే చేసుకోనన్నాను. ఎన్నో విధాల నాకు నచ్చచెప్పి, ఇంకో సంబంధం చేసుకోడానికి ఒప్పించారు. ఆనాడు పెద్దలమాట వినడం నా ధర్మం అనుకొన్నాను. ఈనాడు దానికి విచారిస్తున్నాను"

"నేను ఇంకో సంబంధానికి ఇష్టపడిన కొద్ది రోజులలో నాకొక ఘోర వార్త తెలిసింది. రాధ ఆత్మహత్య చేసుకుంది" అని ఆగాడావ్యక్తి.

భాస్కర్ ఉలిక్కిపడ్డాడు. ఆ వ్యక్తి అంతవరకూ చెప్పిన కథతోనే కొంత అతని మనస్సులో కలవరం ప్రారంభమైంది. చివరి మాటతో అతని మనస్సు పూర్తిగా పాడైంది ఎదుటి వ్యక్తి కన్నీరు కారుస్తున్నాడు

"రాధ నాకోసం బలవన్మరణం పొందింది. ఆమె ఎంత బాధపడిందో! తలితండ్రుల నెదురించి, కట్నాల విషయంలో వాళ్ళకి తగిన బుద్ధి చెప్పనందుకు విధి విధించిన మొదటి శిక్ష, నాకు, రాధ ఆత్మహత్యాపాపం! తరువాత పదివేలు కట్నమిచ్చి నన్ను తన భర్తను చేసుకున్న నా భార్య—నా జీవితాంతం నాకు తీరని శిక్ష!"

"అయ్యో! పాపం!" అన్నాడు భాస్కర్.

"అనుక్షణం ఆమె తన తండ్రి కట్నమిచ్చి నన్ను కొనుకున్నాడని జ్ఞాపకం చేస్తూంటుంది. భార్యగా తన హక్కులకు ఏమాత్రం భంగం వాటిల్లడానికి ఆమె ఒప్పుకోదు."

భాస్కర్ మనస్సులో, "బాబోయ్!" అనుకున్నాడు.

"అనురాగం, ఆప్యాయతా, అభిమానం అనేవి మా దాంపత్యంలో శూన్యం. మేము తనకు సరియైన బంగారం పెట్టలేదనీ, పెట్టుపోతలలో తమ పుట్టింటికి మేము సాటి రామనీ దెప్పి పొడుస్తుంది"

భాస్కర్‌కి ఇక వినే ఓపిక లేకపోయింది. ఏదో స్టేషన్‌లో బండి ఆగుతే, వెళ్ళి కాఫీ త్రాగొచ్చాడు అతను తిరిగి వచ్చేటప్పటికి ఆ వ్యక్తి సామాను సర్దుకుంటున్నాడు. భాస్కర్ అడగ్గా, వచ్చే స్టేషనులో తను దిగపోతున్నట్లు చెప్పాడు. రైలు బాగా వేగం అందుకుంది భాస్కర్ ఆ వ్యక్తి గురించీ, అతని జీవితం గురించీ ఆలోచిస్తున్నాడు

"అయితే ఇదంతా విధేనంటారా?" అని అడిగాడు భాస్కర్.

"విధి ఎంతమాత్రంకాదు. మనం పెద్దవాళ్ళని ఎలా గౌరవించాలో తెలుసుకోకపోవడమే కారణం. వాళ్ళు మన సుఖం గురించి ఎక్కువ ఆలోచించరు. ఎంతసేపూ తమ గౌరవం గురించి ఆలోచిస్తారు విజానికి ఈ ఒక్క విషయంలోనూ—అంటే మన వివాహ విషయంలో—వారి మాట తోసేసినంతమాత్రాన వారి నగౌరవించినట్లు కానేకాదు. అయినా ఆ స్వల్పవిషయంలో మనం మొహమాట పడిపోయి, జీవితాంతం కష్టాన్ని కొనితెచ్చుకుంటాం" అని ఆ వ్యక్తి వూరుకున్నాడు

భాస్కర్ బుర్రలో అనేక ఆలోచనలు దొర్లిపోతున్నాయి. రాగిణి సంబంధం కూడా ఇలాగే తప్పిపోయేటట్లుంది. తను తండ్రి దగ్గర అనవసర మొహమాటానికిపోయి, రాగిణినే చేసుకుంటానని గట్టిగా చెప్పలేకపోయాడు. రాగిణి కూడా ఒకవేళ తనమీద ఆశ పెట్టుకొనివుంటే?—ఎదుటి వ్యక్తి కథలో రాధలాగ చేస్తే?—భాస్కర్‌కి మరి తోచలేదు వెంటనే తగిన ప్రతిక్రియ చెయ్యాలి! తండ్రి దగ్గర తను అంత చాతకానితనం చూపిస్తే లాభం లేదు!

తరువాత స్టేషనులో ఆ వ్యక్తి దిగిపోతూంటే భాస్కర్, "మీరు మీ కథ చెప్పి నాకు కళ్ళు తెరచి మహోపకారం చేశారు" అన్నాడు

"మీరలా అనుకొన్నందుకు నాకు సంతోషంగా వుంది" అని ఆ వ్యక్తి భాస్కర్ దగ్గర సెలవు తీసుకొన్నాడు

కొద్దిరోజుల తరువాత నరసింహంగారివద్ద నుంచి సీతారామయ్యగారికి వెంటనే ముహూర్తం నిర్ణయం చెయ్యమనీ, కట్నకానుకల ప్రసక్తే వద్దనీ వచ్చిన ఉత్తరంచూసి ఇంటిల్లిపాదీ ఆశ్చర్యపోయారు. సీతారామయ్యగారు ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా భాస్కర్, రాగిణుల వివాహం జరిపించేశారు.

శోభనంనాడు రాగిణి, భాస్కర్ తనతో ఏం మాట్లాడుతాడా? అని ఆత్రుతగా ఎదురు చూస్తున్న సమయంలో భాస్కర్ "చూడూ! ఆ ఎర్రగా, పొడుగ్గా, పంచె, లాల్చీ వేసుకు హడావిడిగా తిరుగుతున్నారయన ఎవరు?" అని అడిగాడు.

రాగిణి కొంచెం ఆలోచించి, "ఓ! ఆయనా! మా లక్ష్మీకాంత్ మామయ్య! ఏం?" అంది.

"అబ్బే! ఏంలేదు. ఆయన గొంతుకా, వాలకం చూస్తుంటే రైల్లో నేను చూసిన వ్యక్తి జ్ఞాపకం వచ్చాడులే"

రాగిణి నవ్వుతూ, "మీకు తన విషాద జీవితం గురించి చెప్పినాయనా?" అంది.

"ఆ! ఆ! అవును. నీకెలా తెలుసు" అన్నాడు భాస్కర్

"నాకేం తెలియదు. మా మామయ్య పెద్ద మోనో ఏక్టరులెండి. మన పెళ్ళికి ఒక పెద్ద డ్రామా వేద్దామనుకున్నాడు. మీరు బొత్తిగా వ్యవధిలేకుండా."

"అది సరేలే! అసలు విషయం చెప్పు అయితే రైల్లో నాక్కనిపించింది మీ మామయ్యేనా?"

"ఏమో, నాకేం తెలుసూ? ఆయన్నే అడగండి" అంది రాగిణి అమాయకంగా "అమ్మ దొంగ! నీకూ మేనమామ పోలిక వచ్చిందే!" అన్నాడు భాస్కర్

★

కులు స్వర్గంలో ఏంచేస్తున్నారో ఎప్పుడైనా ఆలోచిస్తారా?"

"భూమిమీద నున్న నేను, స్వర్గంలో మా పూర్వీకులు ఎలా ఉన్నారో ఎలాగ తెలుసుకుంటాను?" అన్నాడు అయోమయంగా.

"అదేమిటి ప్రభూ! ఎందుకు తెలుసుకోగూడదు?" అన్నాడా మంగలి.

అదేమిటో సరిగ్గా అర్థమయ్యేలా చెప్పమన్నాడు అక్బరు.

"అయ్యా! స్వర్గానికి మనుష్యులను వార్తాహారునిగా పంపవచ్చు. అతడు లోకజ్ఞానం బాగా తెలుసున్నవాడు, తెలివైనవాడు అయ్యుండాలి. మీరు కోరినట్లైతే అతడు ఆ వార్తలను స్వర్గలోకమునకు తీసుకొని పోగలడు. మరల అతడు మీ పూర్వీకుల వార్తలను మీకు తిరిగి అందజేయగలడు."

"అట్లయితే నాకు స్వర్గమందలి వార్తలను వినవలెనని యున్నది. కాని ఆ వార్తాహారుడు స్వర్గలోకం ఏవిధంగా వెళ్ళగలడు?"

అందుకా మంగలి, "అయ్యా! వార్తాహారుని ఒక విశాలమైన మైదానములోనికి తీసుకొని పోయి అచట అతనిని ఒక ఆసనంపై కూర్చుండబెట్టవలెను. పిమ్మట వార్తాహారుడు కూర్చున్న ఆసనమును పుల్లలతో కప్పి వాటికి అంటించి వేయుదురు. పురోహితులు మంత్రములు చదువవలెను. అప్పుడా వార్తాహారుడు మరణించి స్వర్గానికి వెళ్ళిపోవును. అక్కడ పని చూసుకొని తిరిగి తనంతట తానే భూలోకానికి వచ్చివేయును." అని చెప్పి "ఇందుకు వార్తాహారునిగా బీర్బల్ తగిన వ్యక్తి" అని అక్బరుకు చెప్పాడు.

బీర్బల్ స్వర్గలోకయాత్ర

(26వ పేజీ తరువాయి)

అక్బరు ఇది చాలా సులభమైన పద్ధతి అనుకొని ఈ విషయం, "బీర్బల్"కు చెప్పాడు. బీర్బల్ అది అసాధ్యమైనపని అన్నాడు. కాని అక్బరు అందులకు ఒప్పుకొనక, "ఇదంతా జరిగి తీరవలసిందే. ఆ మంగలి చెప్పిందే నేను నీకు చెప్పాను" అన్నాడు.

"ఎవ్వరైనా స్వర్గానికి వెళ్ళి తిరిగి వస్తారా!? ఇటువంటి విషయం ఎప్పుడైనా విన్నామా ప్రభూ!" అన్నాడు బీర్బల్.

అప్పుడు మంగలి మధ్యలో కలుగజేసుకొని, "తమరు స్వర్గానికి వెళ్ళటానికి భయపడుతున్నారేమో" అన్నాడు పరిహాసంగా.

"నాకు చెప్పే బదులు ఆ వెళ్ళేదేదో నువ్వే స్వర్గానికి వెళ్ళగూడదా?" అన్నాడు బీర్బల్ మంగలితో.

అందుకు అక్బర్ కలుగజేసుకొని, "లేదు. స్వర్గలోకమునకు ఒక మంగలివానిని వార్తాహారునిగా పంపుట చాల తప్పు. కాబట్టి నీవే వార్తాహారునిగా వెళ్ళి రమ్ము." అన్నాడు "బీర్బల్"తో.

బీర్బల్ సంగతంతా ఇట్టే గ్రహించాడు. తనను చంపటానికి ఎవరో కుట్రదారులు పన్నిన పన్నాగము అని గ్రహించాడు. అందులకు బీర్బల్ ఒక ఉపాయం ఆలోచించి, "సరే ప్రభూ! మీరు కోరినట్లే నేను స్వర్గలోకానికి వెళ్తాను. కాని దానికి నేను కొన్ని షరతులు పెడతాను. అందుకు మీరు అంగీకరించాలి. అందు మొదటి షరతు ఏమంటే, మీరు కొంతధనాన్ని నా కుటుంబానికి అందజేయవలెను. రెండవది ఏమంటే, ఇది చాల పెద్ద ప్రయాణము గాబట్టి తగిన ఏర్పాట్లు చేసుకొనుటకు రెండు మాసములు గడువు ఇవ్వాలి." అని కోరాడు. ఈ రెండు షరతులకు "బీర్బల్" అంగీకరించెను.

ఈ రెండు మాసములలోను "బీర్బల్" కొంతమంది పనివాళ్ళను ప్రోగుచేసి తనను ఎక్కడైతే తగులబెట్టబోతారో అచటనుండి తనఇంటి వరకూ రహస్యంగా ఒక సొరంగం త్రవ్వించాడు. దానిని గూర్చి బీర్బల్ కు, అతని కుటుంబమునకు, పనివాండ్రకుతప్ప మరెవ్వరికీ తెలియదు.

"బీర్బల్" స్వర్గలోకమునకు ప్రయాణము చేయవలసిన రోజు రానే వచ్చినది. ఆ వింతను చూడ్డానికని నగరంలోని ప్రజలంతా కట్టకట్టుకొని ఆ మైదానంలోనికి వచ్చారు. అక్బర్ తన ఆస్థాన ఉద్యోగులతో గూడా అచటి కేతెంచాడు. 'బీర్బల్'ను ఒక ఆసనంపై కూర్చోబెట్టారు. అతని చుట్టూ చితి పేర్చారు. బ్రాహ్మణులు మంత్రములు ఉచ్చరిస్తున్నారు. కొంత

ఉపాధ్యాయుడు :- అయితే 'నువ్వే నన్నమాట, బోర్డుమీద "మేష్టారు పిచ్చివాడు" అని వ్రాసింది.

విద్యార్థి:- అవునండి.

ఉపాధ్యాయుడు :- మంచిది. నీవు నిజాన్నయినా తెలిపినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను.

మాదల. నిత్యానందము (వుదిపట్ల)

సేపటికి చితి అంటించబడ్డది. "బీర్బల్"ను కప్పివేసిన వెంటనే అతడు ఎవ్వరికి తెలియకుండా చితి అడుగునున్న సొరంగంగుండా ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ ఇంటివద్ద అతడు చిరిగిన వస్త్రములు ధరించి వేషము మార్చుకొని, బీదవానివలె నటిస్తూ మరల ఆ మైదానంలోనికి వెళ్ళాడు. అచ్చట మామూలు మనిషిలాగే ఆగుంపులో కలసి పోయాడు. తన నీ విధముగా చంప ప్రయత్నించిన ఆరాజోద్యోగి పేరు తెలుసుకొన్నాడు.

ఆ చితి పూర్తిగా తగులబడ్డాక ప్రజలంతా "బీర్బల్" స్వర్గలోకానికి వెళ్ళిపోయాడనుకొన్నారు. "బీర్బల్" అంటే గిట్టని రాజోద్యోగులు కొందరు అతడు చనిపోయినందుకు పీడ వదిలిందని సంతోషించారు. కాని "బీర్బల్" తనింటి వద్దే మూడువారములు ఎవ్వరికి తెలియకుండా రహస్యంగా కాలం గడిపాడు. గడ్డం, జుట్టు బాగా పెంచుకున్నాడు. మూడు వారములూ అయిన తరువాత అతడు క్రొత్త బట్టలు ధరించి రాజస్థానమునకు వెళ్ళాడు.

మొదట అక్బర్ "బీర్బల్"ను గుర్తించలేదు. కొంత సేపటికి గుర్తు పట్టి ఆశ్చర్యంగా,

"ఆః! నీవు మరల తిరిగి వచ్చావా బీర్బల్? మా పూర్వీకులు స్వర్గంలో ఎలా ఉన్నారు? వారికి అన్ని సౌకర్యాలు ఉన్నాయా? వారికి నేను గుర్తున్నానా?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు. "ప్రభూ! వారంతా సకల భోగ భాగ్యాలతో తులతూగుచున్నారు. మీకీర్తిని విని వారు చాల గర్వించారు. వారికి కావలసిన తిండి, బట్టలు, సమస్తము ఉన్నాయి, గాని మంగలి వాడొక్కడే కొరత." అన్నాడు "బీర్బల్".

"అయితే చనిపోయి స్వర్గానికి వెళ్ళిన మంగలివాడొక్కడూ లేడా?" అనడిగాడు ఆశ్చర్యంగా 'బీర్బల్'.

"లేడు ప్రభూ! ఒక్క మంగలి గూడా స్వర్గంలో లేడు. మీ పూర్వీకులందరికి పెద్దపెద్ద గెడ్డాలు పెరిగిపోయాయి. ఒక్కొక్కమారు వారు తమగడ్డాలమీద తమే అడుగు వేసుకొని క్రిందపడిపోతుండేవారు. కొందరు తమంతట తామే కత్తిరించుకొనటానికి ప్రయత్నించారు గాని అవి సరిగ్గా కత్తిరించుకొనలేకపోయారు." అన్నాడు 'బీర్బల్'.

"అట్లయితే మనం వెంటనే వారికొరకు ఒక మంగలిని స్వర్గానికి పంపాలి".

"అవును ప్రభూ! స్వర్గలోకానికి ఒక మంగలివాడిని పంపాలి. స్వర్గానికి దారి ఏమంత సులభం కాదు గాబట్టి ఆ మంగలితో కొంతమంది తెలివైన రాజోద్యోగుల్ని పంపాలి." అని 'బీర్బల్' తనను చంపుటకు ప్రయత్నము చేసిన ఆరాజోద్యోగులు పేర్లు వరుసగా చెప్పాడు.

అక్బరు అందులకు ఒప్పుకొన్నాడు. అతడు రాజోద్యోగులకు కబురుపంపి ఆ మాసములోనే వారంతా మంగలివానితో కలసి స్వర్గానికి వెళ్ళవలసినదిగా చెప్పాడు. ఈవిధంగా ఆ దుర్మార్గులు పట్టుబడిపోయారు. రహస్యము అంతా తెలిసిపోయి అక్బరు వారిని కఠినముగా శిక్షించాడు. ★

అమ్మా!

ఎ. ప. చంద్ర

అమ్మా! నీ మాట లనలు
నమ్మ బుద్ధియగుట లేదు!
సాకులే అనిపించుచుండె
నాకు నీదు మాటలన్ని!! అ॥

వేసవిలో మధ్యాహ్నపు
వేళలందు మిత్రులతో
గాలిపటా లెగురవేయ
గది బయటికి వెళ్లుచుండ;

వద్దు బాబు! ఎండలోన
వడ గొడుతుందంటావు!
ఎండలోనె నాన్న వెళ్ళు
చుండెగదా పొలం పనికి? అ॥

వాన తుంపర పడుతుంటే
పరమ సంతసమున నేను
కాగితమున పడవ చేసి
కాల్వలోన వదలబోవ;

వద్దు బాబు! వానలోకి
వచ్చు జ్వరం అంటావు!
చెట్టుమీది పిట్టలపై
చినుకులు పడడం లేదా? అ॥

చలికాలం రాత్రిపూట
చక్కగ గదిలో పడుకొని
ఊపిరాడటం లేదని
ఉన్ని శాల్వ తీసేస్తే;

శాల్వ తీయ్యవద్దు బాబు!
జలుబుచేయు నంటావు!
చావడిలో పశువులన్ని
శాల్వ కప్పుకున్నాయా? అ॥

అపహరించి తన ఇష్టవచ్చినట్టు విహరించబోగాడు. ఇదిగాంచి తలి దండ్రులు చింతాక్రాంతులై తనయునికి వివాహంచేస్తే, అతని ఉడుకు తగ్గి, స్థిమితం పొంది, వంశాన్ని, రాజ్య భారాన్ని మోయగలుగుతాడని కొని తమ అభిప్రాయాన్ని కుమారునికి వెలిబుచ్చారు. కాని రుద్రాలకుడు వారి కోరికకు గట్టిగా నవ్వి, "వాడిన పుష్పాన్ని ఎవరైనా అశిస్తారా? తలలో పెట్టుకున్న కొద్దిసేపే విరిసిన పువ్వుకు విలువ. స్త్రీ కూడా అంతే. కన్యలు తియ్యని తేనెవంటివారు. కాని వివాహం బాధకరమైన తేనెటీగ కాటువంటిది. ఆ కాటునుండి తప్పుకొని, తేనెను సంపాదించగలవాడే కుశాగ్రబుద్ధి. పైగా స్త్రీలు దూరపుకొండలు! వంపులు తిరిగిన సర్పాలు. మెరిసే అగ్ని. భ్రాంతినిగొలిపే ఎండమావులు. అంతేకాదు, స్త్రీకి సహనంలేదు. ఈర్ష్య ఎక్కువ. అధికారం తనదిగా వుండాలని కోరుతుంది. ఆమెను తృప్తిపరచడానికి భర్త తన తల వొగ్గాల్సిందే. లత కౌగిలిలో చిక్కి, ఆయువు తీరకముందే కృశించి నశించే చెట్టులాంటివాడే భర్తకూడా! ఎంత చక్కటి పువ్వును ధరించినా తీగెవంటి చెట్టును కాలేను. ఆ సుందరి పదివేల రాధల అందానికి సరితూగినా నేనుమాత్రం వివాహం చేసుకోను. బానిసత్వంతో భార్యను కొనను" అంటూ ఉపన్యసించాడు. తలిదండ్రులు బ్రతిమిలాడినకొద్దీ ఇంకా మొండి పట్టుతో రుద్రాలకుడు వారి కోరికను తిరస్కరించాడు. తుదకు విసుగుచెంది దుఃఖపీడితులై ఆ వృద్ధదంపతులు గుండెబబ్బుతో అసువులను బాశారు.

తలిదండ్రులు మరణించగానే ఒక అడ్డం తొలగిందని ఆనందిస్తూ, రుద్రాలకుడు మరునటి దినమే తన గుర్రాన్నెక్కి అనుచరులతో వేటకు వెళ్ళేడు. అరణ్యమార్గంలోంచి శరవేగంతో పరుగెత్తే రాజా గుర్రంతో సరిసమానంగా వెళ్ళలేక, అతని అనుచరులు వెనుకపడ్డారు. రాజుమాత్రం తనొక్కడే అలా ముందుకు సాగిపోతూంటే అరణ్య మధ్యంలో ఒకచోట అతనికి జగదేకసుందరి అయిన ఒక స్త్రీ కనబడింది. ఆమె ఒక ఋషి కుమార్తె. ఆమె సౌందర్యం చూడగనే అతడు ముగ్ధుడై పోయాడు. ఆమె అందం సర్పంలాగ అతని హృదయంలో కూరుకొనివున్న వివాహద్వేషాన్ని ఒక్కసారిగా కాటువేసి చంపివేసింది. వెంటనే రాజా ఆ సుందరి హృదయాన్ని గెలిచి, తన రాజ్యానికి తీసుకెళ్ళి ఆమెను తన అర్ధాంగిగా, రాణిగా చేసుకున్నాడు. నాటినుండీ రుద్రాలకుని జీవితం మారిపోయింది.

భర్తగా అమ్ముడుపోయి, బానిసనుకానని శపథం చేసిన రాజా యిప్పుడు తన రాణికి హృదయపూర్వకంగా దాసుడయాడు. అతడు ఆమెను విడిచి ఒక్క క్షణమైనా వుండలేక, ఆమె తన అర్ధాంగి అనే నామం సార్థకం చేశాడు. రాయంచ కూడా విడదీయలేని క్షీర నీరాల్లాగ కలిసి మెలిసి వారు ఆనందంగా గడిపేరు. మారిన రాజును చూచి ప్రజలు ఎంతో సంతోషించేరు. "రాజుగారు యిప్పుడు భార్యావ్యామోహంలోపడి, రాచకార్యాలు వదిలేసినను పరవాలేదు. ఇదంతా మన మంచికే వచ్చింది. కొన్నాళ్ళు గడిచిన తర్వాత అంతా చక్కబడి రాజా

స్వప్నవర్తనము

(24–వ పేజీ తరువాయి)

గారు ఆదర్శప్రాయులై, వంశానికి, రాజ్యానికి ఒక జ్యోతిలా ప్రకాశిస్తారు. అప్పుడు స్వర్గంలోవున్న తలిదండ్రులు నిజంగా చాలా సంతోషిస్తారు" అంటూ ప్రజలు తమలో తాము అనుకున్నారు.

ఈ విధంగా రాజు దీపంచుట్టూ తిరిగే పురుగులాగ భార్య సన్నిధిని వదలక లోకాన్ని మరచి ఆనంద పారవశ్యంలో మునిగిపోయాడు. ఇదే మంచి అవకాశమని తలచి చుట్టూవున్న శత్రురాజులంతా జత చేరి, అతని రాజ్యంపై దండెత్తేరు. సరిహద్దున ఉన్న సామంతులుకూడా కప్పం చెల్లించడం మానేసి శత్రువులవైపు చేరారు. ఈ పరిస్థితిలో రుద్రాలకుడు తన భార్యను విడిచి రణరంగానికి వెళ్ళక తప్పిందికాదు. యుద్ధానికి వెళ్ళేముందు రాజు తన రాణిని సమీపించి ఆప్యాయంగా "ప్రాణేశ్వరీ! మనరాజ్యం ఇపుడు చాలా అపాయ స్థితిలో వుంది. మనల్ని నిశ్చింతగా నడువనీయక ఈ ముళ్ళు గుచ్చుకుంటున్నాయి. వీటిని వేళ్ళతోసహా ఆ మూలాగ్రంగా లాగిపారేస్తేగాని, మన జీవితమార్గం ఆనంద దాయకంగా వుండదు. అయినా నిన్ను విడిచి నేనొక్క క్షణమైనా ఉండగలనా ? కన్నుమూసి తెరిచేలోగా శత్రువులను పరిమార్చి నేను నీముందువచ్చి వాల్తాను" అంటూ పరిపరివిధాల బుజ్జగించి ఈ వియోగాన్ని కల్గించిన శత్రురాజుపై క్రోధాగ్నిని కక్కుతూ యుద్ధానికి బయల్దేరాడు. కాని వెళ్ళినంతసేపు పట్టలేదు. తుపానులా మీదికివచ్చిన శత్రురాజుల ధాటికి ఆగలేక శత్రువులు అతని శరణుజొచ్చారు. తన అపూర్వ పరాక్రమంతో సంపూర్ణ విజయాన్ని గైకొన్న రాజు మరుక్షణం ఒక అనుచరుణ్ణి వెంటనిడుకొని మనోవేగంతో తన రాణిని కలుసుకోడానికి తిరుగు ప్రయాణం సాగించాడు.

రాజు గుర్రంమీద వెళ్తున్నాడన్నమాటేగాని అతని కళ్ళకు భార్య స్వరూపంతప్ప, ఇంకేదీ కన బడడంలేదు. సూర్యునితో పోటీపెట్టుకున్నాడా అన్నట్టు ముందు వెనుకలుకూడా చూడకుండా పయనంచేస్తూ చివరికి సూర్యాస్తమయ సమయానికి నగరం సమీపించాడు. సంధ్యవెలుగులో దూరాన్నుంచి కోటగోడలు స్పష్టంగా కనబడుతున్నాయి. కోట కన్పించగానే ఆనందం పట్టలేక అత్యుత్సాహంతో తన నగరం ప్రవేశించాడు. దుమ్మును విరజిమ్ముతూ, సుడిగాలిలా రాజు వీధిలోనుండి వెళ్తూంటే ప్రజలు బెదిరి ఇటూ అటూ పరుగెత్తారు. కోటద్వారంలోంచివెళ్ళి అంతఃపురం చేరిందే తడవుగా గుర్రంమీదినుంచి క్రిందికి ఉరికి, అంతఃపురమందిరంలోకి పరుగిడి సంతోషంతో పరిచారకుల నుద్దేశించి "మహారాజు సురక్షితంగా వచ్చారు. రాణీరాకకోసం వేచియున్నారని తక్షణం విన్నవించండి" అంటూ బిగ్గరగా ఆజ్ఞాపించాడు. కానీ, ఇది విన్న సేవకులు నిర్ఘాంతపోయి రాజుముఖంచూస్తూ, మౌనంగా నిలబడ్డారు. రాజుకిదేమీ అర్థం కాలేదు. ఉగ్రుడై చుట్టూ చూశాడు. కొద్ది సేపటికి అంతఃపురంలోవున్న వృద్ధ సేవకుడు ముందుకువచ్చి, చేతులు జోడించి వణుకుతున్న కంఠంతో "మహారాజా! వార్తాహరులు తమర్ని కలుసుకోలేదా?" అన్నాడు. రాజు అర్థం కాక, "ఏమిటది? త్వరగా చెప్పు ఏమిటి?" అంటూ గర్జించాడు. సేవకుడు మాట్లాడలేక మాట్లాడుతూ, "మహారాజా! ఏం చెప్పను? మూడు రోజులక్రితం. . . . .మహారాణిగారు ఒక విషజ్వరం తగిలి అకాలంగా మరణించారు" అని విన్నవించాడు. ఈ వార్త వినడంతోనే రాజు నెత్తిన పిడుగుపడ్డట్టైంది. ఒక్కక్షణం శూన్యంగా చూచి రాజు క్రిందపడి మూర్ఛిల్లిపోయాడు.

2

పరిచారకులు మూర్ఛపోయిన రాజును కొనిపోయి హంసతూలికాతల్పంపైన పడుకోబెట్టారు. విగతాసువునిలా పడున్న రాజునుచూచి అంతఃపురమంతా దుఃఖంతో ఆందోళనతో నిండిపోయింది. రాజ్యంలోని వైద్యులందరూవచ్చి, పలువిధములైన ఔషధములతో నయం చేయడానికి ప్రయత్నించారు. ఎట్టకేలకు కొద్ది కొద్దిగా రాజు తెప్పరిల్లుకున్నాడు. కాని రాజు ధోరణి పూర్తిగా మారిపోయింది. పిచ్చివానిలా తన దేహాన్ని తనే కొట్టుకుంటూ, చేతులు కరచుకొని, జుట్టు పీక్కొనేవాడు. క్షణ క్షణం భార్యను తలచుకొని ఏడుస్తూ, హృదయేశ్వరి జాడకోసం అంతఃపురమందిరాలంతటా వెతికేవాడు. ఆమె కనుపించకపోతే ఉగ్రుడై ఎదుట కనిపించిన సేవకులమీద విరుచుకపడేవాడు.

ఒక ఉపన్యాసకుడు: టాగూరు కవిత గొప్పది ఆయన భావాలు ఉన్నతాలు. ఉపమానాలు అప్రమేయాలు. ఇదిగో ప్రేమను గూర్చి చెపుతూ యేమన్నాడో చూడండి. "ప్రేమఅంటే మన పంపులోని నీరుకాదు, యెప్పుడు త్రిప్పితే అప్పుడు రావడానికి. అది వచ్చినపుడే వస్తుంది. రాకపోతే రానేరాదు."

ఒక శ్రోత: అయ్యా! టాగూరు మన టౌనులో కాపురముండి వ్రాసివుంటే ప్రేమ అనేది మనపంపు నీరువంటిదే అని వ్రాసి వుండును కదా!


హెచ్. సత్యనారాయణరావు, (కర్నూలు)

విపరిమాటకూ లొంగక ఉన్మత్తుడైన రాజా శైఖరిని గమనించి మంత్రులు చేసేదిలేక రాజ్యక్షేమం కోసం అతనిని బంధించారు. కాని అన్న పానీయాలు మానేసినందున రాజా స్వస్థత పూర్తిగా చెడి, నిర్బలుడైపోయాడు. ఇక తన రాణిని కలుసుకోడానికి మరణమే ఏకైకమార్గమని నిర్ణయించుకొని, అంతిమ ఘడియలను నిరీక్షిస్తూ, మంచం పట్టాడు. కానీ, మరణం అంత సులభసాధ్యంకాలేదు. పద్దెన్నా మాసాలు గడిచేకొద్దీ అతని జబ్బంతా క్రమక్రమంగా తగ్గ నారంభించింది. అతని భౌతిక దేహం ఇక్కడ వున్నదన్నమాటేగాని, ఆత్మ మాత్రం పరలోకంలోవున్న భార్యను విడిచిపెట్టలేక ఆమె పైదే లగ్నమై ఉండింది. అతని ముఖంమీద చిరునవ్వు అదృశ్యమైంది. చూపుల్లో అర్థం నశించింది. ఎప్పుడూ ఏకాంతంగా వుంటూ, శూన్యంలోకి చూచి, దిగులుతో ముఖం వాల్చేస్తూ వుండేవాడు. ఆమె స్వరూపం క్షణ క్షణం అతని కళ్ళకు కనిపించినప్పుడెల్లా వియోగబాధ ముల్లులాగ అతని హృదయంలో గుచ్చుకునేది. అతని ఎర్రనైన కళ్ళు, విరియబోసుకున్న జుట్టు భయానకంగా వుండింది. ఎవరైనా రాజును సమీపించినపుడు బిడ్డను కోల్పోయిన తల్లి ఏనుగ దగ్గరికి వెళ్ళినట్లు గజగజ వణికేవారు. దుఃఖాగ్నిలో అతని తల బూడిద కప్పినట్లు నెరిసిపోయింది. కాలం ఈ అదును చూసుకొని అతని ముఖంలో ముడుతలుదిద్ది, పెదిమల చుట్టునూ, నుదురుపైనా వయసు రేఖలను చిత్రించింది.

3

ఒకనాడు పరమేశ్వరుడు, ఉమాదేవితోకూడి గగనవీధిలో విహరిస్తూ, చంద్రమండలం సమీపించాడు. అపుడు ఉన్నట్టుండి వారికి విడిచిపోయిన సఖుని కోసం వాపోవు చక్రవాక విలాపాన్ని బోలిన స్త్రీ ఆక్రందన వినవచ్చింది. అచ్చెరువంది వారు శశాంకుని రాజ్యంలోకి అడుగిడి ధ్వనివచ్చు మార్గాన్నిబట్టి వెళ్ళారు. అక్కడ ఒకచోట గంధపుచెట్టు బోదెకు ఆనుకొని, కన్నీరు ధారగా కారుస్తూ, కూర్చున్న ఒక సిద్ధురాలు కనబడింది. ఆమె జుట్టు చంద్రుని మరుగుపరిచే నల్లని మేఘాల్లా ముఖంమీదపడుంది. పార్వతీదేవికి ఆ సిద్ధురాలిపై జాలి కలిగింది. ఆమె విచారానికి కారణం తెలుసుకోవాలనే ఆసక్తితో పరమేశ్వరుని అడుగగా, సర్వమూ తెలుసుండి కూడా మహేశ్వరుడు తనంతట తానే చెప్పక ఆ వృత్తాంతము ఆ సిద్ధురాలినే అడుగమన్నాడు. అప్పుడు ఉమాదేవి ఆమెను తన దుఃఖ కారణమేమని అడుగగా, సిద్ధురాలు "హిమగిరితనయా! పుణ్య కార్యములు చేసినవారు ఈ లోకమునకు వచ్చి నిత్యానంద జీవితమనుభవిస్తారని ప్రతీతికదా! కానీ నా విషయంలో అది సత్యముకాదు. ఇలా సిద్ధురాలిగావున్నానన్నమాటేగాని నా హృదయంలో ఆనందం ఇసుమంతైనాలేదు. దీనికి కారణం నా పూర్వజన్మ వృత్తాంతమంతా నాకు జ్ఞాపకముండడమే! నేను భూలోకంలోని నా హృదయేశ్వరుని విడిచి వచ్చింతర్వాత అక్కడ నా భర్త నాకోసం ఎలా విలపిస్తున్నాడో స్పష్టంగా చూడగలుగుతున్నాను. నే నెన్ని పుణ్యకృతులు చేసిననేమి? ఒక్కక్షణము నా భర్తను కలుసుకునే అవకాశమెవరైనా నాకు లభింపచేస్తే నా పుణ్యఫలమంతా వారి పాదాల ముందిడి ఆ మహదవకాశాన్ని పొందడానికి సిద్ధంగా వున్నాను. నా కదియే పదివేలు. నా ప్రాణేశ్వరునికి తోడునీడగా వుండలేని ఈ సిద్ధురాలి జీవితం నాకెందుకు? భగవంతుడు నాకు మరపును ప్రసాదించకుండా, ఈ పూర్వజన్మ జ్ఞాపకశక్తితో కుమిలిపొమ్మని నన్నెందుకు శపించాడో! దగ్ధమైపోయిన ఆనాటి ఆనందాన్ని, ఆవేదనతో నిండిన ఈ నాటి ఆత్మను ఈ పాతస్మృతులు గొలుసులా బంధిస్తున్నాయి" అంటూ బిగ్గరగా ఏడ్చింది.

ఈ విషాదగాథను విన్న గిరిజ, "ఎటులైన మీరు ఈ సిద్ధురాలి అభీష్టం నెరవేర్పవలె"నని ఈశ్వరుని కోరింది. పరమేశ్వరుడు చిరునవ్వుతో "ఉమా! స్త్రీల స్వభావాన్ని నీవు గుర్తించలేకున్నావు. వారు ప్రియునికోసం ముల్లోకాలను భస్మం చెయ్యటానికైనా సమ్మతిస్తారు. వారినిచూచి జాలిపడి ప్రకృతి నిర్ణయానికి విరుద్ధంగా వెళ్ళగలమా? గతించిన కాలం తిరిగిరాదు. రాకూడదు. మిధ్య అయిన ఇద్దరి ప్రేమికుల ఆనందంకోసం మళ్ళీ కాలంలో వెనుకకు ప్రయాణంచేస్తే అల్లకల్లోలం తప్పదు" అని నచ్చచెప్పాడు. కాని, గౌరిదేవి అదేమీ వినక, తన కోరికను మళ్ళీ మళ్ళీ వెల్లడిచేసి బ్రతిమలాడింది. ఇక కాదనలేక గిరిశుడు "పార్వతీ! వారి కోసమని ప్రపంచ క్షేమాన్ని చెడగొట్టడం సమంజసంకాదు. అయిననూ నీ సంతృప్తికోసం ఈ అభాగ్యులిద్దరూ ఈ చిన్న నాటకములోని వారి చిన్న పాత్రలను వారే మళ్ళీ నటించేటట్లు చేస్తాను. కాని స్వప్నంలో మాత్రమే యిది జరుగగలదు. కర్కశమై, వాస్తవమై సరిదిద్దలేని ఈ ప్రకృతి గుణాన్ని సరిదిద్దేందుకు మార్గంగా స్వప్నాన్ని భగ



వంతుడు సృష్టించాడు. వాస్తవ ప్రపంచంలో జరిగినవి మారవు. కాకున్నవి కాకమానవు. కానీ స్వప్నంలో ఈ బంధాలులేవు. అయినన్నూ దైవనిర్ణయానికి ఒగ్గి యధాతథంగా జీవిస్తేనే ఆ ప్రేమికులకు మేలు. ఏ పునస్సమాగమమైతే వారి వ్యధను నిర్మూలిస్తుందని వారు ఆశిస్తున్నారో ఆ పునస్సమాగమమే వారి దుఃఖాన్ని ఇనుమడింపచేస్తుంది. అయినన్నూ, నీ కోరిక ప్రకారమే అగుగాక, ఈ సిద్ధురాలు తన ప్రాణేశ్వరుని స్వర్గ భూలోకముల మధ్య ఒక్క ఘడియసేపు కలునుకునేటట్లు వరమిస్తున్నాన''ని చెప్పాడు అప్పుడా సిద్ధురాలు శంకరుని స్తుతిస్తూ, "కాలపు కెరటాల్లో మునిగిపోతున్న మా బోటులను రక్షించే పరమేశ్వరా! నేను భర్తృవియోగంతో వాడిన పుష్పంలా వున్నాను రవితేజుడైన నా హృదయేశ్వరుని చూచి సంతోషంతో వికసించేభాగ్యాన్ని త్వరగా కల్గజేయి. త్వరగా" అంటూ భగవంతుని పాదాలంటి మ్రొక్కింది.

4

అదేసమయంలో భూలోకమందున్న రుద్రాలక మహారాజు తన మందిరంలో భార్యనే తల్చుకుంటూ, గత జీవితాన్ని కలగంటూ కూర్చున్నాడు. అతనికి ఆహ్లాదం కలిగించే యత్నంలో కొందరు గాయకులు సమీపంలోనే కూర్చొని గానం చేస్తున్నారు దురదృష్టవశాత్తు వారు పోయిన రాణికి ఇష్టమైన రాగాన్ని మొదలెట్టేరు. వెంటనే అది విషపూరితమైన సూదిలా అతని హృదయంలోనికి చీల్చుకోపోయింది. దాంతో సింహంలా గర్జిస్తూ, "పొండి అవతలకి! పొండి! మీరందరూ కుట్రపన్ని నా హృదయాన్ని ముక్కలు చెయ్యడానికి చూస్తున్నారు" అంటూ వారిని తరిమాడు పాపమా గాయకులు పాట ఆపేసి అతని కోపానికి భయపడి కుందేళ్ళలాగ చెల్లాచెదరయిపోయారు. ఆ సమయంలో ఒక సేవకుడు లోనికివచ్చి వినయంగా నిలబడి, "మహారాజా కొందరు నగల వర్తకులు వచ్చి, వారి నగలను మీకు చూపించటానికి అంతఃపురం బయట వేచియున్నారు" అని విన్నవించారు. రాజు చిట్బార్పుతో "ఈ రత్నాలన్నీ ఇప్పుడు నాకెందుకు?" అని చింతిస్తూ, మరలా "అయినా ఫర్వాలేదు వాళ్ళను లోనికి తీసుకురా" అని ఆజ్ఞాపించాడు

వర్తకులు రాజమందిరం ప్రవేశించి ఒక్కొక్కరుగా మహారాజుకు తమ నగలను ప్రదర్శించారు. వాటిని పరిశీలిస్తూ, రాజు ఖిన్నుడై, "అయ్యో! నాకు ప్రాప్తించే సుఖమంతా దుఃఖమే. నాకు కలిగే ఆనందం అంతా విచారమే. నా ప్రాణేశ్వరిని అలంకరించి ఆ ముచ్చటతో మురిసిపోయే భాగ్యం లేనప్పుడు నాకీ నగలెందుకు?" అంటూ విలపించాడు. మరుక్షణం ఏం తట్టిందో ఏమో తానే తన ప్రేయసైనట్టు ఆ నగలన్నిటినీ తనే ధరిస్తూ ఒక్కొక్క వర్తకుడు తెచ్చిన రత్నాలు, కెంపులు, ముత్యాలు, మణులు, వజ్రాలు, వైడూర్యాలు మున్నగువాటితో తన ఒడలంతా నింపేసుకున్నాడు.

ఇలా అందరి సరకులను స్వీకరిస్తూంటే చివరికి రాజు కంటికి ఒక వృద్ధ వర్తకుడు కనబడ్డాడు. అతని తీరు వింతగావుంది. కొంచెందూరంగా నిలబడివున్నాడు. అతని తల చాలా పెద్దది. తెల్లని వెంట్రుకలు భుజాలమీద వాలి గడ్డంలో కలిసిపోయాయి. ముఖం ముడుతలతో నిండి, మాగిన పండులాగుంది. అన్నిటికంటె చిత్రమైనదేమిటంటే అమ్మే వస్తువేదీ అతనివద్ద కనబడటంలేదు. మహారాజు ఆ వృద్ధుని విచిత్రవై ఖరిచూచి "వ్యాపారీ! మరి నీవు విక్రయించే సరుకేది? నాకు కనబడకుండా లోన ఎక్కడో దాచినట్టున్నావ్. అది అంత అమూల్యమైనదైతే, దానిని వెంటనే బయటికి తీయి ఈ ఆభరణాల్తో దాన్ని కూడా చేర్చి అలంకరించుకుంటా" నన్నాడు. వర్తకుడు రాజునుచూచి, "మహారాజా! నా దగ్గరుండే వస్తువు విలువలో ఈ నగలన్నిటికంటెనూ అధికమైనది ఆకారంలో అణువుకంటె సూక్ష్మమైనది. శూన్యంకంటె తేలికైనది" అన్నాడు. అర్థంకాక రాజు "ఏమిటది? నీవు విక్రయించే ఆ అసాధారణ వస్తువేది?"

భార్య :- ఆ ఇనప్పెట్టె బీగం చెవి కొంచెం యిలాయివ్వండి. కాస్త డబ్బు తీసికోవాలి.

భర్త:- (లోభి) అబ్బే, అదేం లాభంలేదు. అదేం హృదయమనుకున్నావా అంత తేలిగ్గా నీ కిచ్చేయడానికి?

హెచ్. సత్యనారాయణరావు, (కర్నూలు)

అని ప్రశ్నించాడు. వృద్ధుడు మెల్లగా "మహారాజా! నేను స్వప్న వర్తకుణ్ణి" అని ముక్తసరిగా జవాబు చెప్పాడు.

ఇది విని రాజు ఫక్కుమని నవ్వాడు. "ఏమిటది? స్వప్నాలను అమ్మడం ఎక్కడైనాకద్దా? నీవు పిచ్చివాడివా లేక ముసలి విదూషకుడివా" అని అడిగాడు వృద్ధుడు చలించకుండా, "మహారాజా! పిచ్చివాడు తనకు పిచ్చి అని చెప్పగలడా! అయినన్నూ నా మాట నాలకించండి చాలామంది తమ సర్వస్వము ధారపోసైనాసరే నేను అమ్మే కలలను కనడానికి, కొనడానికి సంసిద్ధులుగా వున్నారు. నా కలల మహాత్మ్యం అటువంటిది అవి గతాన్ని మళ్ళీ రప్పించగలవు. పోయిన దాన్ని తెప్పించగలవు వియోగ బాధితులను దగ్గరకు చేరదీసి విషాదాశ్రువులను ఆనంద బాష్పాలుగా మార్చగలవు గాయపడి, నిరుత్సాహంతో వాడిపోయిన పుష్పాలవలెనున్న హృదయాలను అనురాగపు ఔషధాలతో మాన్పి నూతన వికాసాన్ని కలుగజేయగలవు. ప్రాణంలేని కంఠాల్లో మళ్ళీ కోమల నినాదాన్ని పుట్టించగలవు" అని అన్నాడు.

వృద్ధ వర్తకుని పలుకులు రాజు హృదయవీణను మీటి, అతనిలో ఆశారాగాన్ని ఉద్భవింపజేసింది. అర్ధాంగిని గురించిన తలపు అతన్ని పూర్తిగా ఆవరించింది. వెంటనే మహారాజు మేను కంపింప వృద్ధుని మెడ పట్టుకొని ఆవేశంతో వూపుతూ "మతిభ్రష్టుడా! ప్రభువుతోనా నీ పరిహాసం? ఫలితం చూపకముందే వాగ్దానం చేస్తున్నావ్. జాగ్రత్త! ఇది నిప్పుతో చెలగాటం. మాట తప్పావంటే భస్మమైపోతావ్" అంటూ గర్జించాడు.

వృద్ధుడు చిరునవ్వుతో "మహారాజా! మీరు పసికూనలు. మీ వ్యాధికి ఔషధమున్న వైద్యుణ్ణి నేనొక్కణ్ణే అన్న విషయం మరచి, నాతోనే తగవులాడుతున్నారు. నేను శరీరవ్యాధులకు వైద్యుణ్ణి కాను. ఆత్మవ్యాధులకు వైద్యుణ్ణి, తెలుసా? ఇప్పుడు చెప్పండి? నావద్దనున్న స్వప్నాన్ని కొంటారా?" అంటూ సూటిగా ప్రశ్నించాడు. రాజు ఒక్కక్షణం తదేకదృష్టితోచూచి, కడకు వృద్ధునితో "అలాగే వ్యాపారీ. నాకు ఆనందదాయకమైన స్వప్నాన్ని కొంటాను వెలయెంతో చెప్పు. ఎంతైనా చెల్లించడానికి సిద్ధంగావున్నా" నన్నాడు వృద్ధుడు మెల్లగా నవ్వి, "మహారాజా! సరకును పరీక్షించడానికిముందు ఎవరైనా వెల నిర్ణయిస్తారా? ముందు మీ స్వప్నం మీ కిస్తున్నాను వెల సంగతి తరువాత చూద్దాం. నా సరుకు మహిమ గ్రహించిన తర్వాత వెల మీరే నిర్ణయిస్తారు. స్వప్నంవెల యిప్పుడే చెప్తే తమరు కొనడానికే సంకోచించవచ్చు" నన్నాడు

వృద్ధుడు తన చొక్కాలో దాచిన ఒక గిన్నెను తీసి, పైకెత్తి పట్టుకొని సూర్యునిగూర్చి ధ్యానం చేశాడు వెంటనే ఒక సూర్య కిరణం బాణంలా మందిరంలోకి చొచ్చి, సరిగ్గా గిన్నెమీద పడింది. కొన్ని క్షణాలాగి వృద్ధుడు రాజు దగ్గరికెళ్ళి, "మహారాజా! చంద్రమండలంనుండి ఈ రోజునే తెచ్చిన ఔషధమిది. చూడండి అంటూ చేతిలోని గిన్నెను రాజుకు చూపించాడు గిన్నెలోని ఔషధము పలు రంగులతో మెరుస్తూ, బుడగలతో నాట్యం చేస్తూ, నవ్వుతూంటే రాజుకు తన హృదయేశ్వరి మోమును చూసినట్టు భ్రమ కలిగింది ఆమె తన్ను ఆహ్వానిస్తున్నట్టు అనిపించింది. వెంటనే గిన్నెను చేతిలోకి లాక్కొన్నాడు. ఔషధ పరిమళం తనరాణి తల నిడుకునే పువ్వుల తావిని జ్ఞప్తికితెచ్చి అతన్ని ఉన్మత్తునిగా చేసింది కాలహరణం చేయకుండా ఔషధాన్ని తాగేద్దామని గిన్నెను పెదిమలవరకు తీసుకపోయేసరికి ఉన్నట్టుండి అతనికొక ఆలోచన కలిగింది. "ఈ వృద్ధుడు నుడివినదంతా నిజమేనా? ఒకవేళ పరాజితులైన నా శత్రువులు కుట్రపన్ని నన్ను హత్య చెయ్యడానికి ఇలా విషమివ్వడంలేదు కదా?" అని సందేహించాడు కానీ వెంటనే "అయినన్నూ ఫరవాలేదు ఎంత చండ విషమైతే అంత మంచిది. నా ప్రియురాలులేని జీవితంకన్నా మరణమే మేలు" అని నిర్ధారణ చేసుకొని, మరొక్క క్షణమన్నా ఆగకుండా గిన్నెలోని ఔషధమంతా ఒక్క గుటకలో తాగేశాడు తాగిందే తడవుగా తను కూర్చున్న పాన్పుమీద అలాగే స్పృహలేకుండా పడిపోయి, వెంటనే నిదురకడలిలో మునిగిపోయాడు.

వృద్ధుడు రాజు పాన్పుప్రక్కనే పద్మాసనం వేసుకొని, కళ్ళుమూసి, కదలక మెదలక, గోడ గీచిన చిత్తరువులాగ కూర్చున్నాడు. అంతా నిశ్శబ్దం

(సశేషం)

కలదు దానికి వెలుపల బార్లుగ నిలువెత్తుగల శిలాస్తంభములు నిలువబడియున్నవి. అవి ఒకదానితో నొకటి యంటి లేకున్నను, వాని నడుమనుండి మనుష్యులు దూరిపోవుట కష్టసాధ్యము. అశ్వాదులు దూరలేవు. దీనివలన వాహ్యాళి ప్రదేశము గుర్తింపబడుటయేకాక, ఈ శిలా పరంపర శత్రువులను ప్రాకార సమీపమునకు సులభముగా రానీకుండ కొంతవరకడ్డు కొనజాలి కూడ నుండెను.

గోపురద్వారము ఎత్తైన, బలిష్ఠమైనది. అక్కడ రక్షకభటులు రాత్రిం బవళ్ళు కాపుందురు. క్రొత్తగా నగర ప్రవేశము చేయువా రందరును తల కింత, బండికింత, గుర్రమున కింత, పల్లకి కింత, మేనా కింత—ఇత్యాదిగా నిర్ణీతమైన నగర ప్రవేశ సుంకము చెల్లింపనిది నగర ప్రవేశము చేయరాదు. వచ్చినవారి నామాదికములు వ్రాసికొనుట, తెచ్చిన వస్తువులు పరీక్షించుట మొదలగు తతంగ మెంతో జరుగవలెను. దానికే సామాన్యముగా నొక రోజం తయు పడికాపుండవలెను. అక్కడి కొండవీటి స్థానాపతి కరణముబాచప్ప ముందు మజిలీలోనే కలసికొని అన్ని యేర్పాట్లు చేయించియున్నందున నాలుగు గడియలకంటె ఆలస్యము కాకుండ శ్రీనాథుడు సపరివారముగా నగర ప్రవేశము చేయ గలిగెను. అక్కడి ద్వారపాలకుడు వారి అధికార పత్రాదులు పరీక్షించినను, పూర్తిగా విశ్వసింపక వారివెంట తన యాశ్వికభటులను కొందరినిపంపి, వెంటనే వేగరిచే కటకపాలున కీ వార్త అందజేసెను. రహస్యచరులగు నా విద్యానగరాశ్వికులు కూడ శ్రీనాథ బృందమునకు రక్షకబృందమై వైభవాతిశయము కల్పించెను

శ్రీ విద్యానగర వైభవము ముఖ్యముగా వామన భట్టబాణునివలన వినియున్నను, ప్రత్యక్ష నిదర్శనము శ్రీనాథుని యూహానే అతిశయించెను దానికి ప్రధాన కారణము అప్పటి ప్రభువగు దేవరాయలు కల్పించిన నీటి వసతియే. వానను ఉన్నప్పు డది లేదు. దేవరాయలు సింహాసన మధిష్ఠించిన వెంటనే తన స్థపతులచే దూరమున నున్నత ప్రదేశమున తుంగభద్రకు ఆనకట్ట కట్టించి, ఖనకులచే నక్కడి నుండి వలుమూలలకు కాలువలు త్రవ్వించి, శిల్పులచే వానిని మనోహరముగా శిలా నిర్మిత కుల్యలుగా కట్టించెను. అందువలన నగరమున జల సమృద్ధి కలిగినది నగరము ఉద్యానములతోడను, పుష్ప ఫల వృక్షములతోడను, వెలుపలి ప్రాకారములు సస్యక్షేత్రములతోడను నేత్రపర్వ మొనర్చుచుండెను. జన బాహుళ్యము అతిశయించినది. సుందర మందిరములును విరివిగా వెలయజొచ్చినవి.

శ్రీనాథునికి వసతిగృహము శ్రీ విరూపాక్షేశ్వరాలయమునకును, తుంగభద్రానదికిని సమీపమున నున్న మతంగగిరికి ఈశాన్యముగను స్థానాపతి ఏర్పరచెను అక్కడికి చేరుటకు అన్ని ప్రాకారములు దాట నక్కరలేదు మొదటి రెండు ప్రాకారములకు మధ్య కోసి కుప్పలు వేసి యున్న శాలిక్షేత్రములుచూచి శ్రీనాథు డానందించెను రెండవ ప్రాకారము దాటగనే మాల్యవంతమును వారు సమీపించిరి. వారు దానికి అర్ధ ప్రదక్షిణము చేయ వలెను

వెంటనే శ్రీనాథుడు పల్లకియాపి దిగెను. మేనా

కవిసార్వభౌముడు

(23-వ పేజీ తరువాయి)

నుండి శ్రీదేవి దిగెను దుగ్గన, పోతన గుర్రముల నుండియు బండ్లలోనివారును వారి వారి వాహనములనుండి యవతీర్ణులైరి. విద్యానగరాశ్వికులు కూడ నట్టము కాకున్నను దిగిరి శ్రీనాథు డిట్లు వారల ప్రబోధించెను:

"ఇదిగో మాల్యవంతము! శ్రీరామలక్ష్మణుల శ్రీపాద విన్యాసములచే పవిత్రమైన దీ క్షేత్రము. సుగ్రీవ హనుమ జ్జాంబవగంగదాది మహా కపి వీరుల సింహనాదములలో ప్రతిధ్వనించిన దీ మాల్యవంతము! రాఘవుడు విజయ యాత్రకు రణభేరి వేయించిన దీ మాల్యవంతము గిరిపృష్ఠమునవే! (స తదా వాలికం హత్వా సుగ్రీవ మభిషేచ్య చ వసన్మాల్యవతః పృష్ఠే రామో లక్ష్మణ మబ్రవీత్ రామా. కి. 28—1 శ్లో.) దీనిపై రఘునాథస్వామి వెలసియున్నాడు."

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

ఉపాధ్యాయుడు:- కష్టమైన పదాలకు నిఘంటువును చూచి అర్థము తెలుసుకోమన్నాగా!

బాలుడు:-ఇంతకూ నిఘంటువు అనే పదానికి అర్థం తెలిస్తేగా చూచుకోటానికి?

జి. వి. శ్రీధర్ శ్యామసుందరం,
(మద్రాసు)

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

ఇట్లనుచు నాతడు వెంటనున్న బంగరు కొమ్ము చెంబులోని యుదకము గ్రహించి ఆచమించి ఆత్మ ప్రదక్షిణమొనర్చి మాల్యవద్గిరి పృష్ఠమునకును, అందుపై వెలసిన రఘునాథస్వామికిని సాష్టాంగ దండప్రణామ మాచరించెను. శ్రీదేవియు యాత్రిక బృందమును శ్రీనాథు ననుకరించిరి దుగ్గనకు, పోతనకు ఆనంద బాష్పములు ధారలుకట్టెను నిత్యదర్శనముచే నిన్నాళ్ళు మహత్వము గ్రహింప కుండిన విద్యానగరాశ్వికు లదికాంచి యాశ్చర్యచకితులై గిరివందన మొనర్చిరి ఆ ప్రాంతమునందే హొన్న సారీబజారు (ఈ తర్వాత 24 సం లకు దర్శించిన అబ్దుల్ రజాక్ భాష) చేరునంతవరకు వారు అందరు పాదచారులై పరిక్రమించి అక్కడ ఎవరి వాహనములు వా రధిష్ఠించిరి. వా రుత్తరముగా సాగిరి

ఆ రాజవీధి వైభవము వర్ణనాతీతము. అది దీర్ఘమై ముందు వెనుకల కనుచూపుమేరదాటివ్యాపించి యుండెను. అది సువిశాలమైనది రెండు ప్రక్కల వర్తకులు సుగంధ ద్రవ్యములు, తమలపాకులు, పోకలు విక్రయించుకొనుటకు తమ యంగళ్ళముందు రమ్యముగా మంచెలు కట్టుకొనిరి వానిముందా రాజ మార్గము పొడవునను అసంఖ్యాకముగా పుష్పలావికలు పరిమళభరితములగు వివిధజాతుల పుష్పములను,

మాలలను విక్రయించుచు నాకర్షించుచుండిరి. నా రట్లాక్రమించినను ఆ వీధిలో పాదచారులేకాక అశ్వములు, ఏనుగులు, బండ్లు, పల్లకీలు మున్నగు వాహనములమీద వెళ్ళువారు కూడ గుంపులు గుంపులుగా రాకపోకలు సలుపుచున్నను, అందరు నొత్తిడి లేకుండ జనుటకు చాలినంత విశాలముగా నా వీధి యుండెను. ఆ యశేష జన సమూహములో, స్త్రీలేమి, పురుషులేమి, పూవులు సిగలలో ముడువ కుండనా వగాల్యము అలంకరింపకుండను పోవువారు లేరు. అన్నిటిలో వారికి గొజ్జంగిపూలన్న నధిక ప్రీతి ఆ వీధియంతయు గులాబిపూల యామోదముతో గుబాళించుచుండెను

శ్రీదేవి గులాబిదండ తీసికొని మేనాలోని దేవ సంపుటము నలంకరించెను. శ్రీనాథుడు పల్లకి నాపి కరణముచే నందరికిని పూలదండలు, గులాబివి, మల్లెలవి, మొల్లలవి, జాజులవి, విరజాజులవి, చేమంతులవి, శేఫాలికలవి, పగడలవి ఎవరి కిష్టమైనవి వారికి కొనిపించి, పరివార జన మందరికేకాక శ్రీ విద్యానగర రక్షకులకును ఇప్పించి యలంకరింపజేసెను. వారు శ్రీనాథుని రాజఠీవికిని, వితరణకును ముగ్ధులైరి.

ఆ రాజవీధినుండి ఇరువైపులకును పెద్ద పెద్ద వాడలు వ్యాపించియుండెను ఒక్కొక్కవాడలో ఒక్కొక్క దినుసు వస్తువులే విక్రయించు చుండిరి. రత్నాలవాడలో వజ్ర వైడూర్యములు మాణిక్యములు, పచ్చలు, పగడములు, నీలములు, పద్మరాగములు, ముత్యములు విచ్చలవిడిగా, రాసులుగా పోసి నిర్భయముగా విక్రయించుచుండిరి.

వారు కొంచెము సాగినంతనే కుడివైపున నింబ పురమును, దాని కావల తలవరిగట్టును అగపడినవి. ఆ గట్టు క్రిందనేయు, గట్టుపైనను విద్యానగర రక్షకుల గృహములును, ఉద్యోగుల సౌధములును వరుస లతీరి యుండెను రక్షకోద్యోగులుకాక, పడి కావలిదండ్రే ఆ నగరమున సంద్రెండువేలమంది కలరు. వారికి ఒక్కొక్కనికి రోజొకొక పణము జీతము. ఆ మహానగరములోని వేశ్య వాటికలపై వసూలగు సుంకమువలననే నగర రక్షకుల జీత బత్తెములు చెల్లుచుండెనని వెంటనున్న రక్షకులు తెలిపిరి

వారు కొంతపడి ఉత్తరముగాసాగి పశ్చిమమునకు తిరిగిరి వారి కప్పుడు కుడిప్రక్కను శ్రీ విరూపాక్షేశ్వరుని ఆలయ గోపురమును, వామ పార్శ్వమున హేమకూట మతంగగిరి శిఖరములును నిరాగ్రహముగనుండి కానవచ్చినవి. మరల శ్రీనాథుడును, పరివారమును, వాహనములుదిగి శ్రీ విరూపాక్షేశ్వరస్వామికిని మతంగగిరి హేమకూటములకు ప్రణమిల్లిరి. అంతట నందరు పాదచారులై నడచి ఆ సమీపముననే స్థానాపతి తనకు ఏర్పరచిన విడిదికి చేరిరి అది చక్కని యుద్యానమధ్యమున నున్న విశాల చతుశ్శాలా భవనము. అక్కడ స్థానాపతి వారిని సపరివారముగా నెదుర్కొని తోడితెచ్చి భవనములో ప్రవేశపెట్టి కొండవీటివార్త లడిగి తన గృహమున కేగెను.

అంతవరకు వెంట వచ్చుచున్న నగర రక్షకులు పల్లకిలోవచ్చుచున్న శ్రీనాథుడొక్కడే విద్వాంసుడును, విద్యోపకారియు నని భావించిరి. ఒండ్రలోనుండి

కవిసార్వభౌముడు

ఒక రొకరే దిగుచుండగా వారిని స్థానాపతి పూశించు చున్న విధము చూడగా వారు విద్వాంసులో, ఉద్యోగులో ఐ ఉండవలెనని నిశ్చయించిరి. ఆ దిగుచున్నవారిలో గొందరయొడ శ్రీనాథుడు ప్రదర్శించిన వినయ గౌరవములచే పలువురు మహా విద్వాంసులై యుండవలెనని స్పష్టమైనది. ఏమి ఈ కొండవీటి పండితులు శ్రీ విద్యానగరముపై దండు వచ్చినారా యనిపించినది. వారి నాయకు డా రాత్రియే కటకపాలుని దర్శించి భయ సంభ్రమములతో "ప్రభూ, ప్రభూ, కొండవీటి విద్వాంసులు, కవులు మన నగరముపై దండువచ్చి శ్రీ విరూపాక్షేశ్వరస్వామి యాలయ సమీపమున బ్రాహ్మణ వాడలో పెద్ద భవంతిలో విడిసినారు" అని విన్నవించెను.

స్వయముగా విద్యావినోది యగు కటకపాలుడు నవ్వి, "విద్వాంసులా దండెత్తి వచ్చినది? వారి వద్ద ఆయుధము లేమున్నవి?" అని ప్రశ్నించెను.

"ఆయుధములా ప్రభూ! అనుమతి పొందిన ఆయుధపాణులు ఆరుగురే వారివెంట నున్నారని తమ దివాణమునకు ద్వారపాలకులు వార్త పంపినారు. వారి వెంటనున్నవారిలో ఒకడు మనిషిగా లేడు. రాక్షసుడో, యక్షుడోవలె ఉన్నాడు. వాని చేతిలో గద మాబోంట్లను పదిమందిమిపట్టినగాని మోయలేము."

"అతడు కూడ విద్వాంసుడేనా?"

"ఐ యుండవలె. వాడు పర్వతమువలె మహాకాయుడు. అంత శరీరమున్నా, లేడివలె చురుకుగా గంతులు వేయును. అడు గడుగునకు ఏనుగు అడుగు పెట్టినట్లు భూమి దద్దరిల్లుచున్నది. అతడు మల్లవిద్యలో సాటిలేనివాడని తోచును."

"తక్కిన విద్వాంసులవద్ద ఏ మాయుధము లున్నవి?"

"వారి బండ్లలోనుండి ఎన్నెన్నో సుందర కోశములు దిగినవి. వారి వాక్కులే ఆయుధములుగా తోచినవి. కొందరు వేదఘోష చేయుచుండిరి. కొందరు ఏమేమో శాస్త్రములు చర్చించుచున్నట్లున్నారు. కొందరు సంస్కృతాంధ్రములలోనేకాక, 'శౌరసేని' మొదలగు ప్రాకృత భాషలలో గూడ ధారాళముగా శ్లోకములు గాథలు చదువుచు, ఆనందముతో తర్క వితర్కములు సలుపుచున్నారు. వారి నాయకుడు రాత్రివేళ దేవతార్చన చేయుచుండగా కొందరు ఉచ్చైస్స్వరముతో శస్త్రములు చెప్పినారు."

"అప్పుడేమైనది?"

"ప్రభూ, వా రా శస్త్రములు చెప్పుచుండగా ఈవల మాల్యవంతము మతంగపర్వతము హేమకూటములనుండియేకాక, తుంగభద్ర కావల ఋశ్యమూకము అంజనాచలములనుండి కూడ ముక్కోటి దేవతలు తమ దివ్య దేహములతో దిగి వస్తున్నట్లు తోచినది ప్రభూ!" (సశేషం)

పుట్టింటి మమకారం

(21-వ పేజీ తరువాయి)

హం మొదలైన శుభకార్యాల సందర్భంలో, ఏ పెట్టుపోతలదగ్గరో, తమకు సరైన మర్యాదలు జరగలేదని, తగినన్ని కానుకలు లభించలేదని, అత్తమామలపట్ల అలుక వహించి కినుక చూపటం మన ఆంధ్రదేశంలోని చాలామంది అల్లుళ్ళలోని ఒక ప్రత్యేకత. కాలగర్భంలో సంవత్సరాలు తరలిపోయినా, కాలగమనంతో పాటు వీరికోపతాపాలు కూడా పెరిగిపోతుంటాయి.

"అత్తమీదికోపం దుత్తమీద చూపించా"డన్న సామెత ప్రకారం ఆ పగనంతా తమను కట్టుకున్న వారిమీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చూపటం కొందరి కొందరి విశిష్టత. మాకు వరసకు బావగారయ్యే ఒకాయన వున్నారు. ఆయన హోదాకు తగినట్లు అత్తవారు పండుగలకు, పబ్బాలకు మర్యాదలు చూపటంలేదని, ఆయన తల్లిదండ్రులు కోడలిని పెళ్ళయిన చాలాకాలంవరకు అత్తవారింటికి తీసికెళ్ళలేదు. చివరకు మా చిన్నాన్నగారు అప్పుచేసి సారె అది ఘనంగా ఇస్తే, అప్పుడువచ్చి తీసికెళ్ళారు. కాని భార్యను తీసికెళ్ళిన నాలుగు సంవత్సరాలవరకు మళ్ళీ తిరిగి ఆమెను పుట్టింటి మొహం చూడనీయలేదు ఆ మహానుభావుడు. అంతేకాకుండా ఆమె పుట్టింటివారికెవ్వరికి, కనీసం ఉత్తరం ముక్కయినా వ్రాయకూడదని, వాళ్ళను గురించి తనదగ్గర ఎత్తరాదని, ఒకవేళ వాళ్ల దగ్గరనుంచి ఉత్తరాలేవైనావస్తే, వచ్చినవి వచ్చినట్టు తను ఆఫీసునుంచి రాగానే చేతికివ్వాలని, ఇంకా ఎన్నెన్నో ఆంక్షలు విధించారాయన. పాపం, ఇవతల అమ్మాయి ఏమయిపోయిందో, ఎలా వుందో"నని మా వాళ్ళ విచారం. "అందరి గృహిణులమల్లే పుట్టింటికి కనీసం ఏ పండుగకైనా వెళ్లేభాగ్యం కూడా లేదే" అని లోలోపల విషాదం పెనవేస్తున్నా, ఆయన ముందు కనిపించనీయకుండా తెచ్చిపెట్టుకున్న నవ్వులు చిందిస్తుంటుంది మా అక్క. మళ్ళీ మా బావగారు విద్యాధికులు. కాలేజీ రోజుల్లో వరకట్న నిర్మూలన, స్త్రీ స్వాతంత్ర్యం మొదలైన విషయాల గురించి, గంటల తరబడి బల్లగుద్ది వాదించి ఉపన్యాస పోటీలలో ఎన్నో ప్రైజులు సంపాదించుకున్న అభ్యుదయవాది. ఆయన ఆదర్శాలన్నీ కాలేజీ నుంచి బయటకు వచ్చేసేటప్పుడే, మళ్ళీ కొత్తగా కాలేజీలో ప్రవేశించేవారికోసం గేట్లదగ్గరే వదిలేసి వచ్చారు.

నవమాసాలుమోసి, కని పెంచిన తల్లిఅన్నా, పెళ్ళయ్యేంతవరకు తనకోసం ఎంతటి వ్యయ ప్రయాసలకయినా వోర్చి, కాళ్ళకు బలపాలు కట్టుకు తిరిగి తగిన వరుడ్నిచూసి పెళ్ళిచేసి గృహిణిగా సంఘంలో తన కొక స్థానాన్ని సృష్టించిన తండ్రి అన్నా, ఒక్క గర్భంనుండి రక్తస్పర్శతో జన్మించిన తోబుట్టువు అన్నా, ఆత్మీయ, ఆప్యాయతలతో కూడిన అభిమానాన్ని ప్రదర్శించటం, పొరపాటుకాదు. "మా వాళ్ళు" అని స్త్రీలు తమకన్నవారిని తల్చుకోవటం నిషిద్ధమైన విషయంమేం కాదు కాని మిగిలిన విషయాలన్నింటిలోనూ, భార్యలను ప్రేమతో చూసుకుంటూ, ఒక్క ఆమె పుట్టింటివారి విషయంలో మాత్రం దూరాలోచన లేకుండా ప్రవర్తించటం, విజ్ఞత తెలిసిన మగవారి సంస్కారానికి నిదర్శనం కాబోదు.

కేవలం మగవారిలోని లోటుపాట్లను మాత్రమే ఎత్తిచూపించటంకాదు నా అభిమతం పుట్టింటివారంటే, అంతులేని అభిమానంలో, హద్దుమీరి ప్రవర్తించి, స్వంత కాపురాలలోనివన్నీ వారికందచేసి, తమకు తాము ఆ పరిస్థితులను సృష్టించుకున్న స్త్రీలు కూడా లేకపోలేదు. కాని అటువంటి వారిని గురించికాదు నేను సమర్థించేది. మాకు తెలిసిన ఒకామెవుంది. ఆమె కాపరానికి వచ్చింది మొదలు ప్రతినెలా కొంత డబ్బు ఇంటికి పంపిస్తుండేది. భర్త ఎంత డబ్బిచ్చినా, యింట్లో ఖర్చులకు అయిపోయిందని మళ్ళీ తిరిగి తరచుగా డబ్బు తీసుకుంటుండేది. కొన్నాళ్ళు ఆయన నిజంగానే అంత ఖర్చు అవుతున్నదేమో లనుకుని వూరుకున్నా, ఈ పద్ధతి నెలలు, సంవత్సరాలు గడచిపోయినా, సాగిపోతుండేసరికి, అసలు సంగతి తెలుసుకుని, భార్యను కట్టుబాట్లలో పెట్టారు. ఆయన శాంత స్వభావుడు కాబట్టి, అంతటితో ఆ గొడవ సమసిపోయింది. కాని అదే ఇంకొకరయితే, ఆ సంసారం ఎన్ని విపరీత పరిణామాల నెదుర్కోవాల్సివచ్చేదోగదా.

అలాకాకుండా, ఉత్త పుణ్యానికి భార్యల మనస్సు నొప్పిస్తూ, ఆమె పుట్టింటివారిని గురించి హేళన చెయ్యటమంటే కొంతమందికి ఎంతో సరదా. మేము చిన్నప్పుడు ఒక మాష్టరుగారి దగ్గర చదువుకునేటప్పుడు ఆయన భార్యను పిలవాల్సి వచ్చినప్పుడల్లా "నీ పుట్టింటివాళ్ళు నాశనమవ్వా, నువ్విటు తగలడవే" అని కేకేస్తుండేవాళ్ళు. అప్పుడు ఏమిటి ఈయనిలా పూరికినే శాపనార్థాలు పెడున్నారెందుకా అని ఆలోచిస్తుండేవాళ్ళం ఆమె "ధాం ధూం" అంటూ బయటకురాగానే, ఈయన మాతో "చూశారా! ఇందాకట్నుంచి గొంతు నగిలేటట్టు కేకలు పెట్టినా, బయటకు తొంగిచూడనిది, దాని పుట్టింటివాళ్ళ నొక్కమాట అనేసరికి భద్రకాళిలా ఉరుకులు పరుగులమీద, ఎలా చిందులేస్తూ వచ్చిందో" అని పకపకా నవ్వేస్తుండేవారు. నిజంగా అదేం విచిత్రమోగాని, మా మాష్టరుగారి భార్య మామూలుగా ఎన్ని పిల్చినా లెక్కచెయ్యనావిడ, ఆయన ఏదో ఒక బాణం వాళ్ళ పుట్టింటిమీదికి విసిరితేగాని, బయటకు వచ్చేదికాదు. రోజూ ఈ భాగోతం వాళ్ళకు సరదా, చూట్టానికి మాకు అలవాటు అయిపోయింది ఆ రోజుల్లో.

కాని అందరూ ఈ విషయాలను అంత తేలిగ్గా తీసుకుంటారని చెప్పటానికి వీల్లేదు. ప్రతి చిన్న విషయానికి అతి సున్నితంగా బాధపడి, ఎంతో ఫీలయ్యే స్త్రీలు చాలామంది వుంటారు అందులోనూ, తనవాళ్ళను గురించి ఎంతో న్యూనతగా హీనంగా మాట్లాడితే, ఇటుభర్తకు ఎదురు చెప్పలేక తమలో తాము మౌనంగా సహించి వూరుకుంటారు. పరస్పర అన్యోన్యత, అనురాగాలమధ్య ఇరుకుగాటల్లా ఇలాంటి చిన్న చిన్న విషయాలే, ఎన్నటికీమాని గాయాలుగా, మనసు మరుగున అలవోకగా ఎప్పటికి నిల్చిపోతవి ఈ సంగతి గ్రహించలేక, అర్థాంగుల మనస్సులను మాటిమాటికీ అశాంతితో నింపుతూ, అర్థంలేని సంతృప్తిని, ఆనందాన్ని అనుభవించే మగవారి మనస్తత్వాలలో మార్పు రావటం ఎంతైనా అవసరం. ★

అనుబంధం - ఆంతర్యం

(17–వ పేజీ తరువాయి)

వీళ్లందరూ వాన్న చెప్పుచేతల్లో ఉంటారు. అంతా ఆయనవైపు చేరారు. తనతో మాటా మంచీ తెంచుకున్నారు. ఈ రీత్యా తనవాళ్లందరికీ దూరమయ్యాడు రాంబాబు.

బందరు దగ్గర చిన్న పల్లెటూరు స్వగ్రామం. బందర్లో కాలేజీలో చదివాడు. అక్కడే రాధతో పరిచయ మయ్యింది.

అటు రాధ విషయం సరిగ్గా యిలాగే ఉంది. చిన్నాన్న ఆమెను పెంచాడు. ఆయన మాట కాదని రాంబాబుని చేసుకుంది.

ఇద్దరూ పెద్దవాళ్ల మాటల్ని త్రోసిరాజన్నారు. గుళ్లో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి పెద్దలుగా తోటి విద్యార్థిబృందమే నిలచింది. ఒక ప్రముఖ సంఘసేవకుని చేతిమీదుగా తమ పెళ్లి జరిగిపోయింది.

చాలమంది అభినందించారు. ఇలాంటి ఆదర్శ వివాహాలు ముందు ముందు యింకా జరగాలని ఉపన్యాసా లిచ్చారు.

ఇక్కడ్నుంచే నూతన అధ్యాయం కాస్త ఘాటీగా ప్రారంభమయింది. కాలేజీ విడిచిపెట్టం తర్వాత స్వంత యింటికి వెళ్లడానికి అర్హత కాస్తా పోయింది. స్వయంగా పెళ్లి చేసుకున్నవాళ్ళు స్వయంగానే జీవించడం నేర్చుకోవాలని, కనీసం ఆయింటి గుమ్మం కూడా తొక్కడానికి వీల్లేదని శాసించారు.

జీవితంలో ప్రశ్నార్థకం కొట్టొచ్చినట్టు నిలబడి భయపెట్టింది.

కొన్నాళ్లు ట్యూషన్లు చెప్పుకుని జీవించారు. ఆతర్వాత రాంబాబు అదృష్టంకొద్దీ, ఒక మిత్రుని ద్వారా యీ గుంటూర్లో పుగాకు కంపెనీలో ఉద్యోగం సంపాయించుకున్నాడు. మళ్లీఅక్కడ్నుంచి సుఖం వాళ్లకు దగ్గరయింది. అలా సంవత్సరం గిర్రున తిరిగిందో లేదో .... రాధకి క్షయ వ్యాధి దాపురించింది. మొదట్లో క్షయ అనుకోలేదు. ఉపేక్షించారు. రానురాను ఆ వ్యాధి తీవ్ర రూపం దాల్చింది. గుండెను తినేసిం దన్నారు. గత రెండు సంవత్సరాల నుంచీ రాధ బయట తిరగడం నోచుకోలేదు. ఆ గది నాలుగు గోడల మధ్యనే గడుపుతుంది. ఎన్నెన్నో మందులు వాడారు, వాడుతున్నారు. అంతా ముంచుకొచ్చిం తర్వాత ఏంచేస్తే మాత్రం ఏం లాభం ?

—"ఒరే రాంబాబూ !" తన నెవరో పిలిచారు.

వెనుదిరిగి చూశాడు.

ముకుందం ఆగమన్నట్టు చెయ్యూపాడు. రాంబాబు అతని హఠాత్ రాకకు ఆశ్చర్యపోతూ అక్కడే నిలబడ్డాడు. ముకుందం అతన్ని చేరుకున్నాడు.

"అబ్బ చాలా మారిపోయావురా ?" అన్నాడు.

రాంబాబు అదోవిధంగా నవ్వాడు.

ముకుందం బలవంతంమీద యిద్దరూ కాఫీ హోటల్లో అడుగుపెట్టారు. కాఫీ తాగుతూ—

"ఇంత హఠాత్తుగా ఊడిపడ్డావేరా ?"

"ఆఫీసు పనిమీద వచ్చా బ్రదర్. పనై పోయింది ఇంక వెళ్లిపోదా మనుకున్నంతలో నువ్వు కనిపించావ్ .... ఆ .... అన్నట్టు రాధాదేవిగారికెలా ఉంది ?"

"మామూలే."

"లోకంలో ఉన్న విషాదమంతా నువ్వే భరిస్తున్నావేమో ననిపిస్తుంది. ప్రేమించి పెళ్లి చేసుకుని ఆదర్శవంతుడ వయ్యేంతవరకూ బాగానే ఉంది. కాని నీకిన్ని యిబ్బందులు దాపురించడం మాత్రం టూ మిజరబుల్. ... "

మళ్లీ ముకుందమే అన్నాడు.

"అయినా నిన్ను అభినందిస్తున్నా. స్వతంత్రంగా ఆలోచించే పాటి బుద్ధి బలమూ, ధైర్యమూ ప్రతివాడికీ ఉండవ్. పొగడ్తనుకోమాకు. నా విషయమే తీసుకో. కుసుమంటే ప్రాణం పెట్టేవాడ్ని. పెళ్లిమాట దగ్గర మాత్రం నాన్నకి లొంగిపోయాను."

"ఇప్పు డివన్నీ ఎందుకులే ముకుందం!"

ఇంతలో ముకుందాని కేదో జ్ఞాపకానికి వచ్చింది కాబోలు—

"హారి నా మతిమరుపు మండా ! అసలు విషయం చెప్పడం మరిచి ఏవిటేవిటో మాటాడేస్తున్నా. నీకిది తెలుసా. రేపు పదిహేడో తారీఖున మీ చెల్లాయి పెళ్లి !"

రాంబాబు ఉలిక్కిపడి ముకుందం వంక ఆశ్చర్యంగా చూశాడు.

"వివాలకం చూస్తూంటేనే తెలుస్తుంది. అంటే నీవరకూ యీ విషయం రాలేదన్నమాట. ఏం తండ్రిని సంపాయించుకున్నావ్‌రా — ఎంత దారుణం !"

"ఇంక ముందు ముందు చూడవలసినవి చాలా వున్నాయ్" అన్నాడు రాంబాబు కళ్ళనిండా నీళ్ళు నింపుకొని.

"వరుడు కాకినాడలో మెడిసిన్ చదువుతున్నాట్ట. కట్న మదీ జాస్తిగానే ముట్టచెప్తున్నారట్లే ఉంది."

"ఆఖరికి చెల్లాయి పెళ్లి కూడా చూడ నోచుకోలేని దౌర్భాగ్యానికి దిగజారాను ముకుందం."

"అదేంమాట ! నిన్ను వాళ్ళు పిలవకపోతేనేం. వెళ్లటానికి నీకు హక్కుందికదా. అయినా మీనాన్న కింత పట్టుదల పనికిరాదురా !"

"ప్రేమించి పెళ్లి చేసుకోడం తప్పా ?"

"మీనాన్న, మానాన్నలాటి వాళ్లందరికీ తప్పే మరి ! తల గొట్టేసినంత పని. ఇదంతా చాదస్తంరా రాం ! మన మేమైనా అంటే అదిగో 'మాట మీరిపోతున్నార' ని అభాండం—సాగనీ .... వీళ్ల రాచరికం ఎన్నాళ్ళు సాగుతుందో .... సరే మరి. నాకు బండికి టయమవుతుంది. వస్తా .... పెళ్లికి మాత్రం తప్పకుండా రా" అంటూ బిల్లు చెల్లించి రిక్షా ఎక్కి వెళ్లిపోయాడు ముకుందం.

రాంబాబు మనస్సు చివుక్కుమంది. రక్త సంబంధాన్ని సైతం త్రెంచివెయ్యటానికి నాన్న మనసెలా ఒప్పింది ? ఆయన ఉద్దేశ్యంలో రాంబాబు పెద్ద తప్పే చెయ్యవచ్చు. అంత మాత్రాన చెల్లి పెళ్లి విషయం కనీసం తెలియజేయటానికూడా తగనివాడా ? రాంబాబు హృదయంలో అతని తండ్రిమీద విపరీతమైన కోపం వచ్చింది. ఇదంతా ఆయన మూర్ఖత్వం, వయస్సు వచ్చినంత మాత్రాన మంచీ — చెడ్డలు నిర్ణయించడం తేలిక్కాదు. ఏమైనా సరే చెల్లాయి పెళ్లి చూడవలసిందేనని నిశ్చయించుకున్నాడు.

* * *

"ఎక్కడి కెళ్లారూ ?"

" .... "

"ఈ నాలుగు రోజుల్నుంచీ మీ రదోలా ఉంటున్నారు. డబ్బు గురించి బెంగ పెట్టుకుంటున్నారా?"

"లేదు."

"కాదు. నాకు తెలుసు. డబ్బుకోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా యింకా మందులతో పనేవిటండి మీ పిచ్చిగాని !"

"రాధా ! పదేపదే యీ ధోరణితో నన్ను విసిగించేస్తున్నావ్. నా పాట్లేవో నే పడ్తాను. నువ్వు మాటాడకు దయవుంచి."

"మీకు భారమైపోయాను."

"రాధా."

"అవును నిజం. నన్నీ పాడు వ్యాధి త్వరగా తీసుకుని పోయినా ...... "

"అబ్బబ్బ . . నీతో ఏది మాటాడినా చిక్కుగా ఉంది ఉద్రేకం ఎక్కువ నీకు. ఏంచెప్పినా అర్థం చేసుకోలేవు. నీ ప్రాణానికి జరిగే ముప్పు ఏమీ లేదు క్షయకన్నా భయంకరమైన వ్యాధులు నయమయ్యేందుకు ఎన్నో మందులు కనిపెట్టారు. నీ కిష్టమైతే శానిటోరియం—"

రోడ్డుమీద మూగిన జనాన్ని ఆ దారినే పోతున్న ఒక పోలీసు హెచ్. సి. చూచి, అక్కడున్న ఒకరితో:


"ఏమండీ! ఏం జరిగింది?"

ఒకరు :- ఎవరో మత్తుగా త్రాగేసి రోడ్డుమీద పడిపోయాడు మతి లేకుండా.

పోలీసు :- (జనాన్ని తోస్తూ) తప్పుకోండి. తప్పుకోండి. వెధవలు ఎన్నిసార్లు కేసుపెట్టి జరిమానాలు వేయించినా బుద్ధి రాదు.

మరొకరు (పోలీసుతో):- ఓ, తమరా! ఆ త్రాగుబోతు ఎవరోకాదండి. మీ నాన్నగారే.

బిక్షర్, (నూచ్ ఖండ్)



అనుబంధం - ఆంతర్యం

"వద్దు. నా చివర్రోజులు మీ దగ్గరే గడప నివ్వండి. అక్కడ దిక్కుమాలిన చావు నాకొద్దు. మీ పాదాల దగ్గరే చచ్చిపోవాలని ఉంది"

"మాటకు ముందు చావూ చావని నన్ను భయ పెడ్తున్నావ్ రాధా! నేనీ మాటలు వినలేనింకా. సహనం చచ్చిపోతున్నది. నీ ధోరణి నా ప్రాణాలు తీస్తుంది. ఇది నీకు న్యాయంకాదు. జీవితంలో నలిగిపోయాను. నామీద జాలి లేదా రాధా! ! అసలే ఓపక్క నాఅన్నవాళ్ళందరికీ దూరమై నరకయాతన అనుభవిస్తున్న నాకు నీవల్ల కూడా సుఖం లేకుండా చెయ్యకు. నన్ను ఏడిపించకు నాకు శాంతి కావాలి రాధా. . . . . ." అన్నాడు.

రాధ ఆమె ఏడ్పుని దాచిపెట్టుకోడానికి సర్వ విధాలా ప్రయత్నిస్తోంది రెండు క్షణాలు అలాగే నిశ్శబ్దంగా గడిచాయి. రాంబాబు అన్నాడు.

"క్షమించు రాధా. ఏదేదో అన్నాను. నేనేకాదు నువ్వూ నీ వాళ్లకు దూరమయ్యావు ఇలా మనకే నాడు రాసిపెట్టాడో విధాత! ఎప్పటికప్పుడే నిన్ను చూచైనా సర్వం మరచిపోదామనుకుంటాను. ఇది నావల్ల కానిపని. పోనీ ....అన్నీ భరించాల్సివచ్చింది. అటు నాన్న మనసు రోజు రోజుకీ రాయిలా తయా రవుతుంది. చెల్లాయిపెళ్ళి జరుగుతుందిట మాట మాత్రానికైనా తెలియచేయలేదు"

"పెళ్లా! సుశీలపెళ్లా"

"అవును. అందరూ నన్ను మరిచిపోయారు. అందరికీకానివాడినయాను"

"రాం!" అంది జాలిగా.

"నాకివేం పెద్ద బాధ కలిగించవు రాధా! చెల్లి పెళ్లికి వాళ్ళు పిలవకపోయినా వెళ్ళిరాగలను కాని— నువ్వుమాత్రం నవ్వుతూ మాటాడితే చాలు. అన్నీ మరిచిపోతాను"

"మీరనుకునేంత అదృష్టవంతరాలినికాను"

"నాకోసమైనా నవ్వు రాధా"

ఆమె పేలవంగా నవ్వింది.

"నటించలేను. ఇప్పుడనుకుంటూన్నాను—మనం మన పెళ్లి విషయంలో ఏదో పొరపాటు చేశామని."

"రాధా"

"నిజంగా పొరపాటే జరిగిపోయింది! ప్రతిఫలం అనుభవించకతప్పదు రాం! అనుభవించాలి అంతే" ఆమె కళ్ళు గట్టిగా మూసుకుని అంది

రాంబాబు ఆగదినుంచి బయటకొచ్చాడు. హాల్లో మంచంవాల్చి కూర్చోబోయాడు. అదే సమయంలో ఆఫీసు జవాను రాజన్న వచ్చాడు

"మీకోసం ఎవరో ఆడంగులొచ్చారు బాబు. కంపెనీకాడికి వస్తే తమరు సెలవులో వుండారని చెప్పాను. ఇల్లు చూపించమంటె ఎంటెట్టుకొచ్చాను. రమ్మంటారా?" అన్నాడు రాజన్న.

"నాకోసమా? ఆడవాళ్లా!" ఆశ్చర్యపోయాడు రాంబాబు

"అవును రమ్మంటారా?" అని రాజన్న అడుగుతుండగానే ఆమె లోపలికి వచ్చింది రాంబాబు ఆమెను చూచాడు. క్షణంసేపు అతనినోటినుంచి మాట రాలేదు. ఆనందానికి చిహ్నంగా కళ్ళు కన్నీటితో నిండిపోయాయి వచ్చినావిడ రాంబాబుని ప్రేమగా చూస్తూ గుమ్మందగ్గరే నిలబడింది.

"అక్కా" గావుకేకలాటిది పెట్టాడు రాంబాబు.

"తమ్ముడూ"

"నువ్వా? నాకోసం వచ్చావా?"

"అవును" అందామె నవ్వుతూ.

రాంబాబు ఆమెముందు వాలిపోయాడు. పసిపిల్లాడిలా ఏడిచాడు ఆమె రాంబాబుని లేవనెత్తింది. లాలనగా అతని తల నిమిరింది అతనింకా ఏడుస్తూనే వున్నాడు.

"ఊరుకోరా. . . .తప్పుకదూ" అంది అతని కళ్ళు పైటచెరగుతో తుడుస్తూ

"నువ్వు నిజంగా అమ్మవేనే! అమ్మ నాకోసం స్వర్గంనుంచి పరుగెత్తుకొచ్చింది" అన్నాడు ఏడుపు నాపుకుంటూ

రాజన్న ఆమె తెచ్చుకున్న పెట్టె జోడా యింట్లో పెట్టి వెళ్ళిపోయాడు

"ఎన్నాళ్ళయిందిరా నిన్నుచూచి చాలా చిక్కిపోయావు" అందామె

అతను మాటాడే స్థితిలోలేడు ఏం చెయ్యాలో గూడా తోచలేదు.

"రాధా!.... అక్కయ్య వచ్చింది మా అక్క వచ్చింది రాధా!" అంటూ గబగబా రాధ గదిలోకి వెళ్ళిపోయాడు

"వదిన వచ్చిందా?"

"అవునురాధా. . . . అక్కా. . . ." అని పిలుస్తూ మళ్ళీ హాల్లోకి రాబోయాడు.

సావిత్రి గుమ్మందగ్గరే నిలబడివుంది.

"ఇక్కడేవున్నారా"

"ఇదిగో నా రాధ! పాపం. . . . .లేచే స్థితిలో లేదు"

"కనుపిస్తూనేవుందిగా" అంటూ ఆమె రాధ దగ్గరికి వచ్చింది

రాధ కళ్లలో నీరు నిండాయి.

"రాధకు క్షయ!" రాంబాబు అన్నాడు.

సావిత్రి రాధవైపు జాలిగా చూచింది.

"మేమిన్ని బాధలు పడ్తూంటే సహాయం చెయ్యకపోయినా, సానుభూతైనాచూపేవారు లేరు. అందరూ దూరమయ్యారు. మేం నేరస్థులం. మమ్మల్నంటుకుంటె మైలపడిపోతారు" అన్నాడు కసిగా.

సావిత్రి హాల్లోకి వచ్చేసింది. అతను ఆమెను అనుసరించాడు

"నిన్ను చూస్తూంటే నా గుండె తరుక్కుపోతుందిరా తమ్ముడూ. నీకు చాలా అన్యాయం జరుగుతుంది. చిన్నతనంలో—అల్లరిలో మమ్మల్నందర్నీ మించినవాడనిపించుకున్నావ్. ఎప్పుడూ అల్లరిచేస్తూ, నవ్వుతూ వుండేవాడివి. నీకిన్ని కష్టాలెలా దాపురించాయిరా?" ఎంత వద్దనుకున్నా దుఃఖం ఆగడం లేదామెకు

"నన్నెప్పుడూ అంటిపెట్టుకుతిరిగేవాడివి. నీపైన మమత చంపుకోలేకపోతున్నా. ఎప్పట్నుంచో నిన్ను చూడాలనుకుంటూన్నా. నాన్న పెట్టిన నియమాలు తోసేయడానికి జంకుతున్నాను. చెల్లిపెళ్లికి వెడుతూ, దారిలో నిన్ను కలుసుకోవాలనీ, నీతో కాసేపు మాటాడాలని వుందనీ బావగారితో చెప్పాను. ఆయన చాలా మంచివారు. అలాగే పలుకరించి వెళ్లమన్నారు. నాన్నకీ విషయం తెలియకూడదు"

"నా గురించి యింకా తలిచేవారున్నారని తెలుసుకున్నాను. ధన్యుడ్నక్కా!"

"ప్రేమించి పెళ్ళి చేసుకున్నానన్నమాటేగాని, సుఖానికి నోచుకోలేదురా తమ్ముడూ"

"నా కేమీవద్దు. నీ ఆదరణ చాలు. రాధ క్షేమం చాలు"

"నిన్ను చూస్తుంటే జాలి పుట్టుకొస్తుంది." అప్రయత్నంగా ఆమె కళ్ళనుండి నీళ్ళు కారాయి.

"నన్ను ఏడ్పవద్దన్నావ్. నువ్వు ఏడుస్తున్నావ్. తెలుసక్కా నీ మనసు నవనీతం. సుశీల పుట్టింది. అమ్మ కన్నుమూసింది. అమ్మలాగా పెంచావ్ మా యిద్దర్నీ. నాకిప్పుడు నువ్వు చూపించే సానుభూతితో కరిగిపోతున్నాను. బాధలన్నీ మరిచిపోతున్నాను"

"గిరి మొన్నీమధ్య మా యింటికొచ్చాడు. వాడికీ నిన్ను చూడాలనివుంది. కాని నాన్నమాట వాడ్ని కట్టేసింది."

"నాన్నకెందుకింత పగ?"

"పగకాదు పట్టుదల"

"అమ్మ బ్రతికుంటే నాకింత అన్యాయం జరిగుండేదికాదు అమ్మ బ్రతికున్నరోజులు నాకు గుర్తున్నాయి. అల్లరిపాళ్ళతో తిరిగి సిగరెట్టు కాల్చా నన్న కోపంకొద్దీ నాన్న నన్ను కొట్టారు. నేనా దెబ్బలు భరించలేకపోయాను గావుకేకలు పెట్టాను. అమ్మ వంటింట్లో చూసింది ఆవిడ మనసు ఆగలేదు. అడ్డుపడింది. నాకు తగిలే సగం దెబ్బలు ఆవిడకి తగిలాయి. 'నేను బ్రతికుండగా వాడినిలా చావకొట్టొద్దని ఆమె అన్న మాట నేను మరచిపోలేను అల్లాంటి అమ్మే ఇప్పుడు బ్రతికివుంటే నాన్న పట్టుదల విసురోయ్యేదక్కా!"

"తమ్ముడూ!"

"నిజమక్కా! అమ్మవుంటే యింత విపరీతం జరిగుండేదికాదు .... నా గురించేంగాని వచ్చిన దానివి వచ్చినట్టే వున్నావ్ లే. స్నానం చెయ్యి, భోంచేసి కాస్త నడుం వాల్చుదువుగాని బడలిక తీరి పోతుంది"

* * *

"నిజంగా బాల్యం మరిచిపోలేనక్కా! నీముందిలా కూర్చుంటే చిన్నప్పటిరోజులు గుర్తుకొస్తున్నాయి. నా కప్పుడు పిచ్చిపిచ్చికథలు చెప్పేదానివి. చెప్పేకథని మధ్యలో ఆపి నన్ను ఏడిపించేదానివి. ఈనాడు కూడా నీ ముందిలా పసిపిల్లవాడినై పోవాలని వుంది. నీవొళ్ళో తలపెట్టుకుని నువ్వు చెప్పే కథను వింటూ నిద్రపోవాలనివుంది" అతను నవ్వుతూ అన్నాడు.

"నువ్వు అమాయకుడిరా తమ్ముడూ! కష్టాలన్నీ ఒక్కసారిగా ముంచుకొస్తే మనిషి భయపడ్డం సహజం కాని వెలుగుని చూడాలనుకున్న ప్రతి మనిషి చీకటి గురించి తెలుసుకోవాలని వుంటుంది" అంది సావిత్రి

"ఇలాటి మంచి అక్కయ్య లభించటానికి గత జన్మలో ఏదో పుణ్యం చేసుకున్నాను"

"ఎందుకలా చెప్పగల్గుతున్నావు. నీమీద ఎవరికీ కోపంలేదు. నాన్న తన పట్టు విడ్డానికొచ్చి హద్దు ... నిన్ను చేరదీసుకోలేదు నేనూ, శేషగిరి, ... నాన్నమీదవున్న గౌరవం ..., భయం ..., ఆయన మాటకి ఎదురు చెప్పలేకపోతున్నాం ... ప్రత్యేకంగా నీమీద ఎవరికీ ఏ విధమైన పగగాని, ద్వేషంగాని లేదు."

"నిజమా?"

"ఇంత గాంభీర్యం నటిస్తున్న నాన్న హృదయంలో ఎంత బాధ రగుల్తోందో నువ్వు అర్థం చేసుకోలేవు"

"నువ్వు మభ్యపెడ్తున్నావ్"

"కాదు సత్యం చెప్తున్నా!— ఇంక నాకు వేళ ఖుంది. వెళ్లేముందు నీ కష్టాలు తొలగిపోవాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. ఇందు యీ రెండు వందలూ వాడుకో. ఇది బావగారే నీ కివ్వమని చెప్పారు. కాదనకు తీసుకో" అతని చేతిలో రెండువందల రూపాయిల నోట్లు పెట్టింది సావిత్రి.

"నీ ఋణం ఎలా తీర్చుకోగలను" అన్నాడు అతను.

"అనుబంధానికీ, డబ్బుకీ జతపర్చకు తమ్ముడు. డబ్బు చెయ్యలేనిపనులు చాలా వున్నాయి. అనుబంధం చెయ్యలేని పని ఏదీలేదు. బండికి టయిమయింది. స్టేషనువరకూ రా!" అంటూ ఆమె తెచ్చిన కొద్ది సామాను సర్దుకుంది. జట్కామీద స్టేషను చేరుకున్నారు.

హాలులో నాటక ప్రదర్శనము జరుగుతోంది. చూచేవారు చాల విసుగు చెంది ఉన్నారు. కథానాయకుడు కథానాయికతో అబ్బా తలనొప్పి, తలనొప్పి అంటూ రెండుచేతులతో తలను పట్టుకొన్నాడు. వెంటనే ప్రేక్షకలోకమునుండి ఒక సన్నని గొంతుక రేడియోలో వినబడినట్లు ఇలా వినపడింది. "తీసి కొండి ఆస్ప్రో ఆస్ప్రో, ఆస్ప్రో"

పి. హనుమాన్, (విశాఖపట్నం)

సావిత్రి రైలెక్కింది రైలు కదిలింది రైలు దూరమయ్యేంతవరకూ చెయ్యూపుతూనే వున్నాడు రాంబాబు కనుమరుగయ్యాక కళ్ళు తుడుచుకొని యింటివైపు నడక సాగించాడు

అక్కయ్య తనకు తెలియని విషయాలు చాలా చెప్పింది ఆమె లోకాన్ని బాగా చదువుకుంది ఆమెలా తనకింత ధైర్యాన్ని చెప్పేవాళ్ళుంటే, తను మథన పడడు.

సుశీలపెళ్ళి యింకా నాలుగు రోజులుంది!

ఆ పెళ్ళికి అంతా వస్తారు అందరూ దంపతులను హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తారు

తనకా అర్హతలేదా?

ఎందుకులేదు తనూ వెళ్ళాలి సుశీలను వధువు రూపంలో చూడాలి ఆమెను ఆశీర్వదించి రావాలి

ఇదే విషయాన్ని రాధకి చెప్పాడు ఆమె విని అంది. "మీ రక్కడకు వెళ్లడం నాకు నచ్చలేదు. పిలవని పేరంటానికి—"

"నన్ను పిలువకపోతే ఏం? నే వెళ్ళకూడదా? కూడదని ఎవరంటారు? నా చెల్లి పెళ్ళి నేను చూడకూడదా? ఏమైనాసరే వెడతాను."

"వెళ్ళండి. కాని... .యింట్లో నే నొక్కర్తినే, యింత జబ్బుతో. . . ."

"రాధా! నువ్వు నాపైన అధికారం చేస్తున్నావా? నన్ను వెళ్ళనివ్వు. ఆ పెళ్లిని చూడనివ్వు. ఒక్కరోజు... ఉదయంవెళ్ళి రాత్రికి వచ్చేస్తాను. అడ్డుచెప్పకు" అన్నాడతను.

తర్వాత ఆమెకు కావలసిన టానిక్కులు, ఇంట్లోకి వస్తువులు అన్నీ కొనుక్కొచ్చాడు. ఆరోజు అతను అనుభవించినంత ఆనందం గత రెండు సంవత్సరాల్లోనూ అనుభవించనేలేదు.

సుశీల పెళ్ళిరోజు.

ఆ ఊరు స్టేషన్లో రైలు దిగాడు రాంబాబు. చేతిసంచితో స్టేషను బయటకొచ్చాడు. పాలేరు రాముడు బండి కడ్తున్నాడు. అతని బండితోపాటు మరో నాలుగైదు బళ్ళు అప్రక్కనే వున్నాయి.

"రాముడూ" అతని దగ్గరిగా వెళ్ళి పిలిచాడు రాంబాబు.

రాంబాబునిచూచి ఆశ్చర్యపోయాడు రాముడు.

"మీరా.....చినబాబూ" అని గొణిగాడు.

"బాగున్నావా?"

"ఉండండి. అన్నయ్యగారు స్టేషన్లో వుండారు. పిలుస్తా. . . .పెదబాబూ .... పెదబాబూ"అంటూ ప్లాట్ఫారమ్పై వెళ్ళి శేషగిరిని తీసుకొచ్చాడు.తమ్ముడ్నిచూస్తూ శేషగిరి గతుక్కుమన్నాడు.

"నువ్వా వచ్చావుట్రా! పెళ్ళివారు యీ రైలుకే వచ్చారు. బళ్ళు తీసుకొచ్చాం. రాముడూ నువ్వు వాళ్ళ సామాన్లని బళ్లల్లోకి వట్టించుకో....... త్వరగా ......" అంటూ తమ్ముడ్ని కాస్తదూరంగా తీసుకుపోయాడు.

"అందరూ వచ్చారు. నిన్నుకోరుకునేది ఒక్కటేరా.......చెల్లాయి నాకెంతో నీకూ అంతే. కాని అల్లరిచెయ్యకు. నిన్ను యీ పెళ్ళి చూడొద్దని శాసించను. పెద్ద మనుషులముందు రగడచేస్తే నాన్న అభిమానం దెబ్బతింటుంది. ఈమధ్య ఆయన ఆరోగ్యం కూడా బాగోలేదు. అర్థంచేసుకోరా తమ్ముడూ!"

"నన్నంతనీచంగా వూహించకు అన్నాయ్!"

"అదృష్టవశాత్తు చెల్లాయికి మంచి సమ్మంధమే దొరికింది. అవతలివాళ్ళు. పరువూ ప్రతిష్టలూ కలవారు."

"నేను చెడపురుగునా? మీ అందరికీ . ."

"ఉష్ ....నిన్ను ప్రార్థిస్తాను. ఏంమాటాడకు వాళ్ళు వస్తున్నారు" అంటూ తమ్ముడ్ని హెచ్చరించాడు.

పెళ్ళివారు బళ్లెక్కారు. బళ్ళు వూరివైపు కదిలాయి.

ఇంటిముందు ఆకర్షణీయంగా పందిరివేశారు. అలంకారం చాలా అందంగావుంది పెళ్ళిపీటలమీద వధూవరులు కూర్చున్నారు పురోహితులు మంత్రాలు చదువుతున్నారు. వాద్యాలు మోగుతున్నాయి. అంతా హడావిడిగా ఆనందంగా వుంది

పందిట్లో ఓమూలగా రాంబాబు నిలబడి పెళ్ళి చూస్తున్నాడు. అతని మనసిప్పుడు తృప్తిచెందింది.

అనుబంధం - ఆంతర్యం

అతనికళ్ళు ఆనందంతో మెరిసిపోతూన్నాయి. అప్పటికే అక్కడక్కడ గుస గుసల దుమారం చెలరేగుతుంది.

"బాగున్నావా బావా!" అన్నారెవరో....

ఉలిక్కిపడ్డాడు. వెనుతిరిగి చూశాడు.

"నువ్వా పార్వతీ. నేనింకా ఎవరో అనుకున్నాను. అబ్బా చాలా పెద్దదానివై పోయినట్టున్నావు....." అని ఏమిటో చెప్పబోతూండగా—

"అమ్మాయ్ నీ కక్కడ పనేమిటి? ముందు లోపలికి పద!" అంటూ మావయ్య పార్వతిని యింట్లోకి తీసికెళ్ళిపోయాడు. వెళ్లబోతూ రాంబాబు వైపు అసహ్యంగా చూశాడు.

రాంబాబు తల దించుకున్నాడు. ఎవరో నవ్వారు చిన్నగా.

వరుడు వధువుమెళ్లో మంగళసూత్రం కట్టాడు. మంగళ వాద్యాలు మ్రోగిపోతూన్నాయి. అక్షతలు వర్షంలా రాలాయి.

రాంబాబు తృప్తిగా గాలి పీల్చాడు.

సుశీల ఆ పెళ్ళి బట్టల్లో కళకళలాడుతుంది. ఏదో నవ్యత ఆమెను ఆవరించింది. చిన్నప్పుడు ఆమెను చీటికీమాటికీ ఏడిపిస్తూండేవాడు. ఒక్కక్షణం కూడా వాళ్లిద్దరికీ పడేదికాదు. కాని—రాంబాబు కనిపించనిక్షణం సుశీలకు వెలితిగా వుండేది. ఎంత కీచులాడినా రాంబాబుతోనే ఆడుకునేది. అలాంటి సుశీల ఇప్పుడు గృహిణి అయింది. రాంబాబు ఆనందించాడు.

ఒక్కసారి పందిరంతా గాలించిచూశాడు.

పీటమీదనిలబడి పెళ్లిచూస్తున్న బావగారుకళ్లతో పలుకరించారు. అన్నయ్య హడావిడిలో మునిగిపోయాడు. నాన్నసలు కనుపించడమేలేదు. వదిన వాళ్లు దూరదూరంగా తిరుగుతున్నారు. ఎవరో పరాయివాణ్ని చూచినట్లు చూస్తున్నారు.

రాంబాబుకి అవమానమనిపించింది. అంతలోనే దాన్ని తోసిపారేశాడు. పెళ్లి చూచాడు. అందుకోసమే యిక్కడ కొచ్చాడు. చాలిది....

హఠాత్తుగా తన పాదాలను ఎవరో తాకినట్టయింది. తొంగిచూచాడు.

సుశీల!......

"ఆశీర్వదించరా అన్నాయ్......" అంది సుశీల.

పందిట్లో సంచలనం కలిగింది.

అదేమీ గమనించలేదు రాంబాబు. అతని హృదయం గొంతుకలోకొచ్చి పడినట్టయింది. చెల్లాయిమీదవున్న ప్రేమంతా హృదయాన్ని బద్దలు కొట్టినట్టయింది. ఏమాటా పైకిరాలేదు. తబ్బిబ్బైపోయాడు.

ప్రేమగా ఆమెను చేతుల్తో లేవదీశాడు.

ఏదో అనబోయాడు. కాని అతనికి ఏడుపు ముంచుకొచ్చింది.

"సుశీ......."

పులి గాండ్రించినట్టయింది. రాంబాబు ఉలిక్కిపడ్డాడు. పెళ్లిపందిరంతా నిశ్శబ్దమయ్యింది.

కాస్త దూరంలో నాన్న కోపంతో వణికిపోతున్నాడు!

'వాడెవడే నిన్ను ఆశీర్వదించటానికి. ముందిలా కదిలిరా......నీకున్నది ఒక్క అన్నయ్యే. నాకు మిగిలింది ఒక్కకొడుకే. అప్రాచ్యుడ్ని కన్నందుకు ఎందుకు నాతల పగిలిపోలేదని విచారిస్తున్నా. రా ముందు....''

నాన్నకు ఆవేశం ఎక్కువవుతుంది.

సుశీల నాన్నవైపు కదిలివెళ్ళింది కళ్ళు తుడుచుకుంటూ.

రాంబాబు అలాగే బొమ్మలా నిలబడ్డాడు.

"సిగ్గుండక్కర్లా....... ఎందుకొచ్చినట్టిక్కడికి? అన్ని సంబంధాలు తెంచుకున్నావ్‌గా. నీ కెవరూ లేరుగా. పో.....వెళ్ళిపోరా.......నా కంటిక్కనిపించకు. వెళ్ళిపో.........నిన్ను చూడలేను. పో....కదలకపోతే చంపేస్తాను. వెళ్ళు" పెద్దగా అరిచి కుర్చీలో కూలబడిపోయాడు నాన్న.

"నాన్నా. . . . ." రాంబాబు బాధగా అన్నాడు.

"మీరిలారండి. లోపలికి పదండి నాన్నా"అంటూ ఆయన్ను లోపలికి తీసుకెళ్ళిపోయాడు శేషగిరి.

"కన్నతండ్రి ఎంత బాధ పడితేనేం. . . . పెళ్లాముందిగా చాలు. చుట్టరికానికి మట్టికొట్టి, ఆదర్శం, గిదర్శం అని ప్రాకులాడి మళ్లీ ఏ ముఖంతో వచ్చావ్ నాయనా యిక్కడికి. వెళ్ళు. . .వెళ్ళు....." మావయ్య కసిగా అన్నాడు.

పిల్లాడు: అమ్మోయ్ కాకి సబ్బు ఎత్తుకుపోయింది.

తల్లి:- కొన్న సబ్బు కూడా ఎత్తుకు పోయిందా!

జి. సి. హెచ్. భాస్కర్ (కత్తిపాడు)

"మావయ్యా. . . ." సావిత్రి కోపంగా అరిచింది.

"వాడినంటానికి మీ కెవరిచ్చారు అధికారం? మీ కసలు మనసులున్నాయా? అమాయకుడ్నిచేసి ఆడించేస్తున్నారు. ఇది న్యాయంకాదు మీకు" సావిత్రి చెడామడా అనేసింది.

"సావిత్రీ......నువ్విలా ఒక మారాస్తావ్" బావ పిలిచాడు.

అందరూ ఏదో వింత జంతువును చూచినట్టు రాంబాబువైపు చూస్తున్నారు. రాంబాబుకి యింకా అక్కడే నిలబడాలనిలేదు. అలానిలబడితే యింకా ఎంతటి విపరీతాలైనా జరిగిపోతాయి.

అందుకే అతను ఆ పందిట్లోనుంచి నిర్జీవంగా కదిలాడు.

"ఒరే తమ్ముడూ!" అంది బాధగా సావిత్రి.

"అన్నాయ్......." ఏడ్వలేక ఏడుస్తుంది సుశీల.

దుఃఖాన్ని మింగుకుని అడుగులు లెక్కపెట్టుకుంటూ అతను వెళ్ళిపోయాడు.

* * *

రైల్లో కూర్చున్నాడన్నమాటేగాని అతని మనసంతా పెళ్లిపందిట్లోవుంది. పెద్దల వింత మనస్తత్వాలను పరిశీలిస్తుంది.

నాన్నకీ, రాధకీ తనంటే ప్రేమ. ఇద్దరూ ప్రాణాలు పెట్టేవాళ్లే!

అయితే—

నాన్న తనమీద వున్న ప్రేమని 'ఎవరేమనుకుంటారోనని' బలిచేసుకుంటున్నాడు.

రాధ 'ఎవరేమనుకున్నా సరేనని' తనని గాఢంగా ప్రేమిస్తుంది! తను కష్టపడుతుంటే చూడలేక తనని తనే తిట్టుకుంటుంది.

తనని పెంచి పెద్దచేసిన తండ్రి అవమానించాడు. పురుగుని చూచినట్టు చూస్తున్నాడు. వెలివేశాడు. అయినవాళ్లనెవర్నీ తనతో మాటాడొద్దని శాసిస్తున్నాడు.

మధ్యలో వచ్చిన రాధ తన కోసమే బ్రతుకుతున్నట్టుంది. సర్వాన్ని త్యజించి తననే ఆశ్రయించింది.

గుంటూర్లో రైలుదిగేవేళకి బాగా రాత్రయింది. గబగబా యింటికి వెళ్లాడు. ఇంటిదగ్గర గుమిగూడిన జనాన్ని చూడగానే గుమ్మందగ్గర ఆగిపోయి "ఏం జరిగిందని' ఆత్రంగా అడిగాడు.

"ప్రమాదం తప్పింది. గండం గడిచింది" అన్నారెవరో.

అతను రాధ గదిలోకి పరుగెత్తాడు. మంచాన్నంటిపెట్టుకున్న రాధస్థితి దైన్యంగావుంది.

అతని గుండె నీరైపోయింది.

"రాధా! నే వచ్చాను రాధా!" అంటూ గావుకేక పెట్టి ఆమెమీద వాలిపోయాడు.

"ఉష్! మాటాడించకు. ఇప్పుడే స్పృహలోకి వచ్చింది. అయినా యీ స్థితిలో వంటరిగా విడిచి నీ పెత్తనాలేమిటి బాబూ! డాక్టరు వచ్చివెళ్లారు. మరేం వర్వాలేదని చెప్పారు. భయపడకు" ఇంటావిడ అన్నారు

"తప్పంతా నాదే పిన్నిగారూ! రాధ వద్దన్నకొద్దీ వినిపించుకోకుండా వెళ్లాను. ఇంకెప్పుడూ యిలా విడిచి వెళ్ళను. బుద్ధొచ్చింది—రాధ బ్రతకాలి పిన్నిగారూ!" అంటూ వలవల ఏడ్చాడు రాంబాబు.

"ఊరుకో బాబూ. . . . . ఊరుకో........ ఆమెను గాబరాపెట్టకు. డాక్టరు మందిచ్చివెళ్లారు. ఈ మాత్రలు గంటకొకటి చొప్పున వాడమన్నారు. ఇంద. వస్తానింక" అంటూ ఆమె వెళ్ళిపోయింది.

నిమిషాలు గడిచాయి.

"రాధా. . . . .ఇటుచూడు. నే వచ్చానురాధా!"

ఆమె నిమ్మదిగా కళ్ళు విప్పింది. చిరునవ్వుతో అంది.

"కడసారిగా. . . . .మిమ్మల్నిచూచేభాగ్యం నా ..కుంది రాం!"

"నువ్వు బ్రతుకుతావ్ రాధా! భయపడకు"

"పోకన్మానదు . . .దేహమే. . . .ఏధంబున. . .. పోషించి. . . . ."

"అలా అనకు రాధా! నువ్వు పోతే నేబ్రతకలేను. నా కెవ్వరూ వద్దురాధా! నువ్వు కావాలి. నీ కోసమే నేను. . . . ."

ఆమె జాలిగా అతనివైపు చూచింది. . . .

"అదృష్టం నాది. . . . .చివరిక్షణంవరకూ . . . మీ హృదయంలో చోటు. . . . .పోగొట్టుకోలేదు..."

ఆమె బరువుగా కళ్ళు మూసుకుంది. ★

సినిమా

అంతర్జాతీయ చలనచిత్ర మహోత్సవం

"చలనచిత్రాలు మానవునకు వినోదం కలిగించటంతోపాటు, విజ్ఞానం, మానసిక అభ్యున్నతి కలిగించాలి కేవలం వ్యాపారదృష్టితోనే చలనచిత్రాలు నిర్మించ" రాదని ఉపరాష్ట్రపతి డాక్టర్ ఎస్ రాధాకృష్ణన్, మనదేశంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ద్వితీయ చలనచిత్రోత్సవంలో గెలుపొందిన చిత్రాలకు నటీనటాది కళాకారుల బహుమతి ప్రదానోత్సవ సభ ప్రారంభోపన్యాసంలో అన్నారు

"కళాప్రమాణం కన్న ధనార్జనపైనే ఎక్కువ దృష్టి ఉంచి చిత్రాలు నిర్మించటంపట్ల ఈరోజుల్లో చాలామంది మొగ్గు చూపుతున్నట్లుంది మన చిత్ర నిర్మాతలు ఈ పద్ధతిని అచరించరని ఆశిస్తాను ధనార్జనపట్ల ఆక్షేపణ ఉండటం సహజమే కాని ప్రజల ఉన్నత కళాభిరుచులను పాడుచేసేంతగా వ్యాపారదృష్టి మంచిదికాదు" అన్నారు డా॥ రాధాకృష్ణన్

"ప్రపంచం రాజకీయాలు కల్లోలాలతో సంక్షుభితమై, అశాంతిమేఘావృతమై, అన్యోన్య సంహరణ లాలసతో ఉన్నప్పుడు వివిధ దేశాల కళాకారులు, పరస్పర భావాలను అవగాహన చేసుకొనే ఉద్దేశ్యంతో సుహృద్భావంతో ఇలా చేరటం ఎంతో ఆనందదాయకమైన విషయం ప్రమాదాలకు మూలం భయమే దీనికి బదులు మానసిక దార్ఢ్యం విశ్వాసం ఏర్పరచుకున్నట్లయితే చలనచిత్రాలక్కెంతో దోహదకారి అవుతుంది చలనచిత్రాలు జాతీయ సమైక్యతకు, ప్రపంచ సంఘీభావానికి హేతువులు కావాలి"

మన (భారత) చిత్ర నిర్మాతలు, దర్శకులు, కళాకారులు అత్యుత్తమ శక్తిసామర్థ్యాలు కలవాళ్లే ప్రపంచంలోని కళాకారు లెవ్వరికీ వారు తీసిపోరు కాని, వాళ్ళు హీనమైన అభిరుచులపట్ల మొగ్గు చూపకూడదు వాటిని ఏవిధంగాను సమర్థించకూడదు"

చలనచిత్ర నిర్మాణంతో సంబంధం గలవాళ్ళంతా తమ తమ శక్తిసామర్థ్యాలను, విజ్ఞానాన్ని కళానైపుణిని శాంతి, న్యాయం, ధర్మాలకు విరుద్ధంగా వినియోగించమనే శపథం తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది



ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రధాని నెహ్రూ వైజయంతీమాలకు సావనీర్ బహూకరిస్తున్న దృశ్యం.

రాగ భావ తాళములు సంభాషణాన్వితముగా తయారైన చిత్రాలు నిజంగా వీనులవిందుగా కనువిందువును కలిగిస్తాయి"

సభాప్రారంభం ముందు కేంద్ర సమాచార మంత్రి డా॥ బి వి కేస్కర్ సభాసదులను ఆహ్వానిస్తూ ఈ చిత్రోత్సవాలను జయప్రదం చేసినవారందరికీ కృతజ్ఞతలు తెల్పారు

"ఈ చిత్రోత్సవం పోటీలు నెరపే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిందికాదు. కనుక ఉత్తమ బహుమతులంటూ ఇవ్వటం జరగదు"

"చలనచిత్రోత్సవాలవల్ల వివిధదేశాల సంస్కృతీ విశేషాలను అర్థం చేసుకోవటానికి, పరస్పరం సన్నిహితం కావటానికి అవకాశం ఏర్పడుతుంది' అని కూడా, డా॥ కేస్కర్ అన్నారు

ఈ చిత్రోత్సవంలో పాల్గొన్న వివిధ కళాకారులకు, దర్శక నిర్మాతలకు సౌహార్ద చిహ్నాలను బహూకరిస్తూ ప్రధాని శ్రీ నెహ్రూ చలనచిత్రాలు కేవలం వినోదాత్మకంగా గాక, విజ్ఞాన ప్రబోధకంగా కూడా ఉండాలని అన్నారు

ఈ చిత్రోత్సవంలో పాల్గొన్న 38 దేశాలనుండి వచ్చిన 36 కథాచిత్రాలు, 60 సంక్షిప్తచిత్రాల పక్షాన వివిధ కళాకారులు సౌహార్దచిహ్నాలను ప్రధాని శ్రీ నెహ్రూనుండి అందుకున్నారు

ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపట్ల భారత ఫిలిం సమాఖ్య పక్షాన శ్రీ బిమల్‌రాయ్ విదేశీ ప్రతినిధుల తరఫున, అంతర్జాతీయ చలనచిత్ర నిర్మాతల సమాఖ్య ప్రతినిధి డా॥ గుంటెర్‌ష్వార్జ్ తమ కృతజ్ఞతలు తెల్పారు

సభానంతరం "భారతదేశంలో పిట్టలు అన్న సమాచార చిత్రం 'సమాప్తి' అనే కథాచిత్రం ప్రదర్శనలు జరిగాయి. ★

త్వరలో విడుదల
తండ్రులు—కొడుకులు

జడిపంతులు జీవితగమనం ఆధారంగా రఘురాం ప్రొడక్షన్స్ వారు నిర్మించిన తండ్రులు—కొడుకులు ఈ నెల 23 ప్రాంతానికి విడుదల కావచ్చు.

వివిధ కవిత్వ మార్గాల్లో ఒక జైన సమస్యా

వార్తాభరణం

పూరణం ఈ చిత్రంలో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది

మధ్య తరగతి కుటుంబ జీవిత చిత్రణం ప్రధానాశయంగా గల ఈ చిత్రంలో గుమ్మడి వెంకటేశ్వరరావు, చలం, పద్మనాభం, కుటుంబరావు, ప్రభాకరరెడ్డి, నిర్మల, కృష్ణకుమారి నూతన నటి శారద, గెస్ట్‌గా కాంతారావు పాల్గొంటున్నారు కథ సంభాషణలు ప్రత్యగాత్మ, దర్శకుడు, నిర్మాత హేమాంబరధరరావు సంగీతం టి చలపతిరావు ఛాయ సి నాగేశ్వరరావు కళ కె నాగేశ్వరరావు, అలంకరణం కె యస్ చౌదరి కూర్పు వి గోపాలరావు సహాయనిర్మాత ఎట్లూరి పూర్ణచంద్రరావు



రాజశ్రీ వారి "శభాష్ రాజా"లో దేవిక, కాంతారావు.

"బికారిరాముడు"

ఈ నెల 29 న విడుదల కానున్న "బికారి రాముడు" చిత్రానికి కొన్ని ఔట్ డోర్ సన్నివేశాలు చిత్రీకరించేందుకు ఆ సినిమా బృందం హైదరాబాద్ వెళ్ళింది నాగభూషణం (రక్తకన్నీరు) రాజసులోచనం యుగళ గీతాభినయన దృశ్యాల్ని వీరు చిత్రీకరిస్తారు

కథా రచయిత పాలగుమ్మి పద్మరాజు ప్రప్రథమంగా దర్శకత్వం నెరపుతున్న ఈ చిత్రంలో కాంతారావు, ఎయస్ ఆర్, నాగభూషణం, రమణారెడ్డి, మీనా కుమారి, జి వరలక్ష్మి, రాజసులోచన, ఋష్యేంద్రమణి, ఇంకా పలువురు పాల్గొంటున్నారు పాటలు పద్మరాజు, ఆరుద్ర, మల్లాది సంగీతం గోపాలం కూర్పు జోగ ఛాయ బుల్ సులే అప్పారావు కళ చలం

అన్నపూర్ణా ప్రొడక్షన్ నెం '8'

శతదినోత్సవ చిత్ర సంస్థ అన్నపూర్ణా ప్రొడక్షన్స్, బెంగాలికథ 'ఆ షేర్‌సుర్' ఆధారంగా నిర్మిస్తున్న 'ప్రొడక్షన్ నం 8' నిర్మాణం శరవేగంగా సాగుతోంది ప్రఖ్యాత నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు ద్విపాత్రాభినయం ప్రత్యేకాకర్ష



"శోభనవారి "భీకారి రాముడు"లో రాజసులోచన

...గాగల ఈచిత్రంలో రాజసులోచన, ఇ వి సరోజ జి వరలక్ష్మి, గుమ్మడి, రేలంగి, సూర్యకాంతం, రమణారెడ్డి, పద్మనాభం, నూతన నటి శారద, నూతన నటుడు కే వెంకటేశ్వరరావు, మురళీ కృష్ణ, పాల్గొంటున్నారు సంక్రాంతి నాటికి విడుదల కానున్నదీచిత్రం సంభాషణలు డా కొర్రపాటి గంగాధరరావు ఛాయ సెల్వరాజ్, సంగీతం యస్ రాజేశ్వరరావు కూర్పు, దర్శకత్వం ఆదుర్తి సుబ్బారావు నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు



శ్రీ కృష్ణబాలాజీ ప్రొడక్షన్స్‌వారి "ఆదర్శవీరులు"లో సత్యేన్.

పెళ్ళి తాంబూలం

దర్శక నిర్మాత శ్రీ బి యస్ రంగా నిర్మిస్తున్న "పెండ్లి తాంబూలం" డిసెంబరు మొదటివారంలో విడుదల కాగలదని తెలుస్తోంది

జమున, రమణమూర్తి, యస్ వి రంగారావు, కన్నాంబ, రమణారెడ్డి, రాజశ్రీ, నాగయ్య, చదలవాడ మాలతి, పాల్గొంటున్నారు సంగీతం విశ్వనాథం, రామ్మూర్తి

బాలయోగి పునఃప్రారంభం

లోగడ కొంత పని జరిపి ఆపివేసిన 'మున్మిడి వరం బాలయోగి' చిత్రకథను శ్రీ శివకుమార్ ఫిలిమ్సువారు హైదరాబాదులో తిరిగ నిర్మించే సన్నాహాలు చేస్తున్నారు కీ శే కవిసార్వభౌమ కృష్ణమూర్తి శాస్త్రికథ ఆధారంగా పునః ప్రారంభం కానున్న ఈ చిత్రంకు మాటలు పాటలు రావూరి, సి నాగేశ్వరరావు సంగీతం వేణు, మల్లేశ్వరరావు నృత్యం వెంపటి సత్యం, భద్రాచలం, ఛాయ కోట్నీస్, కళ ఎ యం కృష్ణ నిర్మాణం, నిర్వహణ నండూరి నరసింహం, కనుమర్లపూడి కృష్ణమూర్తి

దక్షయజ్ఞం

దర్శక నిర్మాత కడారు నాగభూషణం దర్శకత్వన, వరలక్ష్మి ఫిలింస్ వారి దక్షయజ్ఞం ఇప్పటికి సుమారు 10 రీళ్ళకు పైగాపూర్తైంది

పద్మనాభం, బాల పాల్గొన్న ఒక హాస్య రస భరిత ప్రణయకలాప సన్నివేశాన్ని ఇటీవల నెప్ట్యూన్ స్టూడియోలో చిత్రీకరించారు

వార్తా భరణం

పార్వతిగా దేవిక, శివుడుగా యన్. టి రామా రావు పాల్గొంటున్న ఈ చిత్రంలో రంగారావు, కన్నాంబ, రామకృష్ణ, రాజశ్రీ, రఘు రామయ్యలు పాల్గొంటున్నారు

ఈ చిత్రానికి కళ తోట అలంకరణం భద్రయ్య ఛాయా గ్రహణం లక్ష్మణ గోరే నృత్యం వసు మూర్తి, సంగీతం యస్ హనుమంతరావు.

"భీష్మ"

శిఖండి పురస్కృతుడై అర్జునుడు వదలిన బాణ పరంపరకు గాయపడి భీష్ముడు అంపశయ్యగతుడైన సన్ని వేశాన్ని బి ఎ యస్ ప్రొడక్షన్స్ వారు ఇటీవల చిత్రీకరించారు

ఈ సన్నివేశ చిత్రీకరణంలో యన్ టి రామారావు (భీష్ముడు) హరనాథ్ (కృష్ణ) ధూళిపాళ సీతారామ శాస్త్రి (దుర్యోధనుడు) కొంగర జగ్గారావు (దుశ్శాసన), రాజారెడ్డి (అశ్వత్థామ) శోభన బాబు. లంకా సత్యం, ఎ వి సుబ్బారావు మొదలగు వారు పాల్గొన్నారు

వర్ధమాన నటుడు శోభనబాబు ఈ చిత్రంలో అర్జున పాత్రను నిర్వహిస్తున్నారు ఇంకా మిక్కిలినేని, వరలక్ష్మి, అంజలి, సూర్యకాంతం, నిర్మల, ప్రభాకరరెడ్డి, ఎ ఎస్ ఆర్ ఆంజనేయులు ప్రభృతులు పాల్గొంటున్నారు యుద్ధ సన్ని వేశాలను చిత్రీకరించేందుకు బి ఎ యస్ బృందం త్వరలో ఔట్‌డోర్‌కు వెళ్ళనున్నారు

కథ. రావి కొండలరావు నాయుడు కళ ఎస్. కృష్ణారావు. సంగీతం రాజేశ్వరరావు ఛాయ రెహమాన్ నిర్మాణం, దర్శకత్వం బి ఎ సుబ్బారావు.

అమ్మా - నాన్న

లక్ష్మి బిడ్డలు చిత్రాన్ని నిర్మిస్తున్న రోహిణీ పిక్చర్స్ వారు అమ్మ—నాన్న అనే చిత్రాన్ని నిర్మించ నున్నట్లు ప్రకటించారు

విడుదలకు సిద్ధంగావున్న లక్ష్మి—బిడ్డలులో హరనాథ్, బాలయ్య, కృష్ణకుమారి, హేమలత రాజశ్రీ, మీనాకుమారి, నాగయ్య, లింగమూర్తి ప్రభృతులు నటిస్తున్నారు. రచన, నిర్మాణం: గుడిపల్లి లక్ష్మి నారాయణ, దర్శకుడు పి. యస్ శ్రీనివాసరావు ఛాయ. కే యస్. ప్రసాద్, సంగీతం శంకరరావు ★

హరివంశం

(15-వ పేజీ తరువాయి)

పౌండ్రకుడు మహానందుడును, వాచాలుడును వెంటరా నా మందిరములో ప్రవేశించెను. లోపల వైద్యులు సాందీపని ఆశ్రమ మృగమునకు వైద్యము చేయుచుండిరి. ఆ లేడికాలు కొంతగా విరిగెను. దానికి వైద్యులు కట్టుకట్టుచుండిరి. వారు లోపలకురాగా, లేడి తలఎత్తి చూచెను. మహానందుని గుర్తుపట్టెను వైద్యుల చేతులలో నున్న యది సంతోషముతో నెగురబోయెను వైద్యులు దానిని పట్టుకొనిరి అది వారి చేతులలో వణగియుండెను.

"ఆచార్య! ఈ ఆశ్రమ మృగము మిమ్ము గుర్తించినది."

"వాసుదేవ! అది పుట్టినప్పటినుండియు నేను దానిని సాకితిని. జడ భరతుడు పూర్వ మొక లేడిని సాకినాడట. నేను దీనిని అట్లు సాకితిని"

"ఆచార్య! కొలది రోజులలో వైద్యము పూర్తియగును. నేనే స్వయముగా నీ విషయమును చూచుచున్నాను. వైద్యము ముగియుసరికి లేడి నడువకల్గును పూర్వమువలె పరుగెత్తలేదుగాని, ఆశ్రమమున నిటు నటు తిరుగగలదు"

"పౌండ్రక!"

"వాచాలుడేనా మాట్లాడుచున్నది!"

"క్షమించవలయును మహారాజా! నోరు జారినది వాసుదేవ! వావాక్టికి ఈ లేడియన్న అమితమైన ప్రేమ"

"ఆచార్య సాందీపని ఆశ్రమమున నీవు పిచ్చి వేషములు వేయలేదుగద!"

అప్పుడు మహానందుడు నవ్వెను

"వాసుదేవ! వాచాలుని ఆకారము నీవు చూచుచున్నావు. మరి అతని పేరు వాచాలుడు. ఏమి చేయుడు!" పౌండ్రకుడు మరల నవ్వెను అతని ఆత్మ లక్షణము మరియు నందులో ప్రస్ఫుటమయ్యెను. మహానందుడను కొనెను ఈ పౌండ్రకుడేమో విచిత్రమైనవాడు మాట మాటాడిన వెంటనే, వెంటనే నన్నియు గ్రహించును రాజున కుండవలయు దర్పము, విషయ గ్రహణ పారీణత నున్నవి. ఎందులోనను అహం ప్రత్యయమును వదిలి మాటాడు లక్షణమే అతనిలో గోచరించుటలేదు

"వాచాల! ఆచార్య మహానందులను మహారాజ దర్శనమునకు రమ్మనుము"

వాచాలు డట్టులే చేసెను

"ఆచార్య మహానంద! మహారాజదర్శనము చేసికొనవలయు వేళయగుచున్నది

"అట్టులనే!"

అందరును మహారాజు అతిథి మందిరమును చేరుకొనిరి. మహారాజు అచ్చట నొక ఉన్నతాస్తరణమున నాశీనుడై యుండెను. ఆయన ఆరోగ్యము సరిగా లేదువలెనున్నది. అందులోనను వృద్ధుడు. వారు రాగా ఆయన లేవబోయి, లేవలేక అట్టులనే కూర్చుండెను. పౌండ్రకుడు ముందునకుపోయి మహారాజుతో నిట్టులనెను.

"మహారాజ! వీరు ఆచార్య మహానందులు. వీరిని గురించియే తమకు విన్నవించుకొనినాను."

మహారాజు మహానందునిదిక్కు చూచెను ఇట్టులనెను.

"ఆచార్య మహానంద! మిమ్ము గురించి వినినాను. వాసుదేవుడు చెప్పగా సరియే. మరియు ఇతరముగ గూడ వినినాను. మీరు ఆచార్య సాందీపనికి సహచరులు. ఆయనతో సమానులు. మరి మీ గురుత్వము మా మేనయల్లునకు లభించుటయు మాకు సంతోషము." అని ఆయన ఆలోచనాధీనుడాయెను. అట్లు కొంతసేపుండి మరల మహానందునితో ఇట్టులనెను

"ఆచార్య! పౌండ్రకుని వర్తనము విచిత్రమైనది. వాని ఆలోచనములును విచిత్రమైనవి. వాడు మాకు భాగినేయుడు. చిన్ననాడే తల్లి చనిపోయినది. మేము పెంచితిమి. మాకు అల్లునిగా గూడ నిర్ణయించుకొంటిమి. మాకో, ఒక్కర్తుకయే కూతురు. ఆమెను వీనికిగా చిన్ననాడే నిశ్చయము చేసినాము. అది మా అక్కగారి కోరిక. ఆ కోర్కెను మేము పాలించెదము"

"అవశ్యము పాలించవలయును మహారాజా!"

"అవును వానికి మీరు విద్యలు కరపవలయును. నేను వానిని ఆచార్య సాందీపనివద్ద చదువుకొమ్మనినాను. వాడు కాదనినాడు మహానందులవారివద్ద చదువుకొందును అన్నాడు. నేను సరియే నన్నాను. మీరు ఏమందురు"

"ఏమందును మహారాజ! మహాభాగ్యము అందును"

"అంతియేనా!"

"ఏమనమందురు?"

"మావాని లక్షణమును కనిపెట్టినారా! దానిని హద్దులలో పెట్టమందును"

పౌండ్రకుడు తిరిగి గల్లున నవ్వినాడు.

"మాతుల! నేను పుట్టినది యట్లు అది మారుట యెట్లు!"

"అదియే నేనును ఆలోచించుచున్నాను" అనినాడు మహారాజు.

"మహారాజా! పాఠములకువేళయగుచున్నది మేము పోయెదము"

"శుభము"

పౌండ్రకుడు వాచాలుని సంబోధించినాడు.

"వాచాలా!"

"వాసుదేవ!"

"ఆచార్యులను ఆశ్రమమునకు తీసికొని పొమ్ము మేము వెంటనే వచ్చెదము."

"చిత్తము."

★

మనమూ-మన రాష్ట్రం

(11-వ పేజీ తరువాయి)

కమ్యూనిస్టులకు తెలియదా? అన్న ప్రశ్నలురావచ్చు. కమ్యూనిస్టుల గెలుపుకు, వారి బలానికి సంబంధం లేదు 1952 ఎన్నికలలో నూరు స్థానాలకు పోటీచేసి 40 కి పైగా చేజిక్కించుకోగలిగారంటే కారణం ఆనాడు కాంగ్రెస్‌పార్టీ విశ్లథమై, కె. ఎల్. పి, కె. ఎం పి. అన్న పేర్లతో ఎన్నికల రంగంలో పోటీపడి దెబ్బ తినడమే 55 ఎన్నికలలో ఈ మూడు ఏకమై, ఐక్య సంఘటనగా నిలబడేసరికి కమ్యూనిస్టుల బండారమెంతో బయటపడింది. అయితే ఇప్పుడు ఆ ఐక్య సంఘటన అంతరించి పోయింది పైగా స్వతంత్రపార్టీ అంటూ మరో బలమైన మితవాదపక్షం అవతరించింది అందు వల్లనే ఈ సారి కాంగ్రెస్‌కు పడేవోట్లు చీలిపోయి 55 ఎన్నికలకన్నా ఎక్కువ స్థానాలు గెలవగల మని కమ్యూనిస్టులు ఆశిస్తున్నారు పార్టీలో ఎన్ని చీలికలున్నా, అవి కాంగ్రెస్‌లో మాదిరి రచ్చకెక్కేవి కావు స్థానాలు ఎక్కువ తక్కువలతో నిమిత్తం లేకుండా వారి వోటింగ్ బలం చెక్కు చెదరకుండా ఉంటుందన్న సంగతి 55 లో జరిగిన ఆంధ్ర ఎన్నికలలోనూ, 1960 లో జరిగిన కేరళ ఎన్నికలలోనూ ఋజువైంది కనుక కాంగ్రెస్ వోట్లను స్వతంత్ర పార్టీ, ప్రజా పార్టీ ఇత్యాదులు చీలదీసేపక్షంలో, కమ్యూనిస్టులకు 150 స్థానాలుగాకపోయినా, 55 లో వచ్చిన వాటికంటే ఎక్కువ స్థానాలు లభించడం ఖాయం.

ఇలా వోట్లు చీలదీయడంపైనే కమ్యూనిస్టులు ఇప్పుడు కేంద్రీకరించి పని చేస్తున్నారు కాంగ్రెస్‌కు, స్వతంత్ర పార్టీకి బలం ఉన్నచోట్ల తాము కూడా పోటీ చేస్తున్నారు కాంగ్రెస్‌కుబలం ఉండి తమకులేనిచోట్ల ఇతరులను బలపరుస్తున్నారు. ఇది కమ్యూనిస్టుల ఎత్తుగడ ఇందులో వింతేమీ లేదు. సిద్ధాంతాలు వగైరా ఏమీ ఉండవు. పైకి స్వతంత్రపార్టీ పట్ల అభివృద్ధి నిరోధక పార్టీ అని తిడుతునే, చాలాచోట్ల ఆ పార్టీని బలపరచడం ఎలాంటి సిద్ధాంతం ఇంకోవైపు ప్రజాపార్టీని దువ్వడం ఏ రకమైన సిద్ధాంతాల కలయిక! కనుక ఈ అన్ని పనులకు లక్ష్యం ఒకటే అది కాంగ్రెస్‌ను వీలైతే తాము, లేకపోతే ఇతరులు దెబ్బకొట్టాలని

ఈ లక్ష్యాన్ని ఎంతవరకు సాధించగలరో, ఎన్ని స్థానాలు చేజిక్కించుకొంటారో ఎవరూ చెప్ప లేరు. కాని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 ఏళ్ళయినా అవినీతి ఆశ్రితపక్షపాతంలాంటి అంశాలలో అప్రతిష్ఠ పెంచుకున్నా ఈనాటికీ కాంగ్రెసుతో దీటుకాగలిగిన మరో పార్టీ అవతరించలేదు అంటే, జనంలో కాంగ్రెస్ అభిమానం ఎంత లోతుగా వేరు పోసుకొనిఉందో కాంగ్రెస్ లోపాలను ఎంత ఉదారంగా సహిస్తున్నారో ఊహించవచ్చు. స్వతంత్రపార్టీ గాని, కమ్యూనిస్టులు గాని తమ బలమెంతో గ్రహింపలేక, ఎదిరి బలాన్ని తక్కువచేసి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నెలకొల్ప గలం అని ప్రగల్భాలు పలికి ప్రయోజనం లేదు. ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని కాదు గదా ఆఖరికి బలమైన ప్రతిపక్షాన్ని కూడా నిర్మించలేరు ★

ఘంటారావం

(9-వ పేజీ తరువాయి)

పూలబాటలో ఓ కంటకముంది? నీ ప్రణయపానకంలో ఓ పుడకవుంది!! నీ అనురాగనేత్రంలో బాధించే ఓ నలుసుంది!! జాగ్రత్త!'' అన్నాడు శర్మ

''అయితే ప్రేమ అనే వస్తువుకూడా కల్తీగా బజార్లో చిక్కుతుందన్నమాట!'' అని వర్మ ఒక అమోఘమైన సత్యాంశాన్ని బయటపెట్టాడు. విస్తుపోయి నిలుచుండిన శేషునుచూసి శర్మ మరింత గంభీరుడై, ''అవున్రా! మన క్లాస్మేటు రఘునాథ్ లేడూ! వాడే నీ కంచంలో రాయి, నీ మంచంలో నల్లి నీ కథలో విలన్'' అన్నాడు.

''ఏమిటేమిటీ?'' అని వర్మ ఆశ్చర్యపోయాడు. ద్విపాత్రాభినయం గురించి అతడు విన్నాడుగాని, ఒకేసారి ఒకడు మూడు పాత్రలెలా ధరిస్తాడో అతడికి తెలీలేదు.

''అంటే.....??'' అర్థంకాక శేషు ప్రశ్నించాడు

''అంటే, ఉషాదేవిని వాడు కూడా ప్రేమిస్తున్నాడన్నమాట. శత విధలా ఆమె మెప్పు సంపాదించాలని తాపత్రయపడుతున్నాడు. ఆమె ఇంటి కెదురుగానే ఓ రూము కూడా సంపాయించాడు ఈ రోజు నువ్వు ఉషాదేవి యింటికెళ్లొచ్చావంటే నీమీదా ఓ కన్నేసివుంచుతాడు!''

''ఆఁ! వాడు నన్నేం చేస్తాడులెద్దూ!'' అన్నాడు శేషు

''అలాగని సంతోషపడొద్దు. ఈ రఘునాథ్ అనే వాడిముందు రాబిన్‌హుడ్డూ కేప్టన్‌కిడ్డూ అనే వాళ్ళంతా బలాదూర్!! ఏమనుకున్నావో!''

''అబ్బ! ఇవన్నీ నీకెలా తెలిశాయిరా?'' అని వర్మ వాణ్ణి ప్రశ్నాపూర్వకంగా మెచ్చుకున్నాడు శర్మ సర్కస్‌లో కత్తులు మింగేవాడిలా. ''అది అనుభవంలే!'' అని తేలిగ్గా అనేశాడు శేషు మారు మాటాడకుండా బాత్ రూంలో కెళ్ళాడు!

*   *   *   *

శేషగిరి పుస్తకాలకట్ట పట్టుకొని గేటుదగ్గర కొచ్చాడు జాగ్రత్తగా పరకాయించి చూశాడు ''కుక్కలబోర్డు''కోసం! అటువంటిదేమీ కనబడక పోయేసరికి ధైర్యం తెచ్చుకొని గేటు తలుపు తెరిచాడు. అందమైన పూల మొక్కలూ, రంగు రంగుల క్రోటన్సూ, పచ్చని పచ్చికా స్వాగతం పలికాయి వసంతవనిలోనికి వసంతుడిలా లోనికడుగు పెట్టి ఓ విష్ణుసైజు మహారాజులా ముందుకి నడిచాడు

గుమ్మదగ్గరకొచ్చి నిలబడ్డాడు చూట్టాని కెవరూ కనబళ్లేదు ''ఏమండీ! ఉషాదేవిగారున్నారా!'' అని గట్టిగా పిలవబోయాడు కాని మాటలు గొంతు పెగిలి రాలేదు తన దేహంలో సహకార సంఘముందో లేదో తెలీదు ఒకవేళ ఉంటే ఈ సారి ఆ సంఘాన్ని సమావేశపరిచి అత్యవసర పరిస్థితుల్లో సహకారం చూపనందుకు ఈ గొంతుకను ట్టిగా మందలించాలనుకున్నాడు

ఇంతలో ఓ పని మనిషివచ్చి, ''ఎవరు కావాలి బాబుగోరు?'' అని ప్రశ్నించింది ఒక జంతుశాస్త్రవేత్త కొత్త జంతువుని పరిశీలించినట్టు తనవేపే పరకాయించి చూస్తూ

శేషు ధైర్యాన్ని కూడదీసుకొని, ''మిస్ ఉషాదేవిగారున్నారా?'' అని ప్రశ్నించాడు తన గొంతు ఇంత దారుణంగా పని చేసినందుకు సంతోషించాడు కూడా

''ఉన్నారు. కూకోండి బాబూ పిలుస్తాను'' అని ఆమె లోని కెళ్లబోయి వెనక్కితిరిగి ''మీ పేరేటండి బాబుగోరు?'' అని ప్రశ్నించింది.

శేషుకు యీ ప్రశ్న అనవసరమనిపించింది పైగా ఆమె ప్రశ్నించే ధోరణి కూడా అతనికి కోపాన్ని తెప్పించింది. అంచేత అయిష్టంగానే ''నా.... పేరు ... .ష్! . శేషగిరి....'' అన్నాడు.

''ష్! శేసగిరాండి?'' అని కుతూహలంగా ప్రశ్నించిందామె

''ష్‌శేషగిరేమిటి?''

''మీరేకదటండిబాబు పేరడిగితే ష్ శేసగిరన్నారు!''

''ష్! శేషగిరి అనలేదే!'' అన్నాడు మొండిగా.

> భార్య:- పెళ్లి కాకముందు నా గురించి మీరు పడిన శ్రమను తలచుకుంటే, నాకు ఎక్కడ లేని నవ్వు వస్తుంది.
>
> భర్త:- అనవసరంగా ఎందుకంత శ్రమపడ్డానా అని యిప్పుడు విచారిస్తున్నాను.
>
> సి హెచ్. కుసుమ (గుంటూరు)

''ష్! శేసగిరని, ష్ శేసగిరని అనలేదంటారేటి బాబు?'' అని ఆమె మరీ మొండికెత్తింది

తన పేరు నిలా చిత్రహింస చేస్తున్నందుకు దారుణంగా బాధపడి, ''అంటే అన్నానులేగాని, నా పేరులో మూర్ధన్యమైన షత్వమున్నదిగాని దంత్యమైన సకారంలేదని తెలుసుకో!'' అన్నాడు కోపంగా.

''ఏటో సిత్రంగా మాటాడుతున్నారు బాబూ'' అంటూ లోనికెళ్ళిపోయింది

శేషగిరి కూర్చుందామా వద్దా అని కాసేపు తటపటాయించాడు చివరికి ఉషాదేవి దర్శనమయ్యే వరకూ కూర్చోరాదని నిశ్చయించుకున్నాడు

నీలిటిష్యూచీర, నీలి చారల బ్లౌజూ వేసుకొని, ఉదయాన్నే వికసించి తాజాతనంతో సొంపు లొలుకుతున్న పుష్పంలా ఉషాదేవి నడవాలోంచి నడిచి వచ్చింది చీకట్లవంటి నల్లని కురులూ, ప్రత్యూషపు అరుణకాంతులుగల పెదిమెలూ, బుగ్గలూ ఉషాదేవి కాబట్టి ఆమెకు సహజంగానే అమరినై. ఆమె గిరుక్కున శేషగిరివేపు తిరిగింది. ఆ తిరగడంలో పాములాంటి ఆమెజడ నడుంచుట్టూ చుట్టి మరలా వాలిపోయింది

''ఓ మీరా! రండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాను!'' అందామె చిలిపిగా శేషునుచూసి నవ్వుతూ. శేషు వెన్నెముకలో జివ్వున ఓ చలితెర సాగిపోయింది. తనకోసం ఉషాదేవి ఎదురు చూడడమా! ఎంత అదృష్టవంతుడు తను! ఎక్కువ పంట పండించినందుకు ప్రభుత్వ బహుమతి సంపాదించిన కర్షకునిలా మురిసిపోయాడు

జడను మునివేళ్ళతో చికాకుపరుస్తూ, ఉషాదేవి, ''ఆ పుస్తకాలనలా వుంచండి!'' అని ఒక టేబిల్ నిర్దేశించి చూపింది. తానొక కుర్చీలో కూర్చుంది. శేషగిరి బుద్ధిగా పుస్తకాలనలావుంచి, మళ్ళీ బుద్ధిగా నిలబడ్డాడు

''కూర్చోండి!'' అందామె కూర్చున్నాడు

''చాలా శ్రమపడ్డారండి! థాంక్స్!'' అన్నదామె

''నాకా... మాకా ..'' అన్నాడు శేషగిరి. అంటే అతడు రాకెన్‌రోల్ నృత్యంచేసే వుద్దేశంలో వున్నాడనికాదు లేదా మిస్ ఉషాదేవికి కొంకిణి భాషతోగల పరిచయాన్ని పరీక్షిద్దామనే వుద్దేశమున్నాకాదు కేవలం అతని గొంతు పైజెప్పిన సహకార సంఘంలో మెంబరుగా లేకపోవడమే దానికి కారణం

''అంటే?'' అని ప్రశ్నించింది ఉషాదేవి కుతూహలంగా. తానొక పొడుపుకథ వేస్తున్నట్టు ఆమె భావించిందేమోననుకున్నాడు

''కా ... షా!'' అన్నాడు ఎంతగా గొంతుకు సర్దుకున్నప్పటికీ, ఈ రెండు ముక్కలుతప్ప బయటికిరాలేదు అవీ తన ప్రయత్నం లేకుండానే స్వతంత్రించి బయటకు వచ్చేశాయి.

''మీరు భలే చిత్రమైనవారేనే!!'' అంది ఉష ఆశ్చర్యంతో సంతోషాన్ని కలుపుతూ శేషగిరి గుడ్లప్పగించి ఆమె వంకే చూస్తున్నాడు మళ్ళీ ఆమె ఏదేనా ప్రశ్నవేస్తే తన గొంతులోంచి ఏ ధ్వనులొస్తాయోనని భయపడుతున్నాడు లోపలే

''చాలా చిత్రమైనవారండీ!'' అన్నది ఉషాదేవి మరోసారి ''సరేగాని, ''సత్తువుంది కారంలేదు'' అంటే ఏమిటండీ?'' అని ప్రశ్నించింది ఎంతో కుతూహలంతో

తాను వేసిన చిక్కు ప్రశ్నకు మారుగా ఆమె ఈ చిక్కుప్రశ్నవేసి వుంటుందేమోనని ఊహించాడు తాను చిక్కు ప్రశ్న వెయ్యకపోయినా ఆమె వేసిందిమాత్రం నిజంగా కొరకరానికొయ్యనిపించింది ఆఖరుకు ''స్పింక్స్'' వేసిన చిక్కు ప్రశ్న కూడా ఈ ప్రశ్నముందు బలాదూర్ అనిపించింది

''తెలీదు'' అన్నాడు ఎలాగో పీలు చేసుకుని.

''ఆశ్చర్యంగావుందే! మీకే తెలియదా!!'' అన్నది ఉషాదేవి శేషగిరి ధైర్యంగా తల తాటించాడు

''మరి మా పనిమనిషితో మీరే అన్నారుగా యీ మాట?'' అనడిగిందామె శేషగిరికి అర్థమైంది కాని అతడేం మాటాడలేదు వాళ్ల పనిమనిషితో తాను వ్యాకరణ విషయాలు చర్చించానంటే ఆమె ఏమనుకుంటుందోనని భయపడ్డాడు.

కాసేపుండి ఉషాదేవి, ''మీరు ఇదవవారు!'' అన్నది శేషగిరి, ''అరే! ఈమె కూడా చిత్రంగా మాట్లాడుతుందే!'' అనుకున్నాడు. తనను ఎందు

దేశభాషావారపత్రికలలో సర్క్యులేషన్ ప్రకారం
'ఆంధ్రసచిత్రవారపత్రిక' ఐదవస్థానం ఆక్రమిస్తున్నది.

తున్నదేవిటి? కొంపదీసి ఈమె సహస్ర శిరచ్ఛేద అపూర్వచింతామణికాదుకదా! అనుకున్నాడు ఆందోళనగా.

"అంటే?" అని ప్రశ్నించాడు ఎలాగైనా వివరాలు తెలుసుకుంటే మంచిదని.

"నా పుస్తకాలకట్టను తెచ్చివ్వడంలో మీరు అయిదవవారన్నమాట!" అన్నది ఉష.

"పాపం! పుస్తకాలకట్టను తరుచుగా కాలేజిలో మరచిపోతుంటారు గావోను!" జాలి చూపుతూ అన్నాడు శేషు.

"మరచిపోతాను నిజమే! కాని మతిమరపువల్ల కాదు. కావాలనే మరచిపోతాను!" అన్నది అతడి కళ్లలోకి చూస్తూ ఉషాదేవి.

"కావాలని ఎందుకు మర్చిపోతారు?"

"పుస్తకాలు కాస్త ఎక్కువగా వున్నప్పుడు మోసుకురావడం కష్టమైతే, వాటన్నిటినీ మంచి రిబ్బనుతోకట్టి, కాలేజిలో వదిలేసి చేతులూపుకుంటూ చక్కా నడిచి వస్తాను మరుచటిరోజు ఉదయానికల్లా ఎవరో ఓ అబ్బాయి నా పుస్తకాల కట్టను నాకు తెచ్చిస్తాడు. ఇదివరకు నలుగు రిలాగే తెచ్చిచ్చారు?" అన్నది ఉష.

ఏదేనా యంత్రాన్ని ఉపయోగించి మానవుడి మొహాన్ని నయాపైసా సైజులోకి నొక్కేయడానికి అవకాశముందో లేదో తెలీదు. కాని ఈ మాటలవల్ల శేషు మొహం సరిగ్గా నయాపైసా పరిమాణంలోకి వచ్చింది. అంచాతనే ఎగిరి గంతేసి "శహభాష్! మీ తెలివి అపూర్వం!" అని ఉషాదేవిని అభినందించలేకపోయాడు. కోపంతోనూ, ఆవేదనతోనూ, మొహానికి పట్టిన చెమటను చేతి రుమాలుతో తుడుచుకున్నాడు.

"మన కాలేజిలో ఎలక్ట్రిక్ బెల్నుంది చూశారా?" అనడిగింది ఉష.

శేషగిరి ఆమె భావాల్తో సరిగా పరిగెత్తలేక పోతున్నాడు. మనోవేగం సంగతి ఇంతకుముందు వినివున్నాడుకాని అది యింత వేగంగా వుంటుందని అతనికి తెలియడం ఇదే మొదటిసారి.

"చూశాను" అన్నాడు రుమాలుతో నుదుర్ని తుడుచుకుంటూ.

"మేడమీద ఆఫీసులో స్విచ్చి వుంది అవర్ అయిపోగానే అది నొక్కుతారు. వెంటనే అన్ని క్లాసుల్లో గంటలు మ్రోగుతై. ఆ స్విచ్చిచూశారు కదూ?"

చూశానని వప్పుకొన్నాడు. రు. తోను. ని ఒ'గా తుడుచుకున్నాడు.

"ఆ స్విచ్చి మీరు నొక్కగలరా?" అనడిగింది. వట్టి అర్థంలేని ప్రశ్నల లిస్టు తయారుచేస్తే ఈ ప్రశ్న మొట్ట మొదటుగా వస్తుందేమోనను కున్నాడు శేషు. "ఎందుకూ?" అని ప్రశ్నించాడు.

"నాకు తెల్సు. మీరీ ప్రశ్న అడుగుతారని!" అంది ఉష వెటకారంగా.

"మరేమని అడగాలి?"

"మీరు ధైర్యవంతులైతే" ఓయస్! రేపు సెకెండవరు జరుగుతున్నప్పుడు మధ్యలోనే ఆ

స్విచ్చి నొక్కేస్తారు చూడండి!" అని వుందురు! అన్నది ఉష ఉద్రేకంగా. ఛ,ఛ! ఎంత అవమానం! ఒక అబల తను నిర్బలుడని తూలనాడడమా? ఎంత దౌర్భాగ్యం! అయినా శేషు భయపడుతూనే, "అలా నొక్కినందువల్ల లాభం?" అనడిగాడు.

"లాభమేముంది? ఇదేమన్నా వ్యాపారమా, లాభం రావడానికి? కాని ధైర్యవంతులకి అల్పంచరంటే ఎంతో యిష్టం. అపాయకరమైన పనులుచేస్తే ఎంత ఆనందం కలుగుతుంది!!" అంది ఉష.

శేషగిరి కాస్త ఆలోచించాడు. నిజమే! ధైర్యం!! ధైర్యం వుండాలి. ప్రేమించిన పడతికోసం ప్రాణాలిచ్చి, అగ్నిలోకిదూకి, రాక్షసుల్నిచంపి, ఇంకా ఎన్నెన్నో సాహసకృత్యాలు చేసిన మహావీరులైన హీరోలుండగా తాను ఒక ఆఫీసు రూంలోవుండే బెల్ * స్విచ్ నొక్కలేకపోతాడా!!

"ఓ యస్! రేపు రెండో గంట జరుగుతున్నప్పుడు మధ్యలో దాన్ని నొక్కేస్తాను!" అన్నాడు శేషగిరి ధైర్యం పుంజకుని. ఉషాదేవి చెప్పిన హీరోలాగ్గానే మాట్లాడాడు.

ఉష చప్పట్లు చరిచింది. "భలే భలే! మీరు స్విచ్ నొక్కుతారా!! రేపు సెకెండవరు జరుగుతున్నప్పుడా!!" అన్నది ఆనందంలో అనిర్వచనీయమైన కాంతితో ఆమె కళ్ళు మెరుస్తున్నై. తారకల్లాంటి ఆమె కళ్ళలోకి ఆ కాంతిని తెప్పించిన తన జన్మ ధన్యమైందనుకున్నాడు శేషగిరి

"రేపేనా! రేపు తప్పకుండా గంటలు మోగిస్తారుకదూ!" అన్నది ఉష ఉత్తేజంగా.

"అవును. రేపే! ఉదయం సెకెండవరు జరుగుతున్నపుడు!" లని శేషగిరి రెండో సీనులో హీరోలా రీవిగా నిష్క్రమించాడు. కాని హీరోలందరివలెనే ఎదురింటి కిటికీలోంచి నిప్పులు గక్కుతున్న రెండు కళ్లను గమనించలేదు.

* * *

రెండు వీధులు దాటేవరకూ శేషగిరిని పట్టుకున్న ధైర్యం వదల్లేదు. ఛాతీ విరుచుకుని 'మన కెవరేం లెక్క?' అన్నట్టుగా రీవిగా నడిచాడు. కాని, మూడోవీధి మలుపు తిరిగేటప్పటికి అతడి ధైర్యం సడలి వడలిపోనారంభించింది. తనేదో గొప్పగా హీరో కార్య మొహటిచేసేద్దామనుకున్నాడుకాని ముఖ్యమైన లోపమొకటి గమనించలేదు. మహావీర కార్యాలుచేసిన సాహసికులందరికీ ఓ పేదరాసి పెద్దమ్మో, ఓ దేవతో, ఓ మహర్షో—ఎవరో ఒకరు సాయంచేసేవారు. కాని తనకి సాయంచేసేవారెవరు? పైగా ప్రిన్సిపాల్ ఆకారం తలచుకునేసరికి అడుగులే తడబడినై. మనసులో పెద్ద గాయమై గేయంగా బయట పడింది.

కాని రేపో? నా ఊహాంచల
సాహసికాంశం వీడిన
నా చేతులు యత్నిస్తాయా?
నే నేదో స్విచ్చి వేస్తానని
ఆవేయడంలో గంటలు మ్రోగి
ప్రిన్సిపాలు గుండెలు ఘూర్ణిల్లగ
నా ఉషాదేవి వీసులలో మంత్రంగా ప్రమోగించాలని
నా ఆకాశాలను ఆఫీసుకు చేరువగా
నా క్లాస్మేట్సంతా పంచుకునే
తలపుల నవ్వుల జడిగా . . .

అతనికి అకస్మాత్తుగా మరో అయిడియా తట్టింది. ఈ జగదేకవీరుడుకు సాయంచేసే పేదరాసిపెద్దమ్మకోసం తానూ వెదికితే? ఊహ మంచిదేగాని వా రెక్కడ వుంటారో ఆ ఆచూకీ అడ్రసూ తెలియవాయె! అయితే ఒక మార్గముంది. ఓ పేదరాసిపెద్దమ్మకోసం పేపర్లో ప్రకటన వేయించొచ్చు.

"కావలెను. ఒక కళాశాల విద్యార్థికి ప్రిన్సిపాలుకు తెలియకుండా బెల్ స్విచ్చి నొక్కుటకు సహాయముచేయు, లేక ఉపాయము చెప్పగల ఒక పేదరాసిపెద్దమ్మ కావలెను. మంత్రశక్తితో మనుష్యులను దోమలుగ మార్చగలుగువారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వెనుకబడిన తరగతులవారికి ప్రత్యేక కేటాయింపులేదు. ఈ క్రింది అడ్రసుకు తమ శక్తుల వివరములు తెలుపుచూ రహస్యముగ జాబు వ్రాయవలెను. ఫలానావీధి, ఫలానా వూరు"

కాని ఈ ప్రకటనను ప్రిన్సిపాల్ చూస్తే? తన రహస్యం పసికట్టేసి, కాలేజినిండా డి. డి. టి. జల్లించాడంటే తన ఆట కట్టయిపోతుంది. కాబట్టి ఈ ఐడియా కూడా పనికిరాదు. పోనీ ఏంజెద్దామన్నదీ తోచలా! ఛీ మానవుడెంత అవివేకి! రెండు క్షణాలు ఓ స్త్రీ మొహంలోకి సంతోషం తెప్పించడంకోసం ఎన్ని అవస్థలు పడుతున్నాడు! ఓ నారీ రత్నమా! నీవు మమ్మెన్ని సాహసములలోనికి దింపితివి! చివరి కెన్ని కష్టములను కల్గించితివి!

రూముకిపోయి కూర్చునేసరికి శర్మ అడిగాడు "ఏరా? ప్రబదర్ కృతజ్ఞత లభించలేదా, ఏం? ముఖం వేలాడేశావ్?"

"ఏం చెప్పనోయ్! పెద్ద చిక్కొచ్చిపడింది" అన్నాడు దీనంగా శేషు.

"ఏవిటేవి"టని శర్మా, వర్మ లిద్దరూ కుతూహలం వ్యక్తపరిచారు.

శేషు కథనంతా క్లుప్తంగా వివరించారు. అంతా విని శర్మ "అంత తొందరపడి గంట కొట్టేస్తానని ఎలా అన్నావురా?" అనడిగాడు.

వర్మ అన్నాడు : "ఏదో ఆవేశాల్లో! అమ్మాయిల ముందా మాత్రమైనా డబ్బాలు కొట్టకపోతే ఎలా?"

"అనకండా ఎలా వుండగలనోయ్! అందమైన అమ్మాయి ఎంతో మురిపెంగా అడుగుతోంది. ఆ క్షణంలో గంగలో దూకేయమనినా అంతపని చేసుండేవాణ్ణనుకో!"

"సరే! ఏదో అనేశావులేగానీ రేపు మెదలకండా కాలేజి చెక్కేసి రూంలో కూర్చో. నీ కూష్న మొచ్చిందని ఆ అమ్మాయికి వినబడేలా కాలేజీలో చెబుతాలే!" అన్నాడు శర్మ.

వర్మ, "అవున్రా శేషూ! ఎంచక్కా రేపు హాయిగా గదిలో కూర్చోరా. కావాలంటే నేనూ నీతోపాటే ఉంటాను. క్రి.ప్రా.కా. చదువుకుందాం ఇష్టమైతే" అన్నాడు.

"వరే! జ్వరంకాదుగదా! ఎంత దారుణమైన జబొచ్చినాసరే, రేపాస్విచ్చి నొక్కాకనే మిగతా పనులు చూడ్డం" అన్నాడు శేషు మాటల్ని జాగ్రత్తగా తూస్తూ.

"ఆపని చేశావంటే కాలేజి వదిలేస్తావ్" అన్నాడు శర్మ

"చేయకుంటే పరువు నాశనం" అన్నాడు శేషు.

"ఏం ఉపాయంలేదూ!" అనడిగాడు వర్మ.

"నాకేం తోచటంలా!" శర్మ జవాబు.

"అంతేనంటావా?"

"అంతే!"

"ఒ......తే!......శే....షూ!......అంతే.... . . తేనేవిట్రా!" అన్నాడు వర్మ గుడ్ల నీరు తిప్పుకుంటూ.

"అంతేరా!" అన్నాడు శేషు జేబురుమాలు బయటికి తీస్తూ.

"ఒరే శర్మ!"

"ఏరా వర్మా?"

"మన. . . . .శేషు. . . ."

"మన శేషు?"

"శేషురా!. . . ." అన్నాడు దుఃఖాన్ని పట్టలేక.

"శే షేవిట్రా?"

"ఉషాదేవి. . . . ."

"సరిగా చెప్పి యాడవరా!"

"అదేరా!"

"అదేవిట్రా?"

వర్మకి అంత దుఃఖంలోనూ కోపమొచ్చింది. "చంపేస్తాన్రా నిన్ను! చెప్పేది సరిగా వినవేం?" అన్నాడు.

శర్మ విసుక్కున్నాడు : "ఛ అరవకు! మాంచి అయిడియా వస్తోంది" అన్నాడు.

"ఆఁ! అలాగ్గా! రానీయ్, రానీయ్" అన్నాడు వర్మ బస్సు వెనక్కి వస్తోంటే కండక్టరన్నట్టుగా.

"ఒరే! కాలేజిలోని బెల్‌ను ఎందుకు కొట్టాలిరా నువ్వు?" అనడిగాడు శేషును శర్మ.

"ఎందుకేవిటి! ఉషాదేవికి మాటిచ్చాను. పైగా ఆమె మెప్పు సంపాదించుకుని ఆపైన ఆమె

అబ్బాయి:-తొందరగా పదండి సార్! మా నాన్నకీ, పక్కింటాయనకీ బాగా పోట్లాట నడుస్తోంది. అర్థగంటైంది. కొట్టుకుంటున్నారు.

పోలీసు:-అర్థగంటనుండి పోట్లాట సాగుతోంటే, మరి ఇంతసేపు ఊరుకొని ఇప్పుడొచ్చావేం.

అబ్బాయి:-ఓ అదా! ఇందాకా మా నాన్నే పక్కింటాయనను కొట్టాడండి. ఇప్పుడు మా నాన్న తన్నులు తింటున్నాడు అందుకని.

యస్. నారాయణరావు
(పంగిబురాఖ్ —హైద్రాబాద్)

ఘంటారావం

హృదయంలో చోటు దక్కించుకోవాలన్నా అదే మార్గం" అన్నాడు శేషు.

"శభాష్ మిడతంభొట్లూ! దొరికావు" అన్నాడు శర్మ

"దొరికాడా? నిజంగానే?" వర్మ ప్రశ్నించాడు

"దొరక్కేంచేస్తాడు? అబ్బాయ్ శేషూ! నిన్ను ఉషాదేవి ప్రేమించాలి కాని బెల్లు నీవు కొట్టకూడదు శిక్ష నీకు పడకూడదు సరే! అలాగే కానీ! ఇహ నే జెప్పేది జాగ్రత్తగా విను రేపు నువ్వు కాలేజికి రావద్దు"

"రావద్దా?"

"రావద్దంటే క్లాసుకు రావద్దు అన్నమాట. ఇంట్లోనే వున్నానని ఎరిబీకోసం కాని నువ్వు లేడీస్ వెయిటింగ్ రూంకెళ్లే దారిలో నించొనివుండు"

"సరే వుంటాను"

"ఫస్టవరు అయిపోగానే గంట మోగుతుందికదా! అదయిపోయాక కాసేపటికి మరోగంట మోగుతుంది రెండో అవరు మధ్యలోనే మోగుతుందన్నమాట! ఆ గంట వినగానే అందరూ బయటికి వస్తారు! నువ్వు ఉషాదేవిని ఒంటరిగా కలుసుకొని "నేనే ఆ గంటకొట్టాను" అని చెప్పెయ్!"

"ఆ గంట ఎవరిచేత కొట్టిస్తావ్?"

"ఎవరిచేతనయితేనేం? నేనే కొడ్తాననుకో! నీక్కావలసింది ఫలితం మాత్రమే! కాబట్టి నే జెప్పినట్టు చెయ్! జ్ఞాపకముందా?"

"ఉందిగాని శర్మా! కాస్త ఆలోచించరా? ఎక్కడన్నా అపాయం జరిగితే కష్టం" అన్నాడు శేషు

"ఏం భయంలేదురా! మనం స్పాసువేశామంటే ఎక్కడా లొసుగులనేవే వుండవ్ నే చెప్పినట్టుగా మొదటిగంట అయిపోయాక రెండోగంట వినగానే ఉషాదేవి దగ్గరకెళ్ళి ఆ గంటను నువ్వే కొట్టినట్టు చెప్పెయ్! సరా?" అన్నాడు శర్మ కరతాళధ్వనులకోసం ఆగిన వక్తలా చుట్టూ చూస్తూ.

"సరేలే" అని గునుస్తూ ఒప్పుకున్నాడు శేషు.

"నా కేమంత సరిగా కన్పించలా!" అని వర్మ విమర్శించాడు

* * * *

కాలేజి కాంటీన్‌లో శర్మ టిఫిన్ తినేసి, కాఫీ రసంబు సేవిస్తోంటే ఓ చెయ్యి అతడి బుజం మీద పడింది వెనకాలనుంచి "ఇలా వస్తావా?" అని పిలిచింది ఆ చేయి తాలూకు ధ్వని. అంటే చేతికి ధ్వని వుంటుందనికాదు ఆ చేయి తాలూకు శాల్తీ తాలూకు కంఠం తాలూకు ధ్వని అన్నమాట

"వా రెవా!" అనుకున్నాడు శర్మ తనలో ప్రకాశముగా మాత్రం "ఒక్కక్షణం" అని కౌంటర్ దగ్గిరకెళ్ళి ముడుపు చెల్లించుకుని వచ్చాడు. బయటికొచ్చి "ఏవిటోయ్ రఘునాథ్! ఏవిటి విశేషం?" అని ప్రశ్నించాడు తనని ఆహ్వానించిన అవతారాన్ని.

రఘునాథ్ అనబడే ఆశాల్తీ ప్రశ్నించింది: "మీరూంలోవుంటాడే, వాడెవడోయ్?" అని.

"చూడబ్బాయ్! మనం ఇన్వెస్టిగేషన్ చేస్తున్నప్పుడు శాస్త్రీయంగా నడుచుకోవాలి మనం

లాయర్గాలేకదూ! అందుకని ఇక ప్రస్తుత విష యానికొద్దాం మా రూంలో ఇద్దరు మానవు లున్నారు. వర్మ అని ఒకడూ. . . ."

"వాడు కాదోయ్! ఇంకోడు"

"అయితే వాడు శేషు! శేషగిరికి హ్రస్వం"

"ఆఁ! వాడే! ఊదుకడ్డీ లాసన్నగా జండాకొయ్యలా పొడుగ్గా వుంటాడే! వాడే!"

"నవీనమైన ఉపమాలంకారాలు వాడావుగాని నా కంతగా రుచించలా! సరే! ఇంతకీ ఏవిటి వాడి గురించి దుగ్ధ నీకు?"

"నా దెవడోయ్? వాడి చరిత్రేవిటి? తెల్సుకో దల్చుకున్నాను"

"వాడా? వాడొక రోమియో!" అన్నాడు శర్మ వాడి కళ్ళలోకి తీక్ష్ణంగా చూస్తూ. "ఈ నగ రంలోని ప్రముఖ ప్రేమికుల్లో ప్రథముడు" అన్నాడు వివరంగా చెబుతూ.

రఘునాథ్ చిన్నబుచ్చుకున్నాడు హిట్లర్‌ముందు చర్చిల్‌ని పొగిడితే అతడున్నూ ఇలాగే చిన్నబ్బుకుని వుండేవాడేమో! "హోహో" అన్నాడు, "ఇట్టి గొప్పవాణ్ణి మరి యెందేగంటిమే?" అనే వ్యంగ్య ధోరణి స్ఫురించేట్టు.

"ఫరవాలేదు! అబ్బాయి చురుకైనవాడే! విద్యా ర్థినులకంతా అత డంటే ఒక రకమైన మోజు" అన్నాడు శర్మ దెబ్బమీద దెబ్బవేస్తూ. ఇనుము ఎర్రగా వుండగానే నాలుగు దెబ్బలేయాలనే సిద్ధాం తాన్ని అతడు మనస్ఫూర్తిగా అంగీకరిస్తాడు.

రఘునాథ్ అనుమానంగా అతడివంక చూశాడు. "బ్రదర్ శర్మా! నీతో ఒక రహస్యం మాటాడాలి!" అన్నాడు.

"చెప్పవోయ్!"

"వీడున్నాడే నీ రూమ్మేటు. చాలా అపాయకర మైనవాడు. వాణ్ణి నా మార్గంలోంచి తొలగించా లనుకుంటున్నాను" అన్నాడు పెదిమెలు బిగబట్టి రఘునాథ్.

"అబ్బే! వాడు నీకు అడ్డంరాడు. నీవు మెయిన్ రోడ్డమ్మట వెళ్తూంటావ్ వాడు చల్లావారి వీధిలో వెళ్తుంటాడు" అన్నాడు శర్మ

"నా అభిప్రాయం తెలుసుకోలా నువ్వు నీ దగ్గర దాపరికమెందుకు? నేను ఉషాదేవిని ప్రేమి స్తున్నాను. అందుకోసమే వాళ్లింటి కెదురుగానే గది అద్దెకు తీసుకున్నాను వీడు ఈ మధ్య ఉషాదేవి యింటికొచ్చాడు. . . . . "

"అవునవును ఆమె మళ్లీ రేపో ఎల్లుండో రమ్మన్నదని కూడా చెప్పాడు"

రఘునాథ్ కోపంగా వాడకేసి చూశాడు "హూ! అలాగన్నమాట వెళ్తామనుకుంటున్నాడా! సరే!! వాణ్ణి ఎలాగైనా నా మార్గంనుండి తొలగిస్తాను. ఏమేనా చేస్తాను. నే నేమైపోయినాసరే వాణ్ణిమట్టుకు తొలగిస్తాను" ముఖం చేపురించుకుని గుడ్లలో నీళ్ళు తిరిగేలా గట్టిగా అన్నాడు

శర్మ గట్టిగా నవ్వాడు "పిచ్చి వెర్రబ్బాయీ! ఇంత బాధపడతావెందుకోయ్! అసలు నీ పద్ధతి తప్పు అట్పించి నరుక్కురమ్మన్నాడు గురజాడ్జీ. నువ్వు అమాంతం అనువైన అమ్మాయిని ప్రేమిం చేసి ధాటీగా వూళ్ళో తిరిగెయ్యగానే సరిపోతుం దనుకున్నావా? ఆమె ప్రేమను రాబట్టుకోడానికి నువ్వేంజేశావ్?"

"ఏం చేయాలి?" ఆశ్చర్యంగా అడిగాడు రఘు నాథ్

"వెర్రివాళ్ళా అడుగుతావేంటోయ్! ఆ అమ్మా యి నిన్ను ప్రేమించాలంటే నీవు సాహసకృత్యాలు చేయాలి ధైర్యవంతుడివని నిరూపించుకోవాలి. ఉదాహరణకు ఉషాదేవే వున్నదనుకో! పీరియడ్ పూర్తి కాకుండానే ఎవరేనావెళ్ళి విద్యుద్ఘంటయొక్క మీట నొక్కారంటే ఆమెకు సంతోషంట! ఈ విషయం నే దెలుసుకున్నాలే! ఇటువంటి పరిస్థితుల్లో నీవే రేపు మొదటిగంట అయిపోగానే సెకండవరు మధ్యలో స్విచ్చి నొక్కేసి, తర్వాతెప్పుడో తీరిగ్గా "ఉషాదేవీ! నిన్న సెకండవరు మధ్యలో స్విచ్చి నొక్కింది నేనే!" అనేశావనుకో! అప్పుడు నీవంటే అమాంతం ఆమె కెక్కడలేని ప్రేమ పుట్టుకొస్తుంది మరే మగ పురుగువంకా కన్నెత్తి చూడదు"

ఉద్యోగంకోసం తిరిగి తిరిగి నిరాశచెందిన ఒక యువకుడు ట్రేజడీ హీరో పోజుపెట్టి ఒక సినిమాపాట జాలిగా పాడు కుంటూ పోతున్నాడు.

"ఆకాశాన్నందుకునే ధర లొక వైపు--అదుపులేని నిరు ద్యోగ మింకొక వైపు.

"అవునవును--చీమల బారు ల్లాగ విడుదలయ్యే యీ సినిమా లొక వైపు." అన్నాడు అది విన్న ఒక పెద్దమనిషి.

సి. వి. ఆనందశర్మ (భీమునిపట్నం)

రఘునాథ్ నోరు తెరుచుకొని వింటున్నాడు. దీన్నే గనుక ఆసనాల లిస్టులో చేర్చితే "ఉన్మీల ముఖాసనము" అనవలసి వస్తుంది కాసేపటికి తెప్ప రిల్లి "బావుందోయ్! అయిడియా!!" అన్నాడు.

"నీవంటే నాక్కాస్త అభిమానముంది గాబట్టి యీ మంచి అయిడియాను నీకు చెప్పానోయ్! మరె వరేనా అడిగితే చెబుతానా ఏవిటి?" అన్నాడు శర్మ

"చాలా థాంక్సోయ్! అయిడియా చాలా బావుంది"

"అయిడియాను ఒహాటే మెచ్చేసుకుంటే ఏం లాభమోయ్?"

"అయిడియా బావున్నప్పుడు అయిడియా బావుం దని అనకపోతే ఎలాగోయ్?"

అయిడియా బావుందిసరే! మెచ్చుకున్నావు సరే! అంతేనా?"

"మెచ్చుకుంటే వూరికే మెచ్చుకున్నాన! అయిడియా బావుంది కాబట్టి!"

"అవునోయ్ అయిడియాను ఆచరణలో పెటా లంటాను!"

"ఓ అదా! అయితే అయిడియాను ఆచర ణలో పెట్టాలంటావ్?"

"తప్పక"

"వెంటనే నీవు చెప్పినట్టు చేసేయాలంటావ్?"

"అంతే!"

"ఎప్పుడైతే బావుంటుందంటావ్?"

"రేపే!"

"ఏ పీరియడ్ అయితే అనువుగా వుంటుందం టావ్?"

"చెప్పానుగా!"

"కానీ భయమేస్తోందే! ఏమన్నా అయితే!"

"ఏమవుతుందోయ్? ఆలోచించు!! ఆఫీసులో ఎవ్వరూ లేకుండాచూసి ఓ క్షణంపాటు స్విచ్చి నొక్కేస్తావ్ తర్వాత మెల్లగా జారుకుంటావ్! ఆనక తీరుబాటుగా ఉషాదేవిని కలుసుకొని "హల్లో ఉషా! నేనే ఫలానా రోజున అవరు మధ్యలో గంట కొట్టింది. అంత భూకంపం పుట్టించిన వీరుణ్ణి నేనే! నీవోటు నాకే!" అని చెప్పేస్తావ్. అంతే!"

"నిజమేలే! అయినా కాస్త అపాయం లేదం టావా?"

"ఉందనుకో! కాని సాహసించాలి! ఉషాదేవి లభిస్తుంది" రఘునాథ్ ఓ క్షణం తటపటా యించాడు ఆఖరుకు "రైట్! రేపే!" అన్నాడు.

"ఏవిటి? రేపే చేస్తావా?"

"ఓ యస్!"

"రేపు రెండో అవరు మధ్యలోనేనా?"

"యస్, యస్!"

"ఆఖరు క్షణంలో భయపడ్తావేమో?"

"నో, నో!"

"మరి అపాయం మాట?"

"సాహసం చేయాలి! ఉషాదేవి లభిస్తుంది!"

"వెరీగుడ్! అదీ మంత్రం! మర్చిపోవద్దు రేపు ఉదయం రెండో పీరియడ్ జరుగుతున్నప్పుడు. ఇక వెళ్ళిరా!" అని రఘునాథ్‌ని తోలేశాడు. వాడు ఉషారుగా వెళ్ళిపోయాడు. శర్మ "తదేకదృష్టి ఆసనము" వేయడంలో నిమగ్నుడైపోయాడు.

* * *

ఉషాదేవి కిటికీదగ్గర కూర్చుంది. రివ్వున సముద్రపు గాలి వీస్తూ, ఆమె మొహమ్మీది ముంగు రుల్ని చీకాకు పరుస్తోంది రెండో అవరు "కాం ట్రాక్ట్స్" బోరు కొడుతోంది పాఠం ఆమె వినిపించుకోవడంలా కిటికీలోంచి వెలుపలికి చూస్తోంది. అక్కణ్ణించి ఆమెకు కాలేజి ఆఫీసురూం కనబడుతుంది. ఆఫీసులో ఎవరూ ఉన్నట్టు లేదు. ఇంతలో ఒక వ్యక్తి ఆ గదివేపేరావడం ఆమె దృష్టిని ఆకర్షించింది. అత డేదో తప్పు చేసిన వాడిలాగా భయం భయంగా వస్తున్నాడు ఆఫీసు గదిలోకి అటూ ఇటూ చూసి మెల్లగా గోడమీది స్విచ్చివేపుకి చేయి చాచాడు. మళ్ళీ చేయిదించి గుమ్మం దగ్గరకొచ్చి అటూ యిటూ చూశాడు. ఈ సారి ధైర్యంగా గోడ దగ్గరికొచ్చి స్విచ్చివేపుకి చేయి చాచాడు. ఉషాదేవి సంతోషంతో కళ్ళు మూసు కుంది.

ఘంటారావం

ప్రిన్సిపాల్ ఆరోజు చాలా హడావుడిగా వున్నాడు. తన కాలేజికి అఖిలభారత కళాశాలల క్రమశిక్షణా పరిశీలక సంఘం వచ్చింది. ఆ సంఘంవారు కళాశాలను మొదటి గంట పరిశీలించారు. సెకెండవరు ప్రిన్సిపాలు వార్ని గదిలో కూర్చుబెట్టుకొని లెక్చరు ఇస్తున్నాడు.

"...కావున గౌరవనీయులైన అ. భా. క. క్ర. ప. సం. సభ్యులారా! మా కళాశాలలో క్రమశిక్షణా రాహిత్యానికేమీ అవకాశంలేదని ఘంటాపథంగా చెప్పగలను...."

ఎలక్ట్రిక్ బెల్ రింగున మ్రోగింది కాలేజి అంతటా ఆ ధ్వని ప్రతిధ్వనించింది.

ఒకేక్షణంలో బిలబిలమంటూ విద్యార్థులు బయటికి వచ్చేశారు. అందరూ క్లాసులు మారడానికి పూనుకున్నారు.

అదే సమయంలో ఉషాదేవి వెయిటింగ్ రూము వైపు వెడుతోంది. ఆమెను కలుసుకోడానికి శేషు వెడుతున్నాడు వాణ్ణి వెంట తరుముకుంటూ శర్మ వస్తున్నాడు. కాని అతణ్ణి శేషగిరి గమనించలేదు ఆదర్శ పురుషులిటువంటివారేకదా! తమ ధ్యేయాన్ని స్మరిస్తూ, చుట్టుపట్ల జరిగే అముఖ్య సంఘటనలను గమనించరు

శేషు నేరుగా ఉషాదేవి మార్గానికడ్డంగా నిలబడి "ఉషాదేవీ! ఇప్పుడు బెల్ కొట్టింది నేనే!" అన్నాడు. ఆమె వాచి చూసుకుంది సరిగా పన్నెండు గంటలయింది కోపంగా అతడివంక చూసింది. శేషు మరింత ధీమాగా "అవునండీ! నేనే ఈరోజు ఇప్పుడు గంట కొట్టాను" అన్నాడు ఆమె మాటాడలేదు ఆమె మొహంలో కోపమూ, అసహ్యమూ నృత్యం చేశాయి మొహాన్ని ఎర్రగా జేవురింపజేసుకుని గిరుక్కున ప్రక్కకు తిరిగి వెళ్ళిపోయింది.

శేషు ఆశ్చర్యపోతూ, ఆమె వెళ్ళిన దిక్కుకే చూశాడు. ఆమె ఎందుకో తనను అసహ్యించుకున్నదని మాత్రం గ్రహించుకున్నాడు. అయిపోయింది! ఇక తన జీవితంలోని ఆశాజ్యోతి ఘనమైపోయింది నిరాశగా వెనక్కి తిరిగాడు. ఎదురుగా శర్మ నిలబడి వున్నాడు

"చవటా!" అన్నాడు శర్మ. శేషుకు అర్థం కాలేదు "ఏవిటి?" అనడిగాడు.

"చవటా!" అన్నాడు శర్మ మళ్లీ ఇది రెండో దెబ్బ అసలే ఉషాదేవి చూపుతో క్రుంగిపోయివున్న శేషు మనస్సు ఈ మాటతో మరింత క్రుంగిపోయింది ఇలాటి శర్మగాళ్ళు ఇలా వందలూ, వేలూ పుట్టుకొచ్చి ఎక్కడబడితే అక్కడ నిలబడి తనని తిట్టడానికెందుకు ప్రారంభిస్తారో అతడికర్థం కాలేదు.

"నువ్వు చెయ్యమన్నట్టే చేశాగా!" అన్నాడు శేషు నేరం వాడిమీదకే తోసేద్దామని.

"చెయ్యమంటే కాస్త కామన్‌సెన్సు ఉపయోగించొద్దా! ఆ రఘునాథ్‌గాణ్ణి పీరియడ్

మధ్యలో గంట కొట్టమంటే ఆఫీసు రూము వరకూవెళ్ళి, భయపడి తిరిగి వచ్చేశాడు. ఇది మామూలుగా రెండో అవరు అయిపోయినప్పుడు కొట్టేబెల్. నే ననుకున్న ప్లానంతా భగ్నమయింది. పోనీ నీవైనా ఊరికే వుంటావంటే కాస్తయినా గమనించుకోకుండా మహావీరుళ్ళా ఉషాదేవితో "నేనే ఈ గంట కొట్టా"నని చెప్పేశావు ఇక ని న్నామె ఎంతగా అసహ్యించుకుంటుందో వేరే చెప్పాలా?"

శేషు, "ఏం చేయను? నా దగ్గర వాచీలేదు" అన్నాడు.

"సరేలే! నాదే తప్పయిపోయింది. పద రూముకి పోయి కొత్త ఆలోచన చేద్దాం"

"నేరాను!" అన్నాడు శేషు.

"విసిగించక రావోయ్! మంచి అయిడియా తడుతోంది!"

"నీ అయిడియాలు నువ్వేదాచుకో! నా కఖ్ఖర్లేదు"

"సర్లే! ముందు రూముకి పద"

"నే రాను!" శేషు మొండి కెత్తాడు.

"ఇదొక్కసారీ వినవోయ్! దారుణమైన అయిడియా తట్టేసింది. ఈ దెబ్బకు నీ రొట్టె విరిగి నేతిలో పడుతుంది" అని శర్మ బ్రతిమాలుకున్నాడు. కాని శేషు వినలా. ఇంతలో వర్మ అక్కడి కొచ్చాడు.

శర్మ చేసేదిలేక వర్మకేసి చూసి "చూడరా భాయ్! నీవేనా కాస్త సాయం చేయ్!" అన్నాడు. కథనంతా తెలుసుకొని వర్మ ఇలా అన్నాడు "నాదేమంత మంచి బుర్ర కాదనుకో! పెద్ద అయిడియాలేమీ రావు. కాని ఇప్పుడు నాకు తోచిన ఒక అయిడియా వినిపిస్తాను. మీకు బావుందనితోస్తే అనుసరిద్దాం వినండి!" అన్నాడు.

* * *

మరుచటిరోజు ప్రొద్దున్నే శర్మ ఉషాదేవి ఇంటికొచ్చాడు. ఆమెను పిలిచి "ఏవండీ! చూశారా! ఘోరం జరుగబోతోంది. మా శేషగిరి ఉదయానే గదిలోకెళ్ళి తలుపేసుకున్నాడు తెరవమంటే తెరవకుండా వున్నాడు. "ఉషాదేవి నన్ను అసహ్యించుకున్నాక నేను బ్రతికేంలాభం?" అన్నాడు ప్రొద్దున్నే. నిన్న రాత్రే ఒక పిస్తోలు కూడా తీసుకొచ్చి టేబిల్ డ్రాయర్లో పెట్టుకున్నాడండీ! ఏం చేస్తాడోనని భయంగావుంది! పాపం నిన్నరాత్రి భోంచేయలేదు కూడానూ!" అన్నాడు ఆందోళనగా

ఉషాదేవి మొహంలో భయ చిహ్నాలు స్పష్టంగా పొడకట్టినై "అయ్యో! ఘోరాన్ని జరగనీయకండి!! నే చెప్పాననిచెప్పి, యిక్కడికి తీసుకురండి!" అన్నది తానూ ఆందోళనని వ్యక్తం చేస్తూ.

"నే జెబితే వస్తాడని నాకేం నమ్మకం లేదండీ! మీరేవచ్చి వాణ్ణి యిక్కడికి పిలుచుకొని రాకపోయారంటే ఏదో ఒక క్షణంలో వాడు ఘోరకృత్యాన్ని చేసేస్తాడు. తర్వాత మనం విచారించి లాభం వుండదు" అన్నాడు.

ఉష కాసేపు తటపటాయించింది. చివరికి "సరే! పదండి! నేనే వచ్చి యిక్కడికి తీసుకొస్తాను" అని శర్మతో బయలుదేరింది.

అదృష్టవశాత్తూ వీధి కవతలవున్న మేడమీది గదిలోకి ఈ మాటలేవీ వినబడలేదు. కానీ ఆ దృశ్యాన్ని మాత్రం నాలుగు కళ్ళు పరిశీలిస్తూనే వున్నయ్.

వా రిద్దరూ వెళ్ళిపోయాక వర్మ రఘునాథ్ తో అన్నాడు : "చూశావుటోయ్! రఘూ! ఇదీ వరస! నే జెబితే నువ్వు నమ్మలేదుగానీ, వాళ్ళిద్దరూ—అంటే మన శేషూ, శర్మలు—కలిసి నిన్ను అపాయంలో యిరికించాలని చూశారు. నువ్వే గనక తొందరపడి గంట కొట్టివుంటే ఏమయిపోయేవాడివో!! వాళ్ళ స్వార్థంకోసం నిన్ను బలిపెట్టాలని చూశారు. అదృష్టవంతుడివి కాబట్టి తప్పించుకున్నావ్!"

"ఇంతకీ ఆ శేషుగాడు ఉషాదేవి నెలా మాయ చేయగలిగాడంటావ్?"

"శేషు ఎంత దుర్మార్గుడయినా అఖండుడోయ్! మనకి వాడంటే ఎంత గిట్టకపోయినా, యిది మాత్రం వప్పుకు తీరాలి. ఏం మచ్చుమందు జల్లాడో మరి! ఉష వాడంటే ఎంత ఆతురుత పడుతున్నదీ చూశావుగా!"

ఇంతలో ఉషాదేవి శేషగిరిని వెంటపెట్టుకుని వచ్చింది. శర్మ వారిని గేటు వరకూ సాగనంపాడు.

"చూశావా! చూశావా!! ఒకటేసారి వెంటబెట్టుకునే వచ్చేసింది శేషుని! ఇక లాభంలేదు. పరిస్థితి చేయి జారిపోయింది" అన్నాడు వర్మ.

రఘునాథ్ గట్టిగా కిటికీ తలుపుని విసిరి కొట్టాడు. కోపంతో ఎర్రబడి "ఈ వెధవ గదిలో నే నొక్క క్షణం కూడా వుండను!" అన్నాడు.

"అవునోయ్! వెంటనే గది మార్చెయ్! ఇక్కడుంటే ఊరికే బాధ పడతావు కూడాను! వేరే గదికి మారితే కాస్త మనశ్శాంతి అయినా లభిస్తుంది!" అన్నాడు వర్మ "మరిక నే వస్తానూ! వనుంది!!" అని శెలవు పుచ్చుకున్నాడు.

రోడ్డుమీద శర్మ వాణ్ణి కలుసుకున్నాడు "ఏమిరా శల్యుడా! పరిస్థితి ఎలావుంది!" అనడిగాడు.

"సంతృప్తికరంగానేవుంది" అన్నాడు వర్మ

"ఇక మనవాడి జోలి రాడుకదా!"

"ఊహూ!"

"వెరీగుడ్! ఇంతకీ చాల గొప్పవాడివిరా నువ్వు!" శర్మ మిత్రుణ్ణి అభినందించాడు

"నాదేం గొప్పతనంలేరా! ఏదో అనుకున్నట్టు జరిగిపోయింది!" అన్నాడు వర్మ.

"ఇంతకీ మన శేషువున్నాడే. . . ." శర్మ ప్రారంభించాడు.

"అవున్రా! వాడు అదృష్టవంతుడు" అని వర్మ ముగించాడు. ☆

న్యూఢిల్లీ లేఖ

(7-వ పేజీ తరువాయి)

శాసనసభ దీనిని తిరస్కరించింది. దీనివల్ల బ్రిటిష్ వలస ప్రదేశాలన్నిటిలోనూ, భారతదేశంలో ఉత్పత్తిఅయిన వస్తువులకు ప్రభుత్వ విధానం వల్ల గిరాకీ ఉండేది. ఇది ముప్పై సంవత్సరాల క్రిందటిమాట బ్రిటిష్ సామ్రాజ్యం క్రమంగా నశిస్తోంది. దానితో మనదేశపు సరుకులపట్ల అభిమానం చూపే అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు, సింహళంలో భారతదేశపు వస్తువులు స్వేచ్ఛగా దిగుమతి అయ్యేవి. ఇప్పుడు స్వతంత్రదేశం కాబట్టి సింహళానికి పన్నులు క్రమబద్ధంచేసుకొనేహక్కుఉంది అంటే భారతదేశపు వస్తువులకు బ్రిటిష్ వలస ప్రదేశాలలో మాత్రమే ఆదరణ లభించే అవకాశం ఉన్నదన్నమాట

భారతదేశం; ప్రత్యేకంగా శ్రీ నెహ్రూ, వీలైనప్పుడల్లా, వలస తత్వాన్ని ఎదిరిస్తారు అవకాశం దొరికితేచాలు సామ్రాజ్యవాదంపట్ల నిరసన తెలుపుతారు శ్రీ నెహ్రూ ఒక వైపు సామ్రాజ్యవాదాన్ని ఖండిస్తూ, మరొకవైపు దానివల్ల వచ్చే సౌకర్యాలు కావాలనటం చిత్రంగా ఉంటుంది!

బ్రిటన్‌లో భారతదేశపు సరుకులకు ప్రత్యేకమైన గిరాకీఉంది కాని ఈ పద్ధతి ప్రవేశపెట్టినప్పుడు భారతదేశంలో బ్రిటిష్ సరుకులకు కూడా అదే సౌకర్యం ఉండేది దీని అర్థం ఏమిటి? స్వలాభంకోసం భారతదేశం బ్రిటిష్ సరుకుల దిగుమతులను తగ్గించింది కొన్నిటిని పూర్తిగా నిషేధించింది కూడా. కాని ఇదే పనిని బ్రిటిష్ ప్రభుత్వంచేస్తే సహించలేదు.

ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీదేశాయ్ ఇటీవల ప్రసంగిస్తూ, బ్రిటన్ గనుక యూరోపు సమష్టి విపణిలో ప్రవేశిస్తే 'కామన్వెల్త్' నాశనమై పోతుందన్నారు లాహోర్ తీర్మానం జరిగిన నాటినుంచీ కాంగ్రెస్ దీనికి కాక, మరి దేనికి కృషి చేసినట్లు?

ఎవరంటేవారు భారతదేశం వచ్చి—దక్షిణాఫ్రికా దేశస్థులు తప్పితే — స్థిరపడిపోవచ్చు కాని 1947 తర్వాత ఇక్కడకువచ్చి స్థిరపడిపోయిన 'బ్రిటిష్‌వారి సంఖ్య బ్రిటన్‌కి తరలి వెళ్ళిపోయిన భారతీయుల సంఖ్యతో పోల్చిచూస్తే తేలేది ఏమిటి? మన దేశంలోని విదేశీ వ్యాపార సంస్థలలో వీలైనంతవరకూ ఈ దేశంవారినే నియమించాలని భారత ప్రభుత్వం ఎందుకు చెప్పాలి?

'వెస్ట్ ఇండీస్' వారి మూలంగా బ్రిటన్‌లో నేర నిరోధక సమస్యలు అధికమయ్యాయని, ప్రభుత్వానికి తెలుసు అమలులోకి రాబోయే నిబంధనలు కూడా వీరిని ఉద్దేశించేనని కూడా తెలుసు కాని, 'వెస్ట్ ఇండీస్' వారిని మాత్రమే నిషేధించే చట్టం సాధ్యంకాదుకదా!

ఢిల్లీ మునిసిపాలిటీలో ఒక 'హెల్త్ ఇన్‌స్పెక్టర్' హోదాగల ముగ్గురు ఇంగ్లాండ్‌లో స్థిరపడిపోయిన సంగతి నాకు స్వయంగా తెలుసు వారిలో ఒకరు లండన్ వీధి దీపాలశాఖలో పని చేస్తున్నారు. మిగిలినవారు ఇద్దరూ రోడ్లమీద ఇవీ అవీ అమ్ముకుని బ్రతుకుతున్నారు. ఈ దేశంలోనే ఉంటే ఎంత ఆర్జించగలిగేవారో దానికి నాలుగు రెట్లైనా అక్కడ సంపాదిస్తున్నారు. వారికి విద్యాభ్యాసం లేదు దేశం వదిలేముందు ఇద్దరికీ ఇంగ్లీషు కూడా రాదు జీవనోపాధి కోసమే బ్రిటన్‌కు ఇంతమంది వెళ్తున్నారు.

బ్రిటన్‌లో మరొక ఆకర్షణఉంది ఎవరైనా సరే 'ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజి'కి వెళ్ళి పేరు నమోదు చేసుకోవచ్చు వెంటనే అలా చేసిన వారికి వారానికి సుమారు 5 పౌండ్లు (ఇంచు మించు 66 6 రూ) 'నిరుద్యోగుల భత్యం క్రింద దొరుకుతుంది. అంటే తిండిలేక మాడడమంటూ ఉండదు

నౌకల రవాణా 'సమస్య' కూడా ఇంతే ఖర్చులు ఎక్కువ కావటంచేత తీరాల వెంబడి ప్రయాణం చేసే భారత నౌకలు కలకత్తానుంచి దక్షిణ, పశ్చిమ ప్రాంతాలకు బొగ్గు తీసుకు వెళ్ళమంటున్నాయి. కేరళలో తిండికిలేక మలమల మాడుతున్న ప్రజలకు బియ్యం కావలసివస్తే ఈ నౌకలు నడిపించేవారు, గిట్టుబాటులేదని, కలకత్తాలో దొరుకుతున్న బర్మా బియ్యం తీసుకు వెళ్ళడంలేదు. కాని బ్రిటిష్ నౌకా సంస్థలు తమ రవాణా రేట్లు 10% హెచ్చు చేస్తామంటే భారతదేశం తీవ్ర నిరసన ప్రకటించింది ఈ నౌకా సంస్థలు, మన నౌకా సంస్థలతోబాటు ఒక 'యూరోపా సంఘం' సభ్యులు. దీనిని పురస్కరించుకునే భారత నౌకా సంస్థలు తమ రేట్లు హెచ్చింపగలమని బెదిరించ గలుగుతున్నాయి.

కాని ఇవే భారత నౌకా సంస్థలు తమ ప్రభుత్వం చెప్పినట్లు వినటానికి సిద్ధంగాలేవు తమ రవాణా రేట్ల విషయంలో ఏమాత్రం తగ్గింపు చూపటం లేదు

మరొక విధంగా చెప్పాలంటే, స్వదేశీ కంపెనీలు తమ రేట్లు లధికంచేస్తే ప్రభుత్వం ఏమీ చెయ్యలేకపోతోంది విదేశీ కంపెనీలు హెచ్చు చేస్తానంటేమాత్రం ఒప్పుకొనటంలేదు.

* * *


'గోవా జాతీయోద్యమ సంఘా'నికి శ్రీమతి ఆసఫాలీ అధ్యక్షురాలు గోవా విషయంలో అవసరమయితే 'అహింసా సిద్ధాంతాన్ని' వదులుకోవచ్చునని ప్రధాన మంత్రి సూచించారు శ్రీమతి అసఫాలీకి "లింక్" వార పత్రికతో సాన్నిహిత్యం ఉంది. శ్రీ కృష్ణమీనన్ ఆమె ఆప్తమిత్రులలో ఒకరు

పధ్నాలుగు సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ సంస్థ ప్రత్యేకంగా శ్రీ నెహ్రూ, గోవా విమోచన అవసరమని గుర్తించారు సరిగ్గా ఎన్నికలముందు ఈ ఉద్యమం ప్రారంభించే అవసరం ఎందుకు వచ్చింది? దీనికి సమాధానం సులభంగా లభిస్తుంది శ్రీ కృష్ణమీనన్ బొంబాయినుంచి పోటీ చేస్తున్నారు వారి ఎన్నికపైన ఈ ఉద్యమం ప్రభావం బాగా ఉంటుంది—కొందరు ఈ విధంగా భావిస్తున్నారు.

భారతభూభాగాన్ని ఆక్రమించిన చౌ—ఎన్—లాయ్‌తో "సంప్రదించాలి, సంప్రదించాలి, సంప్రదించాలి" అంటారు శ్రీ నెహ్రూ చైనాపట్ల భారతదేశం అహింసా మార్గం అవలంబించింది గోవాసంగతి వేరు ఎప్పుడూలేని ఆవేశం వచ్చేసింది బలం ఉపయోగించటానికి గోవా పోర్చుగీస్‌పాలనక్రింద ఉండానికాదు. కృపలానీకి కూడా సమానావకాశం ఇవ్వాలని అభ్యర్థన. "పోలీస్ చర్య" అసలు విషయం గందరగోళం చెయ్యడానికి మాత్రమే ★

శ్రీకృష్ణ.

గళ్లనుడికట్టు-79



అడ్డం

1 తినే వస్తువులాగ ఉన్నా, పోలిక మాత్రమే!

3 మెకముల సరములలో మిట్ట నేల.

5 చెల్లించుకునేది !

7 మనవాడు దీర్ఘం తగ్గించినా మళ్లా మన వాడే అవుతాడు !

9 తొమ్మిది తర్వాత తర్వాత సహస్రాలా ? మొత్తంఎన్ని ? నాలుగునున్నాలా ?

12 ఆదిక్కున మొదటిది ఏదీ?

13 చేత కాదు, సరే మధ్యతీసి రుచి ఏర్పరచండి.

15 మర్యాద

17 నకలువనజం కాదు !

19. కుండలో దగ్గర!

20 పార్వతి.

21 కపాలము

23 పరవశములో లోకువ ఉన్నదా?

25 జంట.

28 సరసతి లో భర్త!

30 మక్షిక, ఊదగలరా?

31 అవతల గడవకుండా ఉంటే—తలక్రిందది

34. చలనము.

38 కంటే, పట్టే ముందు?

39 లోపించినది, దొంగిలించిన సొత్తు. సప్త విషయములు వెతికి చూడండి.

40 గోశ్రేణి—గేదె తతంగము నేడు వెతకండి.

నిలువు

1 స్వర్గారోహణకు ముందుది.

2 ఏమన్నను సమ్మానమునకు కొంచెం చేరిస్తే వస్తుంది.

3 దీనికికూడా మేత కావాలంటారు!

4. పలకలో కొయ్య

5 క్రిందనుంచి జవము.

6. పుల!

7 బుద్ధి మనది వెతికి చూడండి!

8 — బోతు అంటారు!

10 దిగు! లుబ్ధునికి విచారమా?

11 తల క్రిందు లయిన క్షేత్రాలు.

12 అవల సర్షపము వెతకండి.

14 చమూరువు.

15 నావ.

16 క్రిందనుంచి సౌందర్యము. చమురు పావులో రెండు తగ్గించండి!

17 ఎటు నుంచైనా నీటి బొట్టు.

18 కలగాపులగ మయిన ప్రేమ.

22 ఈ సారి!

24 పప్పు దినుసు.

26. నీటి పొంగు.

27 శ్యేనము.

29. తల క్రిందులయిన సమూహము.

30 ఎరక

32 నాలుక; పాలనలలోనే వెతకండి!

33 ధనములు.

34. మిక్కిలి, చెయ్యి.

35 వ్రాత ఇదే!

36 తీగలో సగం మార్చినా మళ్ళీ అదే!

37 ఈ రోజు

78-వ గళ్లనుడికట్టుకు జవాబు

1 కం	■	2 టి	3 మి	4 న	5 ర	■	6 కు
7 డు	8 వ	9 డ	10 గా	11 మం	12 టి	13 మి	14 నే
15 డ	16 ను	17 చు	18 వె	19 స	20 న	21 మ	22 ర్యు
23 లు	24 ము	25 ను	26 లు	27 న్	28 మిం	29 టం	30 బు
31 వ్వ	32 లు	33 గు	34 రి	35 యు	36 చు	37 బం	38 టిం
39 ప	40 క	41 పొ	42 గ	43 డి	44 రో	45 లి	46 బ
47 ద్మ	■	48 ద	49 ళా	50 క్షు	51 న్	■	■

ఉపన్యాసం వినివచ్చిన ఒక దొంగ మరొక దొంగతో "ఇంకా ఆదర్శంగా బ్రతకాలంటే నేమిటి?" అని అడిగాడు.

"నువ్వు కత్తిరిస్తున్న జేబులు చాలును. ఇంకా ఎక్కువ కత్తిరించమని గీని భావం!"

"అయితే అతడు బాగా చెప్పేడే!"

సి హెచ్. కుసుమ (గుంటూరు)

పొట్టి కథలు

వీళ్ళకి ఎంతచేసినా ఇంతే!

ఆమె: ఇదిగో మిమ్మల్నే. ఏమిటిదీ? ఇప్పటికి హెడ్డింగు మొదలు ప్రింటెడ్ అండ్ పబ్లిష్డ్‌బై దాకా మూడుసార్లు తిరగెయ్యడమయిందే కానీ, మీ వంట మాత్రం పూర్తికాలేదు. ఏదో చెప్పినట్లు ఓలి తక్కువని గుడ్డి దాన్ని పెళ్లాడితే ఇంకెడు కుండలూ పగలకొట్టిందని, అలా వుంది మీ పని. ఏమిటో ఎంత సేపుచూసినా పొగే కాని అన్నం పెట్టటం కనపట్టంలేదు. కళ్లుపోతున్నాయి పొగతో. బాగానే వుంది వరస. ఇలా అయితే అయినట్టే. పువ్వుల్లో పెట్టి పూజించుకుంటానంటే మా అమ్మ పంపిందికాని మీతో, ఇలా సంతకెళ్లే పశువుకి పెట్టినట్టు పొగ పెడ్తారని తెలిస్తే ఒక్కనాటికి పంపివుండేది కాదు.

అతను:- నన్నేం చెయ్యమన్నావు వరాలూ? నేను మాత్రం ఊరికే కూర్చుంటున్నానా? అప్పటికీ ఒళ్లదిరిపోయేటట్టు రెక్కలు ముక్కలు అయేటట్టువిసురుతున్నానాయిరి. దాందుంప తెగిరి, ఏమిటో ఈపొయ్యి మండి చావటంలేదు, ఎంత సేపూ పొగేకాని. నేను ఊరికే కూర్చున్నానని నువ్వు ఎక్కడ అనుకునిపోతావోనని ఆ కుర్చీకూడా వంటింట్లోనే వేశేనాయిరి. అక్కడికీ నువ్వు చూస్తూనే ఉన్నావాయిరి చెమటలుక్కారి ఇల్లంతా ఎలా తడిసిపోతోందో. ఈ పుస్తకాల్లో వంటెలా చెయ్యాలో తప్ప పొయ్యి ఎలా ముంటబెట్టాలో వ్రాసి తగలబెట్టలేదాయిరి. ఏం చెయ్యమన్నావో చెప్పు. నా ఐదు ఏళ్ళ వంటింటి సర్వీసులోనూ ఇట్టాంటిది ఎప్పుడూ చూడలేదు.

కాశీభట్ల (బ్రహ్మానందం)

* * *

అలవాటు

గిద్దలూరులో బస్సు కండక్టర్లు, డ్రైవర్లు కలిసి జనవరి 1వ తేదీ విందుచేశారు. అందులకుగాను చాలామందిని ఆహ్వానించారు. దాదాపు 400 మంది వచ్చారు. కండక్టర్లు అన్నము, కూరలు వడ్డిస్తున్నారు. కొందరు అన్నము తింటున్నారు. అన్నమునకు కూర్చొనిన్న వారికి అన్నము వడ్డించుచుండిరి. మార్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల బస్సు కండక్టరుకు వంకాయల కూరను వడ్డించమని ఇచ్చారు. కండక్టరు కూర పాత్రను పట్టుకొని బండి వెంబడి కంభం, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల అని తన మామూలు ప్రకారము అరవ సాగిగాడు. అందరు ఈ మాటలు విని పకపక నవ్వుకొన్నారు.

ఎస్. మహబూబ్ జేల, (కర్నూలు)

* * *

తల్లి: చెల్లాయిని అలా ఏడిపించే బదులు అది అడిగిందేదో ఇవ్వకూడదూ!

కొడుకు: అలాగే చేశానమ్మా! పచ్చిమిరపకాయ అడిగింది ఇచ్చేశాను.

పామిడి లక్ష్మినారాయణ (అనంతపురం

* * *

టీచరు :- "ఒరేయ్ గోపి! శంకరుడు వస్త్రములు ధరించక, కైలాసపర్వతముపై ఎందుకు నివసిస్తున్నాడురా ?

గోపి :- "నల్లుల బాధకు సార్."


బి. నరేంద్రారెడ్డి (బొందుగుల)

బొంబాయి ఆంధ్రమహాసభవారు జరిపిన కథల పోటీలో మొదటి మూడు బహుమతులుపొందిన కథలు వరుసగా ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురిస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

శ్రీ ఎ. వేణుగోపాలరెడ్డి రచించిన మొదటి బహుమతి కథ 24-11-61 సంచికలో ప్రచురిస్తాము. మిగిలిన రెండు కథలూ తర్వాతి రెండు సంచికలలో 'పడ్తాయి.'

ఈ పోటీ 'నిర్ణేతలు' శ్రీ యస్. యం. వై. శాస్త్రిగారు ఆంధ్రమహాసభ అధ్యక్షులు, బొంబాయి మున్సిపల్ కమిషనర్; వీరికీ, రచయితలకు, ఆంధ్రమహాసభవారికి మా హృదయపూర్వకాభినందనలు.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



ద శ కం ఠు డు

ఫొటో: సత్యారావు (ఖర్గపూర్)


RAJA
(REGD)
COSMETICS
SOAPS
PERFUMERY
ESSENTIAL OILS
HAIR OIL
For The Skin
USE
"RAJA"
(TRADE MARK)
HAIR OIL
KASTURI SOAP
HAIR FIXER
FACE POWDER
TOOTH PASTE
AGARBATHI ETC.
MANUFACTURERS
MANYAM & CO.
BANGALORE
"RAJA"
(REGD)
SNOW
for Beauty & Complexion
MANUFACTURERS
MANYAM & CO.
BANGALORE
MADE IN INDIA
RAJA
AMLA
RAJA
RAJA
AGARBATHI
RAJA
(REGD)
Kasturi Soap